జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 27 ఆగస్టు 2026 | సంపుటి: 19 | సంచిక: 173 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: చతుర్దశి - 09:10:51 వరకు నక్షత్రంధనిష్ఠ - 26:16:19 వరకు కరణంవణిజ - 09:10:51 వరకు, విష్టి - 21:34:15 వరకు పక్షంశుక్ల యోగంశోభన - 07:55:29 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL   http://www.prajajyothinews.com   Mail: prajajyothidaily@gmail.com


## అమెరికా మరో దుందుడుకు చర్య

### వీసా ఇంటర్వ్యూల నిలిపివేత

వాషింగ్టన్,ఆగస్ట్26(ప్రజాజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇమిగ్రేషన్ విధానాలతో వలసదారుల్ని వణికిస్తున్నారు. తాజాగా అమెరికా ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను అర్ధంతరంగా నిలిపివేసింది. కొన్ని షెడ్యూల్డ్ ఇంటర్వ్యూలను రద్దు చేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

మిగతా 2లో..

## 11 వేల కిలోమీటర్ల మేర 'ఫోర్ ట్రాక్' లైన్లు

### దేశంలో హై-డెన్సిటీ రైల్వే నెట్‌వర్క్ రూపకల్పన
### కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్ట్26(ప్రజాజ్యోతి): దేశంలోని 7 ప్రధాన రైల్వే మార్గాలను ఫోర్- ట్రాక్‌గా (నాలుగు లైన్లు) విస్తరిస్తున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. దాదాపు 11 వేల కిలోమీటర్ల మేర సాగే ఈ భారీ ప్రాజెక్టుతో ప్రయాణికుల రద్దీ తగ్గుతుందని భావిస్తున్నారు. సరకు రవాణా సామర్థ్యాన్ని గణనీయంగా పెంచడం కూడా ఈ భారతీయ రైల్వే

మిగతా 2లో..



# ప్రకృతి విలయం..

## నేపాల్‌లో ఆకస్మిక వరదలు

- వరదల్లో వందలాది మంది గల్లంతు
- అందులో 105 మంది భారతీయులున్నట్లు అంచనా
- టిబెట్‌లో భారీ వర్షాలతో ఉప్పొంగిన కోశీనది
- బురదమయంగా మారిన కొండతీర ప్రాంతం
- టిబెట్ భూకంపంతోనే నేపాల్‌లో వరదలు
- నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్

నేపాల్‌లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు తీవ్ర బీభత్సం సృష్టించాయి. ముఖ్యంగా టిబెట్ సరిహద్దుకు సమీపంలోని పర్వత ప్రాంతమైన రసువా జిల్లాలో బుధవారం, ఆగస్టు 26, 2026న సంభవించిన భారీ వరదల కారణంగా అనేక గ్రామాలు నీట మునిగాయి. రహదారులు, వంతెనలు, విద్యుత్ మౌలిక వసతులు, పవర్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నప్పటికీ, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. రసువా జిల్లాలోని స్యాప్రుబేసి, టిమురే ప్రాంతాల్లో వరద ప్రభావం తీవ్రంగా ఉంది. ఇప్పటివరకు కనీసం ఎనిమిది మృతదేహాలను గుర్తించినట్లు నేపాల్ పోలీసులు తెలిపారు. "ఇప్పటివరకు ఎనిమిది మృతదేహాలు లభించాయి. సహాయక, రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి" అని పోలీస్ ప్రతినిధి అబి నారాయణ్ కాఫ్లే వెల్లడించినట్లు సమాచారం.



ఖాట్మండ్,ఆగస్ట్26(ప్రజాజ్యోతి): నేపాల్‌లో బుధవారం ఉదయం అకస్మాత్తుగా ముంచుకొచ్చిన వరదలు అనేక మందిని పొట్టనపెట్టుకున్నాయి. 105 మంది భారతీయులు కూడా ఈ విపత్తులో గల్లంతయ్యారు. ఓ అంచనా ప్రకారం 1500 మంది గల్లంతయ్యారని అంటున్నారు. చైనాతో సరిహద్దుకు సమీపంలోని రసువా జిల్లాలోని భోటే కోశీ నదిలో ఒక్కసారిగా వరద పోటెత్తడంతో తీరంలోని అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలో నేపాల్‌కు దిగువన ఉన్న బిహార్, యూపీ రాష్ట్రాలు కూడా అప్రమత్తమయ్యాయి. మరోవైపు, ఈ అకస్మిక వరదలకు కారణం ఏంటో తెలుసుకునేందుకు నేపాల్ అధికారులు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. ఆకస్మిక వరదలు కేవలం గంటల వ్యవధిలోనే విరుచుకుపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఒక్కసారిగా భారీ స్థాయిలో కుండపోత వర్షం కురిసినా, లేదా నదీప్రవాహానికి అడ్డుగా ఉండే కొండచరియలు విరిగి పడిన సందర్భాల్లో కూడా

## నేపాల్ వరదలతో భారీగా ఆస్తి,ప్రాణ నష్టం

- దెబ్బతిన్నఇళ్లు, రోడ్లు, వంతెనలు, ప్రాజెక్టులు
- సహాయక చర్యలకు దిగిన భద్రతా బలగాలు
- నేపాల్ ప్రధానికి భారత ప్రధాని మోడీ ఫోన్
- వరదలపై ఆరా తీసిన భారత ప్రధాని మోడీ
- సహాయ సిబ్బందిని పంపుతామని హామీ

ఖాట్మండ్,ఆగస్ట్26(ప్రజాజ్యోతి): మెరుపు వరదలపై నేపాల్ ఎంబసీ బుధవారం సాయంత్రం కీలక ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలో.. నేపాల్‌లో భారీ వరదలు సంభవించాయని, వరదల్లో భారీగా ఆస్తి, ప్రాణ నష్టంతో పాటు

మిగతా 2లో..

# యంగ్ ఇండియా.. స్పోర్టింగ్ ఇండియా

- రాష్ట్రంలో యువ అథ్లెట్లకు అవకాశం
- ప్రపంచ స్థాయి క్రీడా సామర్థ్యాలు
- ఒలింపిక్స్‌లో రాష్ట్ర సత్తాచాటుతాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- కేఎన్ఎస్‌యూ బృందంతో సమావేశం
- కొరియా స్పోర్ట్స్ వర్సిటీతో ఒప్పందం

హైదరాబాద్,ఆగస్ట్26(ప్రజాజ్యోతి): పల్లెలు, పట్టణాల నుంచి ఒలింపిక్ పోడియం వైపు ప్రయాణానికి తెలంగాణ సిద్ధమవుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. యంగ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీతో ఎంవోయూ చేసుకుంది. ఎంవోయూపై హర్షం వ్యక్తం చేస్తూ రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రపంచంలోని అత్యున్నత క్రీడా ప్రతిభ సంస్థల్లో ఒకటైన కేఎన్ఎస్‌యూతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

మిగతా 12లో..



# 22ఎను వెంటనే తొలగించాలి

- లేకుంటే సచివాలయం ముట్టడిస్తాం
- భూకబ్జాల హైదరాబాద్ బ్రాండ్‌కు దెబ్బ
- రేవంత్ ప్రభుత్వం భూ అమ్మకాలతో బిజీ
- బిఆర్ఎస్ నేత హరీస్ రావు విమర్శలు



హైదరాబాద్,ఆగస్ట్26(ప్రజాజ్యోతి): కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్ పాలన భూముల కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను రేవంత్ ప్రభుత్వం దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితులకు న్యాయం చేసే బాధ్యత తమపై ఉందని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు.. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములన్నీ అమ్ముకుంటూ.. భావి తరాలకు జాగా లేకుండా చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల ఆస్తులనేమో 22-ఏ నిషేధిత జాబితాలోకి.. ప్రభుత్వ భూములనేమో రేవంత్ సోదరుల చేతుల్లోకి నెడుతున్నారని ఆక్షేపించారు. లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని పారిశ్రామికవేత్తలకు కమీషన్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎప్పుడు హైడ్రా వస్తుందో..

మిగతా 2లో..

## నేటినుండి రాష్ట్రవ్యాప్త గ్రామ సభలు

హైదరాబాద్,ఆగస్ట్26(ప్రజాజ్యోతి): ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా నేటినుండి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామ/వార్డు సభలు కీలకం కానున్నాయి.

మిగతా 2లో..

## ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

### భట్టితో కొండా మురళి, రాజగోపాల్ భేటీ
### మామూలుగానే కలిశామని వ్యాఖ్యలు
### సుష్మిత వ్యాఖ్యలతో సంబంధం లేదన్న కొండా మురళి

హైదరాబాద్,ఆగస్ట్26(ప్రజాజ్యోతి): కాంగ్రెస్‌లో రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. క్రమశిక్షణ కమిటీ నివేదిక అందిన తరవాత కొండామురళి రంగంలోకి దిగారు. నేరుగా ఆయన డిప్యూటి సిఎం భట్టిని కలిశారు. అయితే సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో తాను ఎలాంటి చర్చ చేయలేదని కాంగ్రెస్ నేత కొండా మురళి స్పష్టం చేశారు. అయితే, సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని కొండా సురేఖ స్పష్టం చేశారు. తాము కాంగ్రెస్‌ను వీడేది లేదని మంత్రి కొండా సురేఖ భర్త , ఆ పార్టీ నేత కొండా మురళి అన్నారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా మురళి సమావేశమయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాల నేపథ్యంలో కీలక నేతలు భేటీ కావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇప్పుడే వీరంతా ఎందుకు భేటీ అయ్యారన్నది చర్చ జరుగుతోంది. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ అంశం, తాజా రాజకీయ

మిగతా 12లో..



# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### ఆగివున్న లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు
### ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికుల దుర్మరణం
### మృతులంతా ఏపికి చెందిన వారిగా గుర్తింపు
### ఘటనపై సిఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి
### తక్షణ సహాయక చర్యలకు ఆదేశం..

సూర్యాపేట,ఆగస్ట్26(ప్రజాజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన వారు ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. ఐరన్ సామగ్రితో రహదారిపై ఆగి ఉన్న లారీని బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో.. ఐరన్ షీట్స్ బస్సులోకి చొచ్చుకెళ్లాయి. దీంతో నిద్రమత్తులో

మిగతా 12లో..

## తెలంగాణ సమ్మిట్ కోసం వార్ రూమ్

### అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి
### ప్రజాభవన్‌లో మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష



హైదరాబాద్హైదరాబాద్,ఆగస్ట్26(ప్రజాజ్యోతి): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026-ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం

మిగతా 12లో..

# సంపాదకీయం

## ఆర్థికపతనం దిశగా.. అమెరికా ఫస్ట్ నినాదం!

ఇరాన్‌తో జరిగిన యుద్ధం, అంతర్జాతీయంగా వివిధ దేశాలతో అనుసరిస్తున్న విధానా వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతోంది. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల సామాన్య పౌరులను చికాకు పెట్టిస్తోంది. ఇప్పటికే అక్కడ గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. నిత్యాసవర ధరలు కూడా పెరిగాయి. ఇరాన్‌తో యుద్ధం వల్ల అమెరికా ఓ రకంగా చతికిలపడిందనే చెప్పాలి. ఈ అనుభవం రష్యాకు కూడా వచ్చింది. ఉక్రెయిన్‌పై దాడులు రష్యానూ దెబ్బతీసాయి. యుద్ధాలతో విజయం దక్కకపోగా... ఆర్థిక రంగంలో వైఫల్యాలలు తీవ్రమవుతున్నాయి. దేశంలో సగటు పౌరులు ట్రంప్‌ను ఎన్నుకున్నందుకు బాధ పడుతున్నారు. ప్రపంచంతో సక్రమమైన సంబంధాలు కోల్పోవడంతో వారు అనేక రంగాల్లో ఇబ్బందులు పడుతున్నారు.వలసలపై ఆంక్షలు, ప్రపంచ దేశాలపై విచక్షణారహిత సుంకాల సమరం అమెరికాను అన్ని విధాల దెబ్బతీస్తున్నాయి. భౌగోళిక రాజకీయాలలోను, అంతర్జాతీయ ఆర్థిక రంగంలోనూ అభ్యుదయానికి కాకుండా అరాచకానికి ట్రంప్ కారకుడు అవుతున్నారు. భారత్ సహా వర్ధమాన దేశాలన్నీ ఆర్థిక సంక్షోభం అంచుకు చేరుతున్నాయి. ఇవన్నీ ప్రత్యక్షంగా పరోక్షంగా అమెరికాను కూడా ముంచుతున్నాయి. అయినా ట్రంప్ ఇవేవీ గమనించడం లేదు. వచ్చే నవంబర్‌లో మధ్యంతర ఎన్నికలకు వెళ్లుతున్న అమెరికా ట్రంప్‌కు మద్దతుగా నిలుస్తుందా అనుమానాలు బయలుదేరాయి. లేక కొత్త ప్రస్థానాన్ని ప్రారంభిస్తుందా అని ప్రపంచమంతా ఎదురుచూస్తున్న విషయమిది. అమెరికాకు ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది వేరుగా చర్చించుకోవాల్సిన అవసరం లేదు. నిరంతర యుద్ధ వ్యయాలు, సంపన్న వర్గాలకు పెద్ద ఎత్తున పన్ను కోతలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాల మూలంగా తీవ్రమవుతున్న ఇంధన, సరఫరాల సంక్షోభాలు కూడా తోడయ్యాయి. అంతర్జాతీయ కరెన్సీగా డాలర్ ప్రాబల్యం తగ్గడం మొదలైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య విధానాలు పరిస్థితిని మరింతగా దిగజార్చి వేస్తున్నాయి. ఫలితంగా అమెరికా జాతీయ రుణం ఆ దేశ స్థూల దేశీయోత్పత్తిలో 126 శాతంగా ఉన్నది. పోటీదారు అయిన చైనా జాతీయ రుణం జీడీపీలో 83 శాతంగా మాత్రమే ఉండగా జపాన్ జాతీయ రుణం జీడీపీలో ఇంచుమించు 250 శాతంగా ఉన్నది. అయితే జపాన్ ప్రభుత్వం తీసుకున్న రుణాలలో అత్యధికం దేశీయ బ్యాంకులు, మదుపుదారుల నుంచి తీసుకున్నవే. అమెరికా తనకు అవసరమైన నిధులను చాలా వరకు ఫెడరల్ రిజర్వ్ బాండ్లను విక్రయించడం ద్వారా సమకూర్చుకుంటున్నది. ఈ బాండ్ల కొనుగోలుదారు లలో అత్యధికులు విదేశీ సంస్థలు, మదుపుదారులే కావడం గమనార్హం. ఈ భారీ రుణంపై ఏటా 1 లక్ష కోట్ల డాలర్లకు పైగా వడ్డీ చెల్లిస్తున్నారు. అమెరికా ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేసినవారు నష్టాలు వాటిల్ల వచ్చనే భయంతో వాటిని విక్రయిస్తున్నారు. తక్కువ వడ్డీ రేట్లకు ఆ బాండ్లను మరిన్ని కొనడానికి నిరాకరిస్తున్నారు. ఈ పరిస్థితి కూడా అమెరికా రుణ సంక్షోభానికి దారితీసింది. దీని నుంచి బయట పడేందుకు తాను అమ్మిన బాండ్లను తానే కొనుగోలు చేసేందుకు అమెరికా సంసిద్ధమయినప్పటికీ పరిస్థితి మెరుగు పడడం లేదు. ఫెడరల్ ప్రభుత్వం తీసుకునే రుణం గరిష్ఠంగా 41.1 ట్రిలియన్ డాలర్లకు మించకూడదని గత ఏడాది అమెరికా కాంగ్రెస్ పరిమితి విధించింది. అయితే అంతకంతకూ పెరుగుతోన్న జాతీయ రుణ పరిమాణం ఆ గరిష్ఠ పరిమితిని 2027 ద్వితీయార్థంలో దాటుతుందని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఇదంతా కూడా వాణిజ్య విధానాల కారణంగానే అని చెప్పుకోవాలి. వివిధ దేశాలపై వాణిజ్య యుద్ధం ప్రకటించడంతో స్వేచ్ఛా వాణిజ్యం దెబ్బతింది. ప్రతిసెకనూ 90వేల డాలర్ల మేరకు, దినసరిన 7.8 బిలియన్ డాలర్ల మేరకు జాతీయ రుణం పెరుగుతుందని కాంగ్రెస్ జాయింట్ ఎకనామిక్ కమిటీ వెల్లడించింది. 2036 సంవత్సరం నాటికి ఈ రుణభారం 64 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని కూడా ఆ కమిటీ పేర్కొంది ప్రతి అమెరిన్ పౌరుడిపై తలసరి రుణభారం 1,19,686 డాలర్లుగా లెక్క కట్టింది. అమెరికాకు ఈ రుణ దుస్థితి దాపురించడానికి డెమొక్రాటిక్, రిపబ్లికన్ ప్రభుత్వాలు రెండూ కారణమయినప్పటికీ డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు మరింత దిగజార్చాయని అమెరికన్‌లే గగ్గోలు పెడుతున్నారు. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేస్తానన్న ట్రంప్ నిజానికి అమెరికా పతనాన్ని మరింత వేగవంతం చేస్తున్నారని అనేకులు వాపోతున్నారు. అమెరికా ఫస్ట్ నినాదం ఇప్పుడు ఆర్థిక పనం దిశగా సాగుతోంది.

# ప్రకృతి విలయం..

మొదటిపేజీ తరువాయి..

ఆకస్మిక వరదుల దిగువన ఉన్న ప్రాంతాలను ముంచెత్తుతాయి. కొండల్లోని మంచు కరగడంతో ఏర్పడే గ్లేషియల్ సరస్సులు అస్థిరమై ఒక్కసారిగా కిందకు దూసుకొచ్చిన సందర్భాల్లో కూడా లోతట్టు ప్రాంతాలను ఆకస్మిక వరదలు ముంచెత్తుతాయి. అంతెత్తున ఉండే కొండల నుంచి కిందకు వేగంగా దూసుకొచ్చే నీటి ప్రవాహానికి తన దారిలో ఉన్న అన్ని నిర్మాణాలను నేలమట్టం చేయగల శక్తి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, రసువా జిల్లాలో వర్షాలకు అవకాశం తక్కువని అక్కడి వాతావరణ శాఖ ముందే అంచనా వేసింది. కానీ నేపాల్‌కు ఎగువన ఉన్న టిబెట్‌లో భారీ వర్షం కురిసిన విషయం శాటిలైట్ చిత్రాల్లో బయటపడ్డట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయమై తమను ముందస్తుగా హెచ్చరించడంలో చైనా విఫలమైందని ఇప్పటికే నేపాల్ జర్నలిస్టు ఒకరు నెట్టింట తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిమాలయాల్లో ఉన్న నేపాల్‌లో భారీ పర్వతాలు, వాటి నుంచి కిందకు వేగంగా దూసుకొచ్చే నదులతో ఎల్లప్పుడూ ముప్పు పొంచి ఉంటుంది. ముఖ్యంగా వానాకాలంలో కురిసే వర్షాల కారణంగా కొండ కోనల్లో పోటెత్తే వరదలు చూస్తుండగానే మహోగ్రరూపం దాలుస్తాయి. ఇది చాలదన్నట్టు వాతావరణ మార్పులు పరిస్థితులను మరింత జటిలం చేస్తున్నాయి. భూతాపం పెరుగుతుండటంతో నేపాల్‌లోని కొండలపై మంచు కరిగిపోతోంది. హిమనదాలు కనుమరుగు అవుతున్నాయి. ఫలితంగా కొండలపై భారీ గ్లేషియల్ సరస్సులు ఏర్పడుతున్నాయి. కొండప్రాంతాలు సహజంగా అస్థిరంగా ఉంటాయి. ఇలాంటి ప్రాంతాల్లో కొండచరియుల విరిగిపడ్డా లేక కాస్త ఎక్కువ వర్షం కురిసినా సరస్సులు కట్టలు తెంచుకుని దిగువనున్న ప్రాంతాలను ముంచెత్తే అవకావం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా నేపాల్‌లో భారీ వర్షాలు అలజడి సృష్టిస్తున్నాయి. ఆకస్మిక వరదలు ఊళ్లను ముంచెత్తుతున్నాయి. ఉద్ధృతంగా ప్రవహించిన భోటేకోశీ నది నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. టిబెట్ వైపు నుంచి వచ్చిన ఆకస్మిక వరదల కారణంగా పలు ఊళ్లు, బ్రిడ్జిలు, ప్రాజెక్టులు నీటిలో కొట్టుకుపోయాయి. వరద బీభత్సం కారణంగా బుధవారం ఉదయం రసువా జిల్లాలో 1000 మంది నీటిలో కొట్టుకుపోయారని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదలో కొట్టుకుపోయిన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు మొదలయ్యాయి. అధికారులు 15 హెలికాప్టర్లను రంగంలోకి దించారు. సహాయక సిబ్బంది బుసి, తుసు ప్రాంతాల్లో 20 మందిని రక్షించారు. గాయపడ్డ వారిని మచిలి ట్రైనింగ్ క్యాంప్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే వారు వెంటనే అక్కడినుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అధికారులు ఇప్పటి వరకు 8 మృతదేహాలను నీటినుంచి స్వాధీనం చేసుకున్నారు.

టిబెట్‌లో సంభవించిన భూకంపం తమ దేశంలో వరదలకు కారణమై ఉండవచ్చని నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ తెలిపారు. టిబెట్‌లో కొండచరియలు విరిగి పడి తమ దేశంలోని భోటేకోశీ నదిలో వరదలకు దారి తీశాయని ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు మంత్రి ఖనాల్ వివరించారు. టిబెట్‌లో నేడు ఉదయం 8.37 గంటల సమయంలో రిక్టర్ స్కేలుపై 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్టు అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. ఈ నేపథ్యంలో అసలు ఏం జరిగిందనే దానిపై నిపుణులు పరిశీలిస్తున్నారు. మరోవైపు, వరదలు ముంచెత్తిన రసువా జిల్లాకు అనుకుని ఉన్న టిబెట్ గ్యిరోంగ్ పోర్టు ప్రాంతంపై భారీ వరద విరుచుకు పడ్డ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

÷ళిపాల్-చైనా సరిహద్దుకు సమీపంలో ముంచుచరియలు, కొండచరియలు విరిగిపడినట్టు శాటిలైట్ ఇమేజీల్లో కనిపించిందని నేపాల్ విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది అంతకుముందే, లేండే నదికి అడ్డంగా మంచుచరియలు పేరుకోవడంతో అక్కడ భారీగా నీరు నిలిచిపోయిందని ఖత్మాండూ యూనిర్సిటీ ప్రొఫెసర్ ఒకరు తెలిపారు. ఆ తరువాత అకస్మాత్తుగా మంచుచరియలు, కొండచరియలు పడిపోవడంతో ఎగువన ఉన్న లేండే నది నీరు భోటే కోశీ నదిలోకి పోటెత్తి ఆకస్మిక వరదలకు దారి తీసిందని చెప్పారు. ఆ సమయంలోనే టిబెట్‌లో భూకంపం సంభవించిందని వివరించారు. ఈ నేపథ్యంలో పూర్తి ఘటనా క్రమం ఎంటో తెలుసుకునేందుకు నేపాల్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. నేపాల్‌లో ప్రవహించే బోటే కోశీ నదికి లేండే ఓ ఉపనది. ఈ నది టిబెట్‌లో మొదలవుతుంది. సరిహద్దును దాటి నేపాల్‌లోకి ప్రవేశించాక భోటే కోశీ నదిలో కలుస్తుంది. అనంతరం భోటే కోశీ నది మరింత దిగవకు వచ్చేసరికి త్రిశూలీ నదిగా పిలుస్తారు. ఈ క్రమంలో త్రిశూలీ నది నేపాల్‌లోని దేవఘాట్ వద్ద కాళీ గండకి నదిలో కలిసి నారాయణి నదిగా భారత్‌లోకి (బిహార్) ప్రవేశిస్తుంది. భారత్‌లో దీన్ని గండక్ నదిగా పిలుస్తారు. ఇది బిహార్, యూపీల మధ్య సరిహద్దుమీదుగా ప్రవహిస్తూ అంతిమంగా గంగా నదిలో కలుస్తుంది.



# 22ఏను వెంటనే తొలగించాలి



మొదటిపేజీ తరువాయి..

ఎప్పుడు 22-ఏ కింద భూమి లాక్కుంటారోనని ప్రజలు భయపడుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను, హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22-ఏలో చేర్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ 30 శాతం కమిషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో 22-ఏ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. బ్రోకర్లకు ఎవరూ ఒక్క రూపాయి ఇవ్వొద్దని.. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత బీఆర్ఎస్‌దేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సెక్షన్ 22ఏ బాధితుల సమావేశం జరిగింది. కేపీహెచ్‌బీ ఎస్ఆర్ఎస్ఏ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ సమావేశంలో బాధితులతో హరీశ్‌రావు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో సెక్షన్ 22ఏ తీసుకొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రజలు కేంద్రంగా పరిపాలన కొనసాగిందని తెలిపారు. అదే రేవంత్ పాలనలో భూములు కేంద్రంగా పరిపాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఏం కావాలో ఆలోచించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు, 24 గంటల కరెంటు అందించారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని కేసీఆర్ తపన పడ్డారని చెప్పారు. కేసీఆర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచారని అన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చారని తెలిపారు. దేశానికే తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని పేర్కొన్నారు. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హరియాణాలను తలదన్ని, దేశంలోనే అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. పైసా పైసా కూడబెట్టి ఇల్లు కట్టుకుంటే కాజేస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాత్రికి రాత్రి భూములన్నీ నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గుండెమీద చెయ్యేసుకుని ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు హైడ్రా వస్తదో.. ఎప్పుడు సెక్షన్ 22ఏ వస్తదో అని భయంలో బతుకుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్ లో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని హరీశ్‌రావు కొనియాడారు. యావత్ దేశం హైదరాబాద్ వైపు చూసేలా కేసీఆర్ చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి వచ్చాక హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మంటగలిసి పోయిందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డివి తుగ్లక్ నిర్ణయాలు అని విమర్శించారు. అవసరం పడి అమ్ముకుందామంటే ఎవరైనా కొనే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. అమెరికాలో ఉన్న మనవాళ్లు ఇక్కడ ఇండ్లు కొనడం ఆపేశారని తెలిపారు. పైసలుంటే అమెరికాలోనే పెట్టుబడులు పెట్టుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను సెక్షన్ 22ఏ జాబితాలో చేర్చారని హరీశ్‌రావు తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను ఈ జాబితాలో పెట్టారని పేర్కొన్నారు. కాలనీలకు కాలనీలు 22ఏ జాబితాలోకి వెళ్లాయని అన్నారు. 98 శాతం భూములను తీసేశామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నాడని అన్నారు. సెక్షన్ 22 ఏ కారణంగా చాలామందికి లోన్లు రాలేదని తెలిపారు. ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు బాధపడాలని ప్రశ్నించారు. సెక్షన్ 22ఏ పెట్టింది మీరే.. తీసేయాల్సింది కూడా మీరే అని స్పష్టం చేశారు. ప్రజలు ఎందుకు దరఖాస్తులు పెట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాలని నిలదీశారు. మీ తప్పునకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. ప్రజలు ఎందుకు దరఖాస్తులు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాలని ప్రశ్నించారు. మీరే చేసిన తప్పునకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని అడిగారు. తప్పు చేసింది మీరు.. సరిదిద్దుకోవాల్సింది కూడా మీరేనని పునరుద్ఘాటించారు. ప్రజల నుంచి 30 శాతం కమిషన్లు గుంజుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి బ్రోకర్లు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఏజెంట్లు కాలనీల్లో తిరుగుతున్నారని తెలిపారు. ప్రజలు ఒక్క రూపాయి కూడా బ్రోకర్లకు ఇవ్వద్దని సూచించారు. మీ ఆస్తులను కాపాడి మీకు అప్పగించే బాధ్యత మాది అని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి అసెంబ్లీ మొదలవుతుందని తెలిపారు. అసెంబ్లీలో సెక్షన్ 22ఏపై పోరాడతామని పేర్కొన్నారు. కబ్జాదారులే ధర్నాలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం మెడలు వంచి మీకు న్యాయం చేసే బాధ్యత మాపై ఉందని చెప్పారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

## అమెరికా మరో దుందుడుకు చర్య

మొదటిపేజీ తరువాయి..

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లలో శిక్షణా కార్యక్రమం ప్రారంభమైందని, దానిలో భాగంగానే వీసా అపాయింట్‌మెంట్ల సర్దుబాటు జరుగుతుందని అమెరికా విదేశాంగశాఖ వెల్లడించింది. ఇప్పటికే ఇంటర్వ్యూలు షెడ్యూల్ అయిన దరఖాస్తుదారులకు రద్దుపై మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. రీషెడ్యూలింగ్ సమయం గురించి త్వరలో తెలియజేయనున్నారు. రాయబార కార్యాలయాల్లో నిర్వహిస్తోన్న శిక్షణ కార్యక్రమం దేని గురించి, అది ఎంతకాలం కొనసాగుతుందనే దానిపై విదేశాంగ శాఖ పూర్తి వివరాలు వెల్లడించలేదు. అయితే.. యూఎస్ ప్రభుత్వ పథకాలపై ఆధారపడే అవకాశం ఉన్న దరఖాస్తుదారులను కాన్సులర్ అధికారులు వడపోసి, తొలగించేలా ఈ శిక్షణా కార్యక్రమం ఉండనున్నట్లు తెలుస్తోంది.

## 11 వేల కిలోమీటర్ల మేర 'ఫోర్ ట్రాక్' లైన్లు


మొదటిపేజీ తరువాయి..

ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఉద్దేశంగా చెబుతున్నారు. దీని వల్ల సరుకు రవాణా కూడా వేగవంతం కానుంది. ఈ 7 హై డెన్సిటీ మార్గాలు మొత్తం రైల్వే నెట్‌వర్క్‌లో కేవలం 16 శాతంగానే ఉన్నప్పటికీ, దేశంలోని దాదాపు సగం (41 శాతం) రైళ్ల ట్రాఫిక్ ఈ 7 రూట్ల ద్వారానే సాగుతుందని, అందుకే వీటిని ప్రాధాన్యత క్రమంలో విస్తరిస్తున్నట్లు మంత్రి ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. ఢిల్లీ- హౌరా, ముంబయి-ఢిల్లీ, హౌరా- చెన్నై వంటి కీలక నగరాల రూట్లు ఇందులో ఉన్నాయి.

## నేటినుండి రాష్ట్రవ్యాప్త గ్రామ సభలు

మొదటిపేజీ తరువాయి..

ఈ సమావేశాల్లో బీఎల్‌వోలు కొత్త ముసాయిదా ఓటర్ల జాబితాలను చదివి వినిపించనున్నారు. అలాగే తొలగించిన ఏఎస్‌డీడీ (అందుబాటులో లేని, వలస వెళ్లిన, మరణించి లేదా నకిలీ ఓటర్లు) పరిధిలోకి చేర్చిన ఓటర్ల వివరాలను వెల్లడిస్తారు. ఇటీవల విడుదల చేసిన ముసాయిదా జాబితాల ప్రకారం రాష్ట్రంలోని మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లలో 73.39 లక్షల మంది పేర్లను ఏఎస్‌డీడీ కింద తొలగించారు. రాష్ట్రంలో ఏఎస్‌డీడీలో చేర్చగా మిగిలిన 2.64 కోట్ల ఓటర్లకు సంబంధించిన వివరాల్లోనూ అనామలీస్ (లోపాలు) లేదా మ్యాపింగ్ సమస్యల కారణంగా 92.87 లక్షల మందికి ఎన్నికల సంఘం అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు తుది జాబితాలో ఉండేలా చూసేందుకు రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల సంఘం అధికారులు ఈ గ్రామ/వార్డు సభలను వేదికలుగా చేసుకుని చర్యలు చేపట్టనున్నారు. ఈ సమావేశాల్లో బూత్ స్థాయి అధికారులు ముసాయిదా, ఏఎస్‌డీడీ జాబితాలను బహిరంగంగా చదివి వినిపిస్తారు. ప్రజల సమక్షంలో పేర్లను చదవడం వల్ల ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్నప్పటికీ వాస్తవానికి స్థానికంగా నివసిస్తున్న ఓటర్లను వెంటనే గుర్తించే అవకాశం ఉంటుంది. బోగస్ ఓట్ల వంటి తదితర అంశాలపై అభ్యంతరాలను నమోదు చేస్తారు. అదనంగా ఈ ఏడాది అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండనున్న వారి వివరాలను కూడా సేకరిస్తారు. గ్రామ లేదా వార్డు సభల వద్ద ఫారమ్-6, ఫారమ్-7, ఫారమ్-8లను కూడా బీఎల్వోలు అందుబాటులో ఉంచుతారు. కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి, ముసాయిదా ఓటర్ల జాబితాలోని పేర్లపై అభ్యంతరాలు తెలపడానికి, అలాగే పేర్లు, చిరునామాలు లేదా స్పెల్లింగ్ కరెక్షన్ల వంటి లోపాలను సరిచేసుకోవడానికి ఈ



ఫారమ్‌లను ఉపయోగిస్తారు. అవసరమైన ఫారమ్‌లను అక్కడికక్కడే నింపి సంబంధిత ఆధార పత్రాలతో సహా నేరుగా బీఎల్వోలకు సమర్పించవచ్చు. ఒకవేళ ఎవరైనా ఓటర్లు పొరపాటున ఏఎస్‌డీ (గైర్హాజరు, వలస, మరణం లేదా డూప్లికేట్) జాబితాలో వారి పేరు చేరినట్లైతే తగిన ఫారమ్‌ను అక్కడే నింపి ఇచ్చేలా చర్యలు బీఎల్‌వోలు చేపడతారు. గ్రామ లేదా వార్డు సభలలో చర్చించిన ప్రతి అంశం నమోదు చేసుకొని బీఎల్వోలు తమ రిజిస్టర్‌లో భద్రపరుస్తారు. అన్‌మ్యాపింగ్, అనామలీస్ కారణాల వల్ల నోటీసులు వచ్చిన ఓటర్ల నుంచి బీఎల్వోలు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఈఆర్వో) అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరిస్తారు. ఈ క్రమంలో నోటీసు అందుకున్న ఓటర్లు ఈఆర్వో లేదా అసిస్టెంట్ ఈఆర్వో ముందు హాజరు కావాల్సి ఉంటుంది. ఇందుకోసం ఓటర్లకు నిర్దిష్ట తేదీ, సమయాన్ని వెల్లడిస్తారు. ఒకవేళ ఆ సమయంలో ఓటర్ హాజరుకాకపోతే ఈఆర్‌వోలు మరో తేదీ ప్రకటిస్తారు. రెండోసారి కచ్చితంగా ఓటరు హాజరు కావాల్సి ఉంటుంది. నోటీసు వచ్చినంత మాత్రాన ఓటర్లు కంగారు పడొద్దని తగిన ధ్రువత్రాన్ని సమర్పిస్తే సరిపోతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# నేపాల్ వరదలతో భారీగా ఆస్తి,ప్రాణ నష్టం

మొదటిపేజీ తరువాయి..

పలువురు గల్లంతయ్యారని వెల్లడించింది. ఇళ్లు, రోడ్లు, వంతెనలు, హైడ్రోపవర్ ప్రాజెక్టులకు భారీ నష్టం జరిగిందని పేర్కొంది. నేపాల్ భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపట్టాయని తెలిపింది. దిగువ ప్రాంతాలకు వరద ముప్పుపై నేపాల్ ప్రభుత్వం అలర్ట్ చేసిందని వెల్లడించింది. గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొంది. విదేశీ సాయం అవసరంపై ఖాట్మాండు నుంచే నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. భారత్‌తో సమన్వయానికి సిద్ధంగా ఉన్నామని నేపాల్ ఎంబసీ స్పష్టం చేసింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ.. నేపాల్ ప్రధాని బాలెన్ షాతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. మెరుపు వరదల కారణంగా జనం ప్రాణాలు కోల్పోవటంపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. వరద పరిస్థితులపై ఆరా తీశారు. అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారు. ఈ మేరకు ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో బుధవారం ఓ పోస్టు పెట్టారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ.. నేపాల్ ప్రధాని బాలెన్ షాతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. మెరుపు వరదల కారణంగా జనం ప్రాణాలు కోల్పోవటంపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. వరద పరిస్థితులపై ఆరా తీశారు. అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారు. ఈ మేరకు ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో బుధవారం ఓ పోస్టు పెట్టారు. పోస్టులో.. 'ప్రధాన మంత్రి బాలేంద్ర షాతో మాట్లాడాను. నేపాల్‌లో సంభవించిన వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేశాను. ఈ కష్టసమయంలో నేపాల్‌లోని సోదర సోదరీమణులకు భారతదేశ ప్రజలు అండగా ఉంటారు. నేపాల్‌కు సాధ్యమైనంత వరకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడానికి భారతదేశం సిద్ధంగా ఉంది. సహాయక, రక్షణ చర్యలపై మా బృందాలు పరస్పరం సమన్వయంతో పనిచేస్తున్నాయి' అని పేర్కొన్నారు.

## పటేల్ పట్వారీ విధానంతో భూసమస్యలు తక్కువే

హైదరాబాద్,ఆగస్ట్26(ప్రజాజ్యోతి): గతంలో పటేల్ పట్వారి విధానం వల్ల భూ సమస్యలు తక్కువగా ఉండేవని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అన్నారు. గతంలో భూ సమస్యలు అంతగా వచ్చేవి కావన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం.. ధరణితో పాటు అనేక సమస్యలు తీసుకొచ్చిందని వ్యాఖ్యానించారు. నాడు ఇందిరా గాంధీ పంచిన భూములను మళ్లీ భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులో తప్పిదాలు జరుగుతున్నాయని.. రెవెన్యూ శాఖ మంత్రి పటిష్ట చర్యలు తీసుకోవాలని హనుమంతరావు సూచించారు. ఈ మేరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం గాంధీభవన్‌లో ప్రజలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో వీహెచ్ పాల్గొన్నారు. ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రగతి భవన్‌ను కట్టి ప్రజల సమస్యలను చెప్పుకోవడానికి అవకాశాలు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా మార్చారని తెలిపారు. గాంధీభవన్ కూడా ప్రజల సమస్యల పరిష్కార వేదిక అయ్యేలా ముఖాముఖీ కార్యక్రమం చేపట్టారని చెప్పారు.ఈరోజు ముఖాముఖి కార్యక్రమంలో.. భూములకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా తన దృష్టికి వచ్చినట్లు వీహెచ్ తెలిపారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవ్వాలని చూస్తున్నారని వీహెచ్ అన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అమెరికాలో సాధ్యమని.. భారత దేశంలో కాదన్నారు. ప్రధాని మోదీకి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సంబంధాలు ఉన్నాయని.. అందుకే భారత్‌ను అమెరికాలా చేయాలని మోదీ చూస్తున్నారని అన్నారు. భారత్ సెక్యులర్ దేశమని.. ఇక్కడ వన్ నేషన్ వన్ ఎలక్షన్ సాధ్యం కాదని చెప్పారు. భారత దేశంలో భిన్న మతాలు, భిన్న కులాల ఉన్నాయన్నారు. కేంద్రం చేస్తున్న క్యాస్ట్ సెన్స్, కులగణనలో బీసీల కాలమే లేదని తెలిపారు. అలాంటిది వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఎక్కడిదని ప్రశ్నించారు. 70 శాతం ఉన్న బీసీలకు అన్యాయం చేస్తారా అంటూ నిలదీశారు. ముందు బీసీల సంగతి తేల్చాలన్నారు. 'మేము వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం' అని స్పష్టం చేశారు. కులగణన పేరుతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న ఓట్లకు, ఈసీ లెక్కలకు తేడా ఉందని వీహెచ్ పేర్కొన్నారు.

## వృద్ధులు లక్ష్యంగా సైబర్ ముఠాలు

### సోషల్ ఇంజనీరింగ్ నాటకాలకు తెర
### అప్రమత్తంగా ఉండాలన్న సిపి సజ్జన్నార్

హైదరాబాద్,ఆగస్ట్26(ప్రజాజ్యోతి): హైదరాబాద్ నగరంలో సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ ముఠాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనర్ హెచ్చరించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, బహిరంగ ప్రదేశాల్లో సీనియర్ సిటిజన్లు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠాలు ఫోన్లను దొంగిలిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వృద్ధులు, అమాయకులను మొదట గుర్తిస్తారని.. స్క్రీన్ లాక్ ఎలా ఓపెన్ చేస్తున్నారో వెనుక నిలబడి నిశితంగా గమనించి అనంతరం చోరీ చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఒకవేళ ఫోన్ లాక్ అయి.. పాస్‌వర్డ్ తెలియకపోతే వీరు అత్యంత చాకచక్యంగా 'సోషల్



ఇంజినీరింగ్' నాటకాలకు తెరలేపుతారని సీపీ చెప్పారు. బాధితుడు తన పోయిన ఫోన్‌కు కాల్ చేయగానే నిందితులు లిఫ్ట్ చేసి.. తాము బస్సు కండక్టర్/ డ్రైవర్ అని, ఫోన్ బస్సులో దొరికిందని చెబుతారు. వచ్చే స్టాప్‌లో ఇచ్చేస్తామని నమ్మిస్తారు. ఆ తర్వాత వివరాలు సరిచూడాలనే నెపంతో బాధితుడితోనే స్క్రీన్ లాక్ పాస్‌వర్డ్ చెప్పించుకుంటారు. మరికొన్ని సందర్భాల్లో రోడ్డుపై ఫోన్ దొరికిందని.. వేరొకరు కూడా ఆ ఫోన్ తమదే అని ÷-లకెయిమ్ చేస్తున్నారని చెబుతారు. ఫోన్ మీదే అని రుజువు కావాలంటే స్క్రీన్ పాస్‌వర్డ్ చెప్పాలని నమ్మించి అన్‌లాక్ వివరాలు రాబడతారు. ఒకవేళ ఫోన్ పోయినట్లయితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత టెలికాం సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించి సిమ్ కార్డును బ్లాక్ చేయించాలి.

వెంటనే బ్యాంక్ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను తాత్కాలికంగా ఫ్రీజ్ చేయించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన అధికారిక పోర్టల్ లిలిలి.ఇ|తిస.ఐనీల.తినిలో మొబైల్ ఎఓఇఎ నంబర్ నమోదు చేసి ఫోన్‌ను వెంటనే బ్లాక్ చేయించాలి. ఒకవేళ ఖాతా నుంచి డబ్బులు కట్ అయినట్లు గుర్తిస్తే వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలి. ముఖ్యంగా ఇంట్లోని యువత తమ కుటుంబాల్లోని సీనియర్ సిటిజన్లు, వృద్ధులకు ఈ తరహా సరికొత్త నేరాల పట్ల అవగాహన కల్పించి, వారు ప్రయాణాల్లో ఫోన్లు వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలి' అని సీపీ సూచించారు.

## ఖానాపూర్‌లో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సుడిగాలిల పర్యటన పలువురి బాధిత కుటుంబాల పరామర్శ




**ఖానాపూర్ ఆగస్టు 26(ప్రజా జ్యోతి) :** ఖానాపూర్ శాసన సభ్యులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెడమ బొజ్జు పటేల్ ఖానాపూర్ మండలంలో సుడిగాలిల పర్యటించి పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించి భరోసా కల్పించారు. సోమవారం ఉదయం క్యాంపు కార్యాలయం నుండి మస్కాపూర్, మాజీ సర్పంచ్ యు భీమన్న పట్టణంలో గత అనేక సంవత్సరాలుగా వ్యవసాయ మార్కెట్ కమిటీలో పనిచేసిన వెంకన్న మరణించడంతో ఆ కుటుంబ సభ్యుల్ని పరమర్శించారు అలాగే మధుర నగర్ లో నివసిస్తున్న ఫోటోగ్రాఫర్ సత్యనారాయణ బ్రెయిన్ స్ట్రోక్ తో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆ కుటుంబ సభ్యుల్ని పరివార్శించి ఆరోగ్యానికి భవిష్యత్తులో సహకరిస్తామని అన్నారు పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షులు జంగిలి శంకర్ జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజురా సత్యం ధోనికని దయానంద్ అంకం రాజేందర్ కౌన్సిలర్ నిమ్మల రమేష్ ఆమనుల్లా ఖాన్ జహీర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా 2వ సన్నాహక సమావేశం




**మంచిర్యాల, 26, ఆగస్టు (ప్రజాజ్యోతి):** ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమానికి సిద్ధం కావాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల జేఏసీ (టీజీఈజేఏసీ) మంచిర్యాల జిల్లా ప్రతినిధులు పిలుపునిచ్చారు. టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల పట్టణంలోని టీఎన్జీవో మీటింగ్ హాల్‌లో జిల్లా 2వ సన్నాహక సమావేశం నిర్వహించారు. టీజీఈజేఏసీ చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి వివిధ ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు, శాఖల ప్రతినిధులు హాజరై ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వం పరిష్కరించాల్సిన ప్రధాన డిమాండ్లపై విస్తృతంగా చర్చించారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు అన్ని సంఘాలు ఐక్యంగా కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది. ప్రధానంగా 2వ పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన ఈహెచ్ఎస్ (ఉద్యోగుల ఆరోగ్య పథకం)ను సమర్థవంతంగా, తక్షణమే అమలు చేయాలని కోరారు.

అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను క్లియర్ చేసేందుకు ప్రతి నెల రూ.2,000 కోట్లను విడుదల చేసి ఉద్యోగుల బకాయిలను త్వరితగతిన చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని, రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లకు తగిన గుర్తింపు కల్పించి వాటి సమస్యలను అధికారికంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల ఆర్థిక, సామాజిక, సేవా ప్రయోజనాలకు సంబంధించిన ఈ అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా ప్రతినిధులు కోరారు. సమస్యల పరిష్కారం కోసం సంఘాల నాయకులతో సమన్వయం చేసుకుంటూ తదుపరి కార్యాచరణను చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.

సమావేశంలో టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా కో చైర్మన్లు శ్రీనివాస్ రావు దేశ్‌పాండే, బట్టారి వెంకటేశ్వర్లు, బెజ్జంకి జగన్, సుమిత్, పుప్పాల హనుమంతరావు, శ్రీపతి బాపురావు, పొన్న మల్లయ్య, దుర్గా ప్రసాద్, భూముల రామ్మోహన్, డి. వేణుగోపాల్, పత్తి సత్తయ్య, పొడేటి సంజీవ్, డిప్యూటీ చైర్మన్ బొడ్డు శ్రావణ్ కుమార్, సుధాకర్, వైస్ చైర్మన్లు సూరినేని గంగాధర్, ఒడిగ కృష్ణ, బి. రవీందర్, ఎస్. కిషన్, ఏ. సునీత, నాగుల గోపాల్, పబ్లిసిటీ సెక్రటరీ రాంకుమార్, సెక్రటరీలు సత్యనారాయణ, తిరుపతి, రాసమల్ల రవి, రాంకుమార్, పొలస సత్యనారాయణ, కుమారస్వామి, జయకృష్ణ, సీపీఎస్ యూనియన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ఏ. రాజేందర్, టీఎన్జీవో నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సామెల గ్రామపంచాయతీలో పారిశుద్ధ కార్యక్రమం

**- పరిశుభ్రతే ఆరోగ్యానికి తొలి మెట్టు**
**- సర్పంచ్ వాడై సంతోష్**



**వాంకిడి, ఆగస్టు 26 ప్రజా జ్యోతి :** వాంకిడి మండల కేంద్రంలోని సామెల గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్ సంతోష్ ఆధ్వర్యంలో పరిశుద్ధ కార్యక్రమాన్ని నిర్వహించారు గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని చేపట్టారు గ్రామపంచాయతీ సిబ్బంది హెల్త్ వర్కర్లు స్థానికులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి మురుగు కాలువలు నీరు నిలిచే ప్రదేశాలు పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్దేశిత ప్రాంతాల్లోనే వేయాలని ప్రజలకు సూచించారు ముఖ్యంగా నిల్వ ఉన్న నీటి కారణంగా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండటం వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని సర్పంచ్ సంతోష్ తెలిపారు గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని ప్రజల సహకారంతో గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్యం కీలక పాత్ర పోషిస్తుందని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు గ్రామంలో ఎక్కడైనా చెత్త మురుగు లేదా నీరు నిల్వ ఉండే పరిస్థితులు కనిపిస్తే గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పరిశుద్ధ కార్యక్రమంలో హెల్త్ వర్కర్లు చురుగ్గా పాల్గొని గ్రామస్తులకు ఆరోగ్య పారిశుద్ధ్యంపై పలు సూచనలు చేశారు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ చేపడుతున్న కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని గ్రామస్తులు తెలిపారు.

# కుమారి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



**నేరడిగొండ ఆగస్టు 26 (ప్రజాజ్యోతి) :** హార్వెస్ట్ మినిస్ట్రీస్ మరియు ఆశ్రయం 'హ్యాండ్ ఆఫ్ హోప్' సంయుక్త ఆధ్వర్యంలో కుమారి గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో కుమారి మరియు దాని పరిసర గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు రక్త పరీక్షలు, బీపీ, షుగర్, కంటి పరీక్షలు, ఎక్స్-రే, దంత వైద్య పరీక్షలు, స్త్రీల ఆరోగ్య పరీక్షలు మరియు ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు వైద్యుల సూచనల మేరకు ఉచితంగా కంటి అద్దాలు, మందులను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

ఈ సందర్భంగా హార్వెస్ట్ మినిస్ట్రీస్ కోఆర్డినేటర్ శ్రీధర్ మాట్లాడుతూ... మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడమే తమ సంస్థ డైరెక్టర్ రాయపాటి కాలేబ్ ప్రధాన లక్ష్యమని తెలియజేశారు. అనంతరం ఆశ్రయం 'హ్యాండ్ ఆఫ్ హోప్' మెడికల్ ఇంచార్జ్ జయరాజ్ క్యాంపులో నిర్వహించిన వివిధ వైద్య పరీక్షల వివరాలను వివరించారు. అనంతరం కుమారి గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి-లస్మన్న, ఉప సర్పంచ్ ఆడెపు రవి, మాజీ జెడ్పీటీసి భీమిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వొర్స.రాజు యాదవ్, వార్డు సభ్యులు మాట్లాడుతూ... తమ గ్రామంలో ఇంతటి భారీ వైద్య శిబిరం జరగడం ఇదే మొదటిసారని హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన హార్వెస్ట్ మినిస్ట్రీస్ మరియు ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ నిర్వాహకులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు, పాస్టర్ పిడుగు సునీల్, హార్వెస్ట్ మరియు ఆశ్రయం మెడికల్ టీమ్, వైద్యులు, వైద్య సిబ్బంది, వాలంటీర్లు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణిలో బీసీ ఉద్యోగుల సమస్యలపై

# సంఘటిత ఉద్యమానికి పిలుపు




**- ప్రమోషన్లలో న్యాయం చేయాలి.. బీసీ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలి**
**- బీసీ--ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ. నాగేశ్వరరావు**

**మంచిర్యాల, 26, ఆగస్టు (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థలో బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎన్. రమేష్ అన్నారు. 8 ఇంక్లైన్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో అసోసియేషన్ నాయకులు అయిలి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు.

సింగరేణి వ్యాప్తంగా బీసీ ఉద్యోగుల శాతం ఎంత ఉందో సమగ్రంగా సమీక్షించడంతో పాటు వివిధ మైన్లు, డిపార్ట్‌మెంట్లు, డిజిగ్నేషన్ల వారీగా బీసీ ఉద్యోగుల వివరాలను సేకరించాల్సిన అవసరం ఉందన్నారు. అలా చేస్తే బీసీ ఉద్యోగులకు దక్కాల్సిన ప్రమోషన్లు, అవకాశాలపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. ఈ దిశగా చీఫ్ లైజన్ ఆఫీసర్, వివిధ ఏరియాల లైజనింగ్ ఆఫీసర్లతో కలిసి త్వరలోనే డైరెక్టర్ (పా)ను కలిసి సింగరేణి వ్యాప్తంగా బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని తెలిపారు.

సింగరేణిలో బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో అన్యాయం జరుగుతోందని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థలు ఉన్నట్లుగానే బీసీ ఉద్యోగుల కోసం ప్రత్యేక బీసీ సెల్, పూర్తిస్థాయి అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కార్యాలయంతో పాటు ప్రతి ఏరియాలో బీసీ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, రోస్టర్ విధానాన్ని పర్యవేక్షించేందుకు సీనియర్ అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఇప్పటివరకు సింగరేణిలో జరిగిన నియామకాలు, పదోన్నతుల్లో బీసీలకు సంబంధించిన రోస్టర్ పాయింట్లను పారదర్శకంగా సంస్థ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ డీఓపీటీ నిబంధనలను అమలు చేస్తూ బీసీ ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలని కోరారు. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

బీసీ ఉద్యోగుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

సింగరేణి సంస్థ అభివృద్ధిలో బీసీ కార్మికులు, ఉద్యోగుల పాత్ర కీలకమని, వారి హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సమావేశంలో పిలుపునిచ్చారు. రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు, మండల్ కమిషన్ సిఫారసుల అమలు, బీసీ ఉద్యోగులకు న్యాయమైన పదోన్నతులు, సంక్షేమ పథకాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

సింగరేణి కార్పొరేట్ ఏరియాలో నిర్మించిన బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయ భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, లైజన్ ఆఫీసర్లు ఫణికుమార్, కిషన్‌కుమార్, గంధం సాంబశివరావు, రమేష్, మార్కండేయ, సతీష్, చెరుకూరి, చేలుపురి, మామిడి తిరుపతి, మోటపలుకుల మహేందర్, సామల లక్ష్మీనారాయణ, బొడ్డు రమేష్, దాసరి శ్రీనివాస్, మార్కు నరేష్, చౌడ శ్రీనివాస్, వై. రమేష్, నానవాల రాకేష్, రౌతు రాజు, యు. నరేష్, కుమారస్వామి, వెంకటేశం, గుజ్జుల రాజేందర్, సదానందం, రాజేష్, సతీష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీల ఐక్యత వర్ధిల్లాలి.. కార్మిక ఐక్యత వర్ధిల్లాలి.. సింగరేణి బీసీ--ఓబీసీ కార్మికులు, ఉద్యోగుల హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగుదామని నాయకులు పిలుపునిచ్చారు.

# చలో ఢిల్లీకి తరలిరావాలి

**- సెప్టెంబర్ 1న కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు నిరసన**
**- సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు**
**- జిల్లా వ్యాప్తంగా సభలు, ప్రదర్శనలు విజయవంతం చేయాలి - సిపిఐ**
**- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్**




**మంచిర్యాల, 26, ఆగస్టు (ప్రజా జ్యోతి) :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ పిలుపునిచ్చారు. కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం, ప్రజలపై భారాలు మోపడం వంటి కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలు, కార్మికులు, రైతులు ఐక్యంగా ప్రతిఘటించాలని కోరారు. మంచిర్యాల పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దాగం మల్లేష్ అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ, మండల కార్యదర్శుల సమావేశంలో కలవేన శంకర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 1న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఇదే సందర్భంగా సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు కలవేన శంకర్ తెలిపారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం సాగించిన వీరోచిత పోరాట చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముఖ్దూం మొహియుద్దీన్ వంటి కమ్యూనిస్టు నాయకులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. రావి నారాయణరెడ్డి రైతాంగాన్ని సమీకరించి భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాటానికి నాయకత్వం వహించారని, రైతుల భూమి, హక్కుల కోసం ఆయన సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. బద్దం ఎల్లారెడ్డి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను చైతన్యపరిచి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా రైతాంగ పోరాటాన్ని బలోపేతం చేశారని వివరించారు. కవి, రచయితగా ముఖ్దూం మొహియుద్దీన్ ప్రజలను చైతన్యపరచడంతో పాటు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి తనదైన పాత్ర పోషించారని అన్నారు. ఆయన రచనలు, పోరాట స్ఫూర్తి ప్రజల్లో సామాజిక న్యాయం, సమానత్వం, దోపిడీ వ్యతిరేక భావాలను పెంపొందించాయని తెలిపారు.

నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కేవలం ఒక చారిత్రక ఘట్టం కాదని, భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన ప్రజా పోరాటానికి ప్రతీక అని కలవేన శంకర్ అన్నారు. ఆ పోరాటంలో అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ నేటి ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వారోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 11న మంచిర్యాలలో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 13న మందమర్రి మార్కెట్ ఏరియాలో, సెప్టెంబర్ 16న బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర, అమరుల త్యాగాలపై విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, కార్మికులు, రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరి నగేష్, బీమనాథుని సుదర్శన్, మిట్టపల్లి శ్రీనివాస్, లింగం రవి, కలీందర్ అలీఖాన్, రేగుంట చంద్రకళ, సీపీఐ పార్టీ మండల, పట్టణ కార్యదర్శులు కొండు బానేష్, బొంతల లక్ష్మినారాయణ, దేవి పోచన్న, అడేపు రాజమొగిలి, కామెర దుర్గరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ముల్లు మింగేశారు.. వైద్యులు కాపాడారు!



**మంచిర్యాలరూరల్ ఆగస్టు26(ప్రజాజ్యోతి) :** భోజనం చేస్తుండగా గొంతులో చేప ముల్లు ఇరుక్కొని ఇబ్బందిపడుతున్న 50 ఏళ్ల వ్యక్తికి కాకతీయ గ్యాస్ట్రో అండ్ లివర్ హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా చికిత్స అందించారు.నెన్నెల మండలం ఆవాడం గ్రామానికి చెందిన వ్యక్తి భోజనం చేస్తుండగా చేప ముల్లు గొంతులో ఇరుక్కుంది. తీవ్ర అసౌకర్యానికి గురైన ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే మంచిర్యాలలోని కాకతీయ గ్యాస్ట్రో అండ్ లివర్ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు.రోగిని పరీక్షించిన డాక్టర్ నవీన్ ఆడెపు ఎండోస్కోపీ నిర్వహించి, గొంతులో ఇరుక్కున్న చేప ముల్లును చాకచక్యంగా తొలగించారు. దీంతో రోగికి ఉపశమనం లభించడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.చికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

## బాసర ఆలయంలో అభివృద్ధి పనులకు తొలి అడుగు

**- అలివేటి మండప నిర్మాణానికి భూమిపూజ**



**బాసర, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి) :** బాసర చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో అభివృద్ధి పనులకు తొలి అడుగు పడింది. బుధవారం ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, వేద పండితులు, అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య అలివేటి మండప నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ ఈవో అంజనీ దేవి పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అమ్మవారి గర్భాలయ పనులను హైదరాబాద్‌కు చెందిన సురపనేని సునంద దంపతులు చేపట్టేందుకు ముందుకు వచ్చిన విషయం తెలిసిందే.

వీటితోపాటు ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో ఆలయ ప్రాకార మండపం, గోపురాలు, క్యూ సముదాయం నిర్మాణ పనులను నాగార్జున కాంట్రాక్షన్ కంపెనీ దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆయా పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయని ఆలయ ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనులు పూర్తయితే భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ సంజీవరావు, శివరాజ్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేద ప్రజలకు వైద్య సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

**రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు**



**మంచిర్యాల, 26, ఆగస్టు (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి బీజేపీ శ్రేణులతో కలిసి సందర్శించి శిథిలవస్థ స్థితిలో ఉన్న వివిధ వార్డులను పరిశీలించి ఆసుప్రతిలో అందిస్తున్న సదుపాయాలును పేషెంట్స్‌ని అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా రఘునాథ్ గారు మాట్లాడుతూ, ఎప్పుడు ఏ వైపున స్లాబ్ కూలి ప్రమాదం జరుగుతుందో అనే భయంతో వైద్యులు, సిబ్బంది, రోగులు ఉన్నారని తెలిపారు. ఆసుపత్రికి మరమత్తులు చేసి, మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.ప్రతి వార్డులో కూడా స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్న కనీసం మరమత్తులు కూడా చేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. డయాలసిస్ వార్డులో మరి దారుణంగా స్లాబ్ కు మెష్ కట్టి వైద్యం కల్పించడం మరి దారుణంగా ఉందని అన్నారు. అదే విధంగా సరిపడా వైద్యులు మరియు సిబ్బంది లేక ఇక్కడ శస్త్ర చికిత్సలు చేయలేని పరిస్థితి ఏర్పడి పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కాలేజ్ రోడ్ లో నిర్మాణం పూర్తి చేస్తున్న భవనంలోకి ఆసుప్రతికి త్వరగా మార్చి అన్ని రకాల వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు ప్రజలకు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్ కుమార్, రంగ శ్రీశైలం, కుర్రె చక్రవర్తి, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, బొట్ల సత్యం, దేగ బాపు, పచ్చ స్వప్న, ఆడే ప్రేమ్ సింగ్, నాంపల్లి శ్రీనివాస్, పల్లి రాకేష్, పుదారి రాంచందర్, బింగి ప్రవీణ్, తూటి సరస్వతి, కొండ వెంకటేష్, బూర్ల చిరంజీవి మరియు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాన్ని కాపాడుకోవడం మన విధి

**ఓనం వేడుకల్లో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ వెల్లడి**




**ఖానాపూర్ ఆగస్టు 26 (ప్రజా జ్యోతి) :** సంస్కృతి సాంప్రదాయా లను కాపాడుకోవడం మన విధి అని ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ అన్నారు పట్టణంలోని ఓ పాఠశాలలో జరిగిన ఓనం వేడుకలను ప్రారంభించి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారుఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఓనం పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ప్రతి రాష్ట్రానికి, ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు ఉంటాయని అన్నారు. సంవత్సరానికి ఒకసారి వచ్చే ఓనం పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఈ పండుగ ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను కూడా గౌరవిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక ప్రజాప్రతినిధులు మండల స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గుడిసెల జాబితా వెంటనే సమర్పించాలి

### అధికారులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశం

మహబూబ్‌నగర్, ఆగస్టు 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):
ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు సంబంధించి గుడిసెల జాబితా తయారీ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి వెంటనే సమర్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కార్యాలయం నుంచి వెబెక్స్ ద్వారా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లతో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, గుడిసెల జాబితా సమర్పణపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మండలాల నుంచి అందిన స్థితిగతుల నివేదికలను పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటివరకు గుడిసెల జాబితాను సమర్పించని మండలాల అధికారుల తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న సమాచారాన్ని ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే జిల్లా కార్యాలయానికి సమర్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం లేదా అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ ఉపేందర్ రెడ్డి, డీఈలు, ఏఈలు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు: అదనపు కలెక్టర్

మహబూబ్‌నగర్, ఆగస్టు 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):
మిలాద్ –ఉన్–నబీ సందర్భంగా 'టీమ్ సోషల్ వర్కర్స్' మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్థానిక సంస్థల అదనపు



కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మిలాద్–ఉన్–నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో పాటు సమాజ సేవలో అంకితభావంతో పనిచేస్తున్న 'టీమ్ సోషల్ వర్కర్స్' సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలను అభినందించారు. స్వచ్ఛంద రక్తదానం ఎంతో విలువైనదని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి రక్తదానం చేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ముఖ్యంగా యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి క్రమం తప్పకుండా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.
రక్తదాతలు అందిస్తున్న సేవలను అభినందించిన అదనపు కలెక్టర్, ప్రజల్లో రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకుల కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో 'టీమ్ సోషల్ వర్కర్స్' సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు, రక్తదాతలు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## రక్తదానం మహాదానం: మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

### – ఈద్ మిలాద్–ఉన్–నబీ సందర్భంగా రక్తదాన శిబిరం

మహబూబ్‌నగర్, ఆగస్టు 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):
మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే పవిత్ర ఈద్ మిలాద్–ఉన్–నబీ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మోతీనగర్ మజీద్ ఈ సాద్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేయడం ద్వారా





ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు అవకాశం లభిస్తుందని, రక్తదానం పట్ల యువతలో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మతపరమైన పర్వదినాన్ని సేవా కార్యక్రమంతో ముడిపెట్టి రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని పలువురు అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సిద్ధిఖీ, నవకాంత్, మధుమోహన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గంజి వెంకన్న, శివరాజ్, శ్రీనివాస్ రెడ్డి, ఇమ్రాన్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

## కెనాల్ కు నీటి విడుదల. రంగవరం రైతుల్లో ఆనందం

విపనగండ్ల ప్రజా జ్యోతి:
మండల పరిధిలోని రంగవరం గ్రామ రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని శ్రీరంగాపూర్ రిజర్వాయర్ నుంచి నాగసంపల్లి మీదగా రంగవరం గ్రామానికి వెళ్లే కెనాల్ కు బుధవారం నీటిని విడుదల చేశారు రంగవరం గ్రామ సర్పంచ్ శివకుమార్ కెనాల్ గేట్ ను ప్రారంభించి నీటిని విడుదల చేశారు. కెనాల్ కు నీరు చేరడంతో రంగవరం పరిసర ప్రాంతాల్లో రైతుల్లో ఆనందం వ్యక్తం అయింది సాగు పనులకు నీటి లభ్యత మెరుగుపడడంతో పంటలకు ప్రయోజనం కలుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు గ్రామంలో సాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని గ్రామ సర్పంచ్ శివకుమార్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోరెల్లి కురుమయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వీరందర్ రెడ్డి నల్ల పోతుల శంకర్ తదితరులు పాల్గొన్నారు



# రవాణా సౌకర్యాల విస్తరణకు ప్రాధాన్యం

### - వనపర్తిలో రాపిడో సేవలు ప్రారంభం
### - ప్రజలకు సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణం అందించాలి: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి): పట్టణ ప్రజలకు సౌకర్యవంతమైన, సురక్షితమైన, ఇబ్బందుల్లేని ప్రయాణ సదుపాయాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాపిడో సేవలను బుధవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ప్రస్తుతం సుమారు 180 మంది రైడర్లతో రాపిడో సేవలను ప్రారంభించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వనపర్తి పట్టణంలో ప్రతిరోజూ దాదాపు 40 వేల నుంచి 45 వేల మంది వివిధ అవసరాల కోసం రాకపోకలు సాగిస్తుంటారని, వారికి తక్కువ సమయంలో సౌకర్యవంతంగా గమ్యస్థానాలకు చేరేందుకు రాపిడో సేవలు ఉపయోగపడతాయని తెలిపారు. పట్టణం రోజురోజుకూ విస్తరిస్తూ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను కూడా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో రాపిడో



సేవలను మరింత విస్తరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. రాపిడో సేవల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అన్ని అనుమతులు, అవసరమైన పత్రాలు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు సేవల నాణ్యత విషయంలో రాజీపడకుండా విశ్వసనీయమైన రవాణా సదుపాయం అందించాలని అన్నారు. రాపిడో సేవల ప్రారంభంతో పట్టణ ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడటంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు లభించడం సంతోషకరమని పేర్కొన్నారు. యువత తమ నైపుణ్యాలను వినియోగించుకుని స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని



సూచించారు. వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి అనుగుణంగా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ప్రతి కార్యక్రమానికి తన సహకారం ఉంటుందని తూడి మేఘారెడ్డి తెలిపారు. భవిష్యత్తులో రవాణా, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు మరింత పెరిగేలా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వనపర్తి పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, జిల్లా యూత్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, SLN రమేష్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, కౌన్సిలర్లు క్రాంతి, పరుశురాం, బి.కృష్ణ, ఏర్పుల రవి, పాల రవి, రఘు, మైనార్టీ నాయకులు రహీం, వక్ఫ్‌బోర్డు సభ్యులు, రఫిక్ సలీం, ఆర్టీఏ సభ్యులు జహంగీర్, సమీర్, మైనార్టీ నాయకులు వసీం, ఇర్ఫాన్, జమీల్, ఆయూబ్ ఖాన్, కైసర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు శాంతి, సౌభ్రాతృత్వంతో జీవించాలి: ఎమ్మెల్యే మేఘారెడ్డి

### మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మసీదుల్లో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు

వనపర్తి, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):
ప్రవక్త మహమ్మద్ బోధనలు మానవాళికి మార్గదర్శకమని, ప్రజలు శాంతి, సౌభ్రాతృత్వంతో జీవించాలనీ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మిలాద్ ఉన్ నబీ వాన్ని పెంపొందించడం ప్రవక్త బోధనల్లోని ముఖ్య సందేశాలని అన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఆయన బోధనలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పాటించాలని పిలుపునిచ్చారు. వనపర్తి నియోజ



పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం వనపర్తి గాంధీచౌక్‌లోని మహమ్మదీయ మసీదుతో పాటు పట్టణంలోని రెండో వార్డు మసీదులో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ జీవితం, బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు.
ప్రేమ, కరుణ, దయ, నిజాయితీ, సహనం, సోదరభావం, పేదల పట్ల ఆదరణ వంటి మానవతా విలువలను ఆయన ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ పరస్పరం గౌరవించుకుంటూ శాంతి, సామరస్యంతో జీవించాలని ప్రవక్త బోధించారని తెలిపారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, పేదలకు సహాయం చేయడం, మానవత్వాన్ని చాటడం, సమాజంలో సోదరభాకవర్గంలో అన్ని మతాలు, వర్గాల ప్రజలు ఐకమత్యంతో జీవిస్తూ మత సామరస్యానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభాగ్యాలను నింపాలని ఎమ్మెల్యే కోరుకున్నారు. కార్యక్రమాల్లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరె రాములు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, ఎస్ఎల్ఎన్ రమేష్, నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త, కౌన్సిలర్లు క్రాంతి, పరుశురాం, బి.కృష్ణ, ఏర్పుల రవి, పాల రవి, రఘు, మైనార్టీ నాయకులు రహీం, వక్ఫ్‌బోర్డు సభ్యులు, రఫీక్, సలీం, ఆర్టీఏ సభ్యుడు జహంగీర్, ఎన్ఎస్‌యూఐ నాయకులు అబ్రార్, సమీర్, మైనార్టీ నాయకులు వసీం, ఇర్ఫాన్, జమీల్, ఆయూబ్‌ఖాన్, కైసర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

### మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్న ముస్లింలు

### ప్రవక్త జన్మదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శోభాయాత్రలు

నాగర్ కర్నూల్ ఆగస్టు 26 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)
మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా నాగర్ కర్నూలు జిల్లా వ్యాప్తంగా బుధవారం మీలాద్ ఉన్ నబీ పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట జామే మస్జిద్ , కొల్లాపూర్ కల్వకుర్తి, నాగర్ కర్నూల్ కేంద్రంలోని జామా మస్జిద్ లలో మీలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకొని ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జామియా నిజాం మియా అరబి యూనివర్సిటీ కి చెందిన మౌలానా ముఫ్తీలు మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఆయన అనుసరించిన విధానాలను కండ్లకు కట్టినట్లు వివరించారు. మహమ్మద్ ప్రవక్త ఈ మానవాళికి భూమికి ఆకాశానికి ఒక క్రాంతి లాంటి వారని ఆయన చూపిన మార్గమే సన్మార్గం ఆ మార్గం లో కొనసాగాలన్నారు . భూమి ఆకాశం ఈ సృష్టికే సృష్టికర్త అయిన అల్లాహ్ ముందుగా మహమ్మద్ ప్రవక్త పుట్టకముందే ఒక సందేశాన్ని ఇచ్చే విధంగా ఏడు లోకాల నుంచి భూమి వరకు ఒక క్రాంతిని సృష్టించారన్నారు. ఈ భూమి మీద చెట్టు పుట్ట నీరు జీవజాలం సర్వస్వం ప్రవక్త కోసమే అల్లా సృష్టించారని స్పష్టం చేశారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రపంచానికి దిశా నిర్దేశం చేశారని అల్లా సూచించిన దారిలో నడిస్తే ప్రతి ఒక్కరి జీవితం ధన్యం అవుతుందన్నారు తద్వారా స్వర్గలోక ప్రాప్తి జరుగుతుందని అన్నారు. ఖురాన్ మరియు హదీస్ ల నుంచి ప్రధాన సూక్తులను వివరిస్తూ వాటి ప్రాధాన్యత మనం ఆచరించాల్సిన విధానాలను వక్తలు వివరించారు. అనంతరం ఉత్తర్ ప్రదేశ్ లోని బరేలి కి చెందిన ఖతీబ్ ముఫ్తీ గుల్జార్ అహ్మద్ మిస్బాహి ఆధ్వర్యంలో ప్రవక్త కేశాలకు గుసుల్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఎంతో పవిత్రంగా నిర్వహించారు. జిల్లాలోని అన్ని తాలూకా మస్జిద్ కమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ప్రవక్త జన్మదినం సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ బాధ్యులు, జిల్లాలోని పట్టణ ప్రముఖులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రవక్త జన్మదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శోభ యాత్ర

మహమ్మద్ ప్రవక్త జన్మదిన పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ కేంద్రంలోని జామా మస్జిద్ నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు శోభ యాత్ర నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ప్రవక్త జన్మదిన సందర్భంగా భక్తి ప్రవచనాల మధ్య శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు పెద్దలు జెండాలు చేత పెట్టి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలను చదువుతూ ర్యాలీ సాగింది. అనంతరం వక్ఫ్ కాంప్లెక్స్ జెండా ఆవిష్కరించి అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ ప్రవక్త జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జిల్లా వ్యాప్తంగా శోభాయాత్ర ఎంతో గాను ఆకట్టుకుంది



## డెంగ్యూ అనుమానిత బాలిక మృతి.. గాంధీనగర్‌లో ఆరోగ్య శాఖ అప్రమత్తం

### డెంగ్యూ కట్టడికి రంగంలోకి ఆరోగ్య బృందాలు

### 18, 19, 20 వార్డుల్లో విస్తృతంగా పారిశుద్ధ్య చర్యలు

వనపర్తి, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):
డెంగ్యూ అనుమానిత లక్షణాలతో హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఎనిమిదేళ్ల బాలిక మృతి చెందిన నేపథ్యంలో వనపర్తి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. వనపర్తి గాంధీనగర్‌కు చెందిన ఆంజనేయులు కుమార్తె వెన్నెల ఈ నెల 24న మృతి చెందడంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ బుధవారం గాంధీనగర్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు 18, 19, 20 వార్డుల్లో ఆరోగ్య శాఖ





సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇళ్లలో పైరిత్రం స్ప్రే చేయడంతో పాటు నిల్వ ఉన్న నీటి వనరుల్లో దోమల లార్వాలను గుర్తించి నిర్మూలించారు. డెంగ్యూ అనుమానిత లక్షణాలు ఉన్న వ్యక్తుల నుంచి రక్త నమూనాలను సేకరించి తెలంగాణ డయాగ్నొస్టిక్, వనపర్తికి పరీక్షల కోసం పంపించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు ఫీవర్ సర్వే కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల వృద్ధికి అవకాశం లేకుండా ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ వంశీకృష్ణ, స్థానిక వైద్యాధికారి నదియా, పీర్లగుట్ట వైద్యాధికారి డాక్టర్ క్లెవిన్, గాంధీనగర్ ఆరోగ్య విస్తరణ అధికారి రవీంద్ర గౌడ్, సబ్‌యూనిట్ అధికారి ఓం ప్రకాశ్, ఆరోగ్య విస్తరణ అధికారి నరసింహారావు, జిల్లా యాంటీ లార్వా బృందం సభ్యులు గంధం రాజు, గోపాల్‌రెడ్డి, సతీష్‌కుమార్, స్థానిక వైద్య సిబ్బంది రాము, ఆరోగ్య సహాయకులు సుమిత్ర, సుగుణ, ఏఎన్ఎంలు, పీపీ యూనిట్ సిబ్బంది, గాంధీనగర్ ఆశా కార్యకర్తలు, బ్రీడింగ్ చెక్కర్లు పాల్గొన్నారు.

## పెద్ద చింతరేవుల ఆలయంలో 27,28 తేదీల్లో ప్రత్యేక యాగపూజలు

### శ్రావణ పౌర్ణమి సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలు,రక్షాబంధన్

గద్వాల ఆగస్టు 26(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని జూరాల డ్యాం సమీపంలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ నెల 27,28 తేదీల్లో ప్రత్యేక యాగాలు,హోమాలు,పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు.ఈ నెల 27న ఉడిపి పాలిమార్ పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యాదిశ శ్రీపాదుల వారి 70వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శాంతి యాగం, ఇతర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.ఉదయం 9 గంటల నుంచి ఉడిపి వేద పండితులచే శాస్త్రోక్తంగా యాగపూజలు జరుగుతాయని తెలిపారు.



ఈ నెల 28న శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఉడిపి పాలిమార్ పీఠాధిపతులు శ్రీ 1008 విద్యాదిశ శ్రీపాదుల వారు,శ్రీ 1008 విద్యారాజేశ్వర శ్రీపాదుల వారి సన్నిధిలో వరమహాలక్ష్మి (వరలక్ష్మీ) వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అలాగే యజుర్వేద ఉపకర్మ,హయగ్రీవస్వామి జయంతి ఉత్సవం,యజ్ఞోపవీతధారణ,రక్షా బంధన్,శ్రావణ పౌర్ణమి ప్రవితోపావనం,పీఠాధిపతుల ఆశీర్వచనం,పీఠాధిపతులకు పాదపూజ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రతిరోజూ నిర్వహించే నవగ్రహ హోమాలు,పవన హోమాలు కూడా కొనసాగుతాయని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి అన్నప్రసాద ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వసతి కల్పించనున్నట్లు చెప్పారు.ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు స్వయంగా పాల్గొనాలనుకునే వారు 9959251123,9949789241, 9440807109,9440770020 నంబర్లలో సంప్రదించవచ్చని అర్చకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ ఆంజనేయస్వామి కృపాకటాక్షాలు.పీఠాధిపతుల ఆశీర్వచనం పొందాలని ఆయన కోరారు.

# ఘనంగా మదర్ థెరిసా జయంతి వేడుకలు..



**పరకాల ఆగస్టు 26 (ప్రజాజ్యోతి) :** పేదలు, నిరుపేదలు, బాధితుల్లో దేవుడిని చూసి వారి సేవకే జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు మదర్ థెరిసా జయంతి వేడుకలను బుధవారం పరకాల పట్టణంలోని బేతేలు ఆశ్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మడికొండ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్, సమన్వయ కమిటీ సభ్యులు మడికొండ సంపత్ కుమార్ హాజరై మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ.. "మానవసేవే మాధవసేవ" అని నమ్మి తన జీవితాన్ని పూర్తిగా సేవకే అంకితం చేసిన మాతృమూర్తి మదర్ థెరిసా అని అన్నారు. భారతరత్న, నోబెల్ శాంతి బహుమతి గ్రహీతగా మానవతా సేవకు, దయకు ఆమె నిలువెత్తు రూపమని కొనియాడారు. మదర్ థెరిసా ఆశయాలను కొనసాగిస్తూ ప్రతి ఒక్కరూ పేదలు, నిరుపేదలు, బాధితులకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రేమతో సేవ చేయండి.. చిన్న పనులైనా గొప్ప ప్రేమతో చేయండి" అనే మదర్ థెరిసా సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేతేలు ఆశ్రమం విద్యార్థినులు, టీచర్ గీత, మడికొండ యువన్ శ్రీ రాజా (వైఎస్ఆర్) తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు వరప్రదాయిని - సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి

### నెక్కొండలో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం.. హాజరైన కాంగ్రెస్ నాయకులు



**నెక్కొండ ఆగస్టు 26 (ప్రజాజ్యోతి) :** ప్రజా ప్రభుత్వంలో నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం గొప్ప వరప్రదాయిని అని టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి అన్నారు. బుధవారం నెక్కొండ పట్టణ వాస్తవ్యులు రెండావుల రజిత - వీరన్న దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత పదేళ్లలో సొంత ఇల్లు లేక నిరుపేదలు పడ్డ ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మాధవరెడ్డి సారథ్యంలో ప్రభుత్వం రాగానే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య సంకల్పమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, సర్పంచ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, పట్టణ అధ్యక్షుడు ఇదునూరి సాయికృష్ణ, మార్కెట్ డైరెక్టర్లు రావుల మహిపాల్ రెడ్డి, బొమ్మెరబోయిన రమేష్, మాజీ విద్యాకమిటీ చైర్మన్ గరికపాటి కృష్ణారావు, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బోళ్ల రంజిత్ యాదవ్, వార్డు సభ్యులు దేవానబోయిన విజేందర్, లైశెట్టి వినయ్, పెద్దకాసు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల హక్కుల సాధన మహా ధర్నాను విజయవంతం చెయ్యాలి..

### టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మేరుగు ప్రసన్న..



**పరకాల, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల న్యాయమైన హక్కుల సాధన కోసం ఆగస్టు 27న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు వేలాదిగా తరలిరావాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మేరుగు ప్రసన్న పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిఆర్సి అమలు, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను విడుదల చేయడం, సీపీఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించడం, పెండింగ్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించడం, ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు, జీవో 317 సమస్య పరిష్కారం, ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం వంటి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం ఇప్పటికే నల్ల రిబ్బన్లతో నిరసన, తహసీల్దార్లకు మెమోరాండాల సమర్పణ వంటి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామని వెల్లడించారు. మహాధర్నాను విజయవంతం చేయాలని టీఎస్ యుటిఎఫ్ నాయకులు అజ్మీరా రాజారాం, బిక్షపతి, రజియా సుల్తానా తదితరులు పిలుపునిచ్చారు.

# వాహనదారులను అప్రమత్తం చేస్తున్న భారీ బారికేడ్లు



**కాటారం, ఆగస్టు 26, ప్రజా జ్యోతి:** కాటారం--మంథని జాతీయ ప్రధాన రహదారిపై శంకరాంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బుడగ జంగాల కాలనీ వద్ద రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆ కాలనీవాసులు దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళనలు చేస్తున్నందున ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బారికేడ్లను ఏర్పాటు చేశారు. రోడ్డు పనులు కొన్ని రోజులుగా నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపిల్లలు సైతం రోడ్డుకు అటు ఇటుగా దాటుతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో వాహనదారులు నెమ్మదిగా వెళ్లే విధంగా, అప్రమత్తంగా ఉండేలా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ప్రమాదాలను నివారించడంతో పాటు వాహనదారులను అప్రమత్తం చేయడమే లక్ష్యంగా పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన భారీ బారికేడ్లు అటుగా వెళ్లి వచ్చే అందరి దృష్టిని ఆకర్షించేలా కనిపిస్తున్నాయి.

# రాయపర్తి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద





**రాయపర్తి,ఆగస్టు 26 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రం లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పల్లె దవాఖానాలో వ్యాధి నిరోధక టీకాలు చిన్నారులకు వేస్తున్న తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

ఆసుపత్రిలోని మందుల నిల్వలను తనిఖీ చేసి, గడువు తీరిన మందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మందులను సురక్షితంగా భద్రపరిచే తీరును పరిశీలించారు. ల్యాబొరేటరీ లో మందుల నిలువ, ఇతర వైద్య సామగ్రి గురించి ల్యాబ్ ఇన్‌చార్జిని అడిగి తెలుసుకున్నారు. ల్యాబొరేటరీని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ల్యాబ్ ఇన్‌చార్జిని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందులు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులనుఆదేశించారు. ఆరోగ్య కేంద్రానికి సమస్యలతో వచ్చిన రోగులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి మాటల్లో ఆసుపత్రి లో అందుతున్న వైద్య సేవల గురించి వారి మాటల్లో తెలుసుకున్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ్,సంబంధిత గ్రామ సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# బయ్యారం కాంగ్రెస్ గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**కాటారం, ఆగస్టు 26, ప్రజా జ్యోతి :** కాటారం మండలంలోని బయ్యారం గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు, భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెప్పల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామశాఖ కమిటీని నియమించారు. బయ్యారం గ్రామశాఖ గౌరవ అధ్యక్షుడిగా బొల్లి మల్లేష్, అధ్యక్షుడిగా ఐలి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మేకల మల్లేష్, బొల్లి సదయ్య, ప్రధాన కార్యదర్శిగా భౌత్ శేఖర్, కార్యదర్శిగా ఐలి ప్రభాకర్, కోశాధికారిగా అట్టే కుమార్‌లను ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు తెప్పల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి గడపగడపకు చేరేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామంలోని సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ముందుండాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్య, ఏఎంసీ చైర్మన్ పంతకాని తిరుమల, వైస్ చైర్మన్ చిన్నాల బ్రహ్మారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు వేమూనూరి ప్రభాకర్‌రెడ్డి, మండల ప్రచార కమిటీ చైర్మన్ కుంభం రమేష్‌రెడ్డి, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, బయ్యారం సర్పంచ్ ఇనుగాల లింగయ్య, ఇబ్రహీంపల్లి సర్పంచ్ దబ్బెట సరోజన రాజేష్, అంకుశాపూర్ సర్పంచ్ సోదారి కల్పన దేవయ్య, మేడిపల్లి సర్పంచ్ గడవేనా పవిత్ర దేవేందర్, బయ్యారం ఉపసర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బోడ్డు మల్లయ్య, మాజీ సర్పంచ్ రఘురామ్, అయిలినేని నవీన్‌రావు, డాక్టర్ సుజాత, పసుల మొగిలి, కొట్టే శ్రీహరి, జాడి రాజబాపు, మొగిలి రాజకుమార్, ఆత్మకూరి కుమార్, సంతోషం దేవేందర్‌రెడ్డి, గోనె మహేష్, బండారి శ్రీధర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం







**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా,స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల్లో 4 కోట్ల 46 లక్షల రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తాడ్వాయి వ్యవసాయ మార్కెట్ యార్డులో 83 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

అనంతరం సీఆర్ఆర్--ప్లెయిన్ 2025--26 నిధులతో ఏటూరునాగారం మండలం శివాపూర్ గ్రామంలో 80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డు, సీసీ డ్రైన్లను ప్రారంభించారు. శివాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోగుపల్లిలో 55 లక్షల రూపాయలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం ఏటూరునాగారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ నిధులు 2 కోట్ల 28 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంల్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ..మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రహదారులు, మురుగునీటి కాలువల నిర్మాణంతోపాటు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో వసతుల కల్పనకు అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ముసాయిదా ఓటరు జాబితాపై గ్రామ సభ

### సర్పంచ్ షీలా హేమలత రత్నాకర్ రెడ్డి

**రాయపర్తి ఆగస్టు 26 ప్రజాజ్యోతి :**

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం శివ రామపురం గ్రామంలో గురువారం ముసాయిదా ఓటర్ జాబితాను ప్రజల సమక్షంలో చదివి, పరిశీలించి, అభ్యంతరాలు మరియు సూచనలు స్వీకరించబడతాయి. ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, పేరు లేదా వివరాల్లో తప్పులు ఉన్నా, మరణించిన లేదా వలస వెళ్లిన వ్యక్తుల పేర్లు ఉన్నా సంబంధిత ఆధారాలతో తెలియజేయవచ్చునని గ్రామ సర్పంచ్ షీలా హేమలత రత్నాకర్ రెడ్డి తెలిపారు.

కావున గ్రామంలోని ప్రజలందరూ, అన్ని పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు, ఓటర్లు తప్పనిసరిగా ఉదయం 8:00 గంటలకు హాజరై, ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి, అవసరమైన అభ్యంతరాలు లేదా సూచనలు తెలియజేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు.

# గొంతెమ్మ గుట్టను ఎకో టూరిజంగా చేయడానికి ప్రత్యేక చర్యలు

### గొంతెమ్మ గుట్టను పరిశీలించిన కాళేశ్వరం సర్కిల్ సీసీఎఫ్ ప్రభాకర్



**కాటారం, ఆగస్టు 26, ప్రజా జ్యోతి:** గొంతెమ్మ గుట్టను ఎకో టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కాళేశ్వరం సర్కిల్ సీసీఎఫ్ ప్రభాకర్ తెలిపారు. బుధవారం ప్రతాపగిరి బీట్ పరిధిలోని గొంతెమ్మ గుట్టను ఆయన అటవీశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. గుట్టపైకి ఎక్కి అక్కడ ఉన్న పాండవుల బేరి, శివలింగం, కృష్ణుడి పాదాలను దర్శించుకుని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా గుట్ట పరిసరాలను పరిశీలించిన సీసీఎఫ్ ప్రభాకర్ పర్యాటకులను ఆకర్షించే విధంగా అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గొంతెమ్మ గుట్ట వద్ద ఎకో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతాపగిరి గ్రామపంచాయతీ పరిధిలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిం చిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మహదేవ్‌పూర్ ఎఫ్‌డీవో సందీప్, భూపాలపల్లి ఎఫ్‌డీవో అప్పలకొండ, కాటారం ఎఫ్ఆర్‌వో స్వాతి, డీవైఆర్ఓ సురేందర్, సర్పంచ్ ఊర వెంకటేశ్వ రరావు, ఎఫ్‌బీవోలు ఎస్‌కే. మొయినుద్దీన్, మోనా కౌసర్, రాజేందర్, సం జీవ్, ప్రత్తి బాబు, బేస్‌క్యాంప్ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన పదోన్నతలు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపిన గ్రామ శాఖ అధ్యక్షుడు బాల్నె నరేష్

**జనగామ ఆగస్టు 26, (ప్రజా జ్యోతి) :** జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్‌లో నూతనంగా నియమితులైన జిల్లా ఉపాధ్యక్షులు కట్టా కృష్ణ, జిల్లా కార్యదర్శులుగా నియమితులైన దాసరి సతీష్, బొట్ల విజయ్ లకు యశ్వంతాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ తరపున గ్రామ పార్టీ అధ్యక్షుడు బాల్నె నరేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా రానున్న రోజుల్లో వారికి మంచి పదవులు రావాలని ఆకాంక్షించారు. వారి నాయకత్వంలో బడుగు బలహీన వర్గాల్ల బలోపేతం కావాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం వారి సేవలు మరింత విస్తరించాలన్నారు.

# చల్లా పరామర్శ..



**పరకాల, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి) :** పరకాల పట్టణానికి చెందిన జర్నలిస్ట్ ఓదెల శివ తండ్రి బిక్షపతి మృతిచెందిన విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బిక్షపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాఖీలకు భలే గిరాకీ..



**కాటారం, ఆగస్టు 26, ప్రజా జ్యోతి:** రాఖీ పౌర్ణమి పండుగ సమీపిస్తుండడంతో మండల కేంద్రంలోని ఆయా దుకాణాల్లో బుధవారం రాఖీలకు భలే గిరాకీ ఏర్పడింది. వివిధ రకాల డిజైన్లలో ఆకర్షణీయమైన రాఖీలు అందు బాటులో ఉండటంతో మహిళలు, చిన్నారులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. రాఖీ దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపిస్తున్నాయి. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగను పురస్కరించుకుని వ్యాపారులు ప్రత్యేకంగా రాఖీ స్టాళ్లను ఏర్పాటు చేశారు. చిన్నారులను ఆకట్టుకునే కార్టూన్ బొమ్మలతో కూడిన రాఖీలు, పూసలు, ముత్యాలు, వివిధ రంగులతో తయారు చేసిన రాఖీలు,ఆకర్షణీయమైన డిజైన్లలోని రాఖీలు విక్రయానికి ఉంచారు. సోదరులకు ప్రత్యేకంగా ఉండేలా రాఖీలను ఎంపిక చేసుకుంటున్నట్లు మహిళలు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి మహిళలు రాఖీలు కొనుగోలు చేసేందుకు అధిక సంఖ్యలో తరలిరావడంతో దుకాణాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

# మైలారం సున్నపు గుహల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- రూ. 20 లక్షలు మంజూరు
- కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ బి.ప్రభాకర్



**గణపురం ప్రజాజ్యోతి ఆగస్టు 26 :** గణపురం మండలంలోని మైలారం సున్నపు గుహలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నట్లు కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ బి.ప్రభాకర్ తెలిపారు. బుధవారం మైలారం గుహలను సందర్శించి పరిశీలించారు. గుహల అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు మంజూరైనట్లు ఆయన వివరించారు. గుహల సహజ సిద్ధమైన ప్రత్యేకతలు, పర్యాటకులను ఆకట్టుకునే అంశాలు, సందర్శకులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు. పర్యాటకుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అటవీ అధికారి అప్పలకొండ, చెల్పూర్ అటవీ క్షేత్ర అధికారి చంద్రమౌళి, అటవీ విభాగ అధికారి రాజేంద్రప్రసాద్ లు పాల్గొన్నారు.

# కోటగుళ్లు గోశాల గోమాతలకు పశుగ్రాసం వితరణ



**గణపురం ప్రజాజ్యోతి ఆగస్టు 26 :** ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోట గుళ్ళ గోశాల గోమాతలకు గణపురం మండల కేంద్రానికి చెందిన దుగ్యాల స్వరూప, నర్సింగరావు దంపతులు బుధవారం ప్రశుగ్రాసాన్ని అందజేశారు. కోటగుళ్ళు గోశాల గోమాతలకు పశు గ్రాసాన్ని అందజేసిన నర్సింగరావు స్వరూప దంపతులకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# ప్రపంచ మానవాళికి ఆదర్శం మొహమ్మద్ ప్రవక్త

భువనగిరి,ఆగస్ట్ 26 (ప్రజాజ్యోతి):
ప్రపంచ,శాంతి దూత మొహమ్మద్,ప్రవక్త హజరత్



మొహమ్మద్ ముస్తఫా సల్లెల్లాహు,అలైహివ సల్లం జయంతి మిలాద్ ఉన్ నబీ సందర్భంగా భువనగిరి పట్టణం లో ముస్లిం మైనారిటీ,యూత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది.ర్యాలీ జలీల్ పూర మసీద్ నుండి ప్రారంభం అయ్యి సమద్ చౌరస్తా, గాంధీనగర్ బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా ప్రిన్స్ చౌరస్తా,జగదేవపూర్ చౌరస్తా హైదరాబాద్ మీదుగా జలీల్ పూర చేరుకుంది..ప్రవక్త ర్యాలీ లో చిన్న పెద్ద తేడా లేకుండ అందరు ఇస్లామిక్ జెండాలను చేత పట్టుకొని నారే తక్ బీర్ అల్లాహు అక్బర్ సర్కార్ కీ ఆమద్ మర్హబా అంటూ నినాదాలు చేసుకుంటూ సంతోషం గా ర్యాలీ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల మైనారిటీ జర్నలిస్ట్ ఫెడరేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఇంతియాజ్ అహ్మద్,గ్రంధాలయం చైర్మన్ అవేస్ చిస్తీ కొంతమంది ప్రముఖులు మాట్లాడుతూ ప్రపంచ మంతటికి ఇస్లాం వ్యాప్తింప చేసిన



మొహమ్మద్ ప్రవక్త గొప్ప మహనీయుడని అలాంటి గొప్ప ప్రవక్త ప్రపంచం లో ఎవ్వరు లేరని అన్నారు. అదే విధంగా శాంతి దూత ప్రపంచ,మానవాళికి ఆదర్శం మొహమ్మద్ ప్రవక్త అని అన్నారు.ప్రపంచా నికి పీస్ శాంతి సందేశం అందించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.ప్రతి ఒక్కరు మొహమ్మద్ ప్రవక్త అడుగు జాడల్లో పయనించాలని ఆయన ఆచరించిన జీవితాన్ని అనుసరించాలని పిలుపుని చ్చారు.అలాగే ఇస్లాం సందేశాన్ని ప్రపంచ మానవాళికి అందించడం కొరకు తన కుటుంబాన్నే బలిదానం ఇచ్చిన మొహమ్మద్ ప్రవక్త వేడుకలు పట్టణం లో అంగరంగ వైభవంగా నిర్వహించడం సంతోషకరమైన విషయమని అన్నారు.ప్రవక్త జన్మదిన వేడుకల్లో మున్సిపాలిటీ చైర్మన్ తంగెల్లపల్లి శ్రీవాణి రవికుమార్ ప్రముఖ అడ్వకేట్ ఎం ఏ రహీం బి ఆర్ ఎస్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు పట్టణ అధ్యక్షులు కిరణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి కుల మతాలకు అతీతంగా రాజకీయ పార్టీ ల నాయకులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.. ర్యాలీ అనంతరం మసీద్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు..

## బీసీ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉప్పుల మల్లేష్ యాదవ్

సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 26(ప్రజాజ్యోతి):
బీసీ యువజన సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆత్మకూర్(ఎస్) గ్రామానికి చెందిన ఉప్పుల మల్లేష్ యాదవ్‌ను నియమించారు.ఈ మేరకు బుధవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ ఆయనకు



నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఉప్పుల మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా బీసీ యువజన సంఘం కమిటీలను ఏర్పాటు చేసి,బీసీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.బీసీ ఉద్యమ రథసారథి,రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య,బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ నాయకత్వంలో బీసీల హక్కుల సాధన కోసం పనిచేస్తానని తెలిపారు.తన నియామకానికి సహకరించిన బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పోలోజు మహేష్ చారికి ఉప్పుల మల్లేష్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

## నార్కట్పల్లి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ( ఎమ్మార్పీఎస్) మండల అధ్యక్షులుగా సిరిపంగి రామలింగం నియామకం

నార్కట్ పల్లి, ఆగష్టు 26( ప్రజా జ్యోతి ):



25 08 2026 రోజున నల్లగొండలోని పిఆర్టియు భవన్ లో నల్లగొండ ఎంఆర్పిఎస్ జిల్లా సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ పాల్గొని ఆ సంఘం జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే నార్కట్ పల్లి మండలం ఎల్లారె డ్డిగూడెంసిరిపంగి రామలింగం ను నార్కట్ పల్లి మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నార్కట్ పల్లి మండల అధ్యక్షులు సిరిపంగి రామలింగం మాట్లాడుతూ... నా ఎన్నికకు సహకరించిన ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ , ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి నరసింహ మాదిగ , జిల్లా అధికార ప్రతినిధి చింత సైదులు, జిల్లా ఇంచార్జ్ రామాంజి సైదులు మాదిగకు ప్రత్యేక సామాజిక ఉద్యమ నమస్కారాలు నేను ఇప్పటినుండి మండలంలో ప్రతి మాదిగ బిడ్డకు ఏ అవసరం పడిన ఎల్లవేళల అందుబాటులో ఉంటూ మాదిగ జాతి ప్రయోజనాల కోసం పనిచేస్తానని ఎక్కడ జాతి ప్రయోజనాల కోసం ఈసం ఎత్తెన రాజీ పడనని భవిష్యత్తులో మేడి పాపన్న ఏ నిర్ణయం తీసుకున్న ఆ నిర్ణయం కట్టుబడి మాదిగ జాతి ప్రయోజనాల కోసం పనిచేస్తానని ఆయన అన్నారు. సిపంగి రామలింగం మండల అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేశారు.

## రేవంత్ ప్రభుత్వ వైఫల్యం..

**ఏపీకి తెలంగాణ నీళ్ల తరలింపుపై మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ఆగ్రహం**

దేవరకొండ, ఆగస్టు 26, ( ప్రజా జ్యోతి ) :
కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కే ఆర్ యం బి అనుమతి లేకుండానే నాగార్జునసాగర్ కుడి



కాలువ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ నీటిని అక్రమంగా తరలిస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తోందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ధ్వజమెత్తారు.ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ, పొరుగు రాష్ట్రం తెలంగాణ జలాలను తరలిస్తూ దోపిడీకి పాల్పడుతుంటే రేవంత్ ప్రభుత్వం నిద్రపోతోందని విమర్శించారు. నీళ్ల విషయంలో తెలంగాణకు ఇంత అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రయోజనాలను, తెలంగాణ నీటి హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెట్టవద్దని హితవు పలికారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రమట్టు వదిలి, తక్షణమే మేల్కొని ఏపీకి జరుగుతున్న అక్రమ నీటి తరలింపును అడ్డుకోవాలని, తెలంగాణ జల హక్కులను కాపాడాలని రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు.

## ఘనంగా మదర్ థెరీసా జయంతి

### ముఖ్య అతిధిగా పాల్గొన్న కౌన్సిలర్ శఫీఖ్ అహ్మద్

భువనగిరి ఆగస్ట్ 26(ప్రజాజ్యోతి):
మదర్ థెరీసా జయంతి సందర్భంగా ఆమె చూపిన ప్రేమ, కరుణ,సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని మానసిక వికలాంగుల ఆశ్రమంలో భువనగిరి మున్సిపాలిటీ 31వ





వార్డు కౌన్సిలర్ సుమయ్య తబస్సుం శఫీఖ్ అహ్మద్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆశ్రమంలోని మానసిక, వికలాంగులకు మరియు వారికి నిరంతరం సేవలందిస్తున్న సిబ్బందికి బ్రెడ్ మరియు అరటి పండ్లను అందజేసి,వారితో కొంత సమయం ఆత్మీయంగా గడిపారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ ప్రేమ, అప్యాయత మరియు మానవ త్వంతో అండగా నిలవాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది."సేవ చేయడానికి పెద్ద అవకాశం అవసరం లేదు... ఒక చిన్న సహాయం కూడా ఒకరి ముఖంలో చిరునవ్వును తీసుకురాగ లదు."అనే భావనతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.మదర్ థెరీసా సేవా స్ఫూర్తి మనకు ఎల్లప్పుడూ ఆదర్శం. ఆమె చూపిన మార్గంలో మానవత్వాన్ని చాటుతూ, సమాజంలోని అవసరంలో ఉన్నవారికి మన వంతు సహాయాన్ని అందించడం మనందరి బాధ్యత.ఈ కార్యక్రమంలో 31వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి సుమయ్య తబస్సుం షఫీక్ అహ్మద్ గారు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మజర్ గారు, 31వ వార్డు సభ్యులు భానోత్ సంతోష్, అఖీబ్, భానోత్ జ్యోతి, భానోత్ అనుషా, భానోత్ సంజీవ్ మరియు భానోత్ భార్గో తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ గా బంటు సైదులు నియామకం

### బిసి, ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో సన్మానం

మిర్యాలగూడ, ఆగస్టు 26,( ప్రజాజ్యోతి ):
తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్ట్ సంఘం జిల్లా కన్వీనర్ గా మిర్యాలగూడ పట్టణానికి చెందిన బంటు సైదులు ను నియమిస్తూ



రాష్ట్ర అధ్యక్షుడు నీలకంఠం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బోయిని శ్రీనివాస్ లు నియామక పత్రం అందజేశారు. ఈ నియామకాన్ని పురస్కరించుకుని బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ముదిరాజ్, బీసీ సంఘం నేతలు సైదులును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిదిగా అనేక సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి వార్తల రూపంలో అందిస్తున్న సీనియర్ విలేఖరి సైదులను జిల్లా కన్వీనర్ గా నియమించడం పట్ల అభినం దనలు తెలిపారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కన్వీనర్ గా నియమించిన రాష్ట్ర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నీలకంఠం ముదిరాజ్,బోయిని శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నల్లగొండ మరియు సూర్యాపేట జిల్లాల్లో ముదిరాజ్ జర్నలిస్టులను ఏకం చేసి, రెండు జిల్లాలకు కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ముదిరాజ్ సంఘం యువజన అధ్యక్షుడు, మిర్యాలగూడ బిజెపి వన్ టౌన్ అధ్యక్షుడు బంటు గిరి ముదిరాజ్, బిజెపి వన్ టౌన్ ప్రధాన కార్యదర్శి కొంగరి వెంకటర మణ, బిజెపి వన్ టౌన్ ప్రధాన కార్యదర్శి మూలరాజి రెడ్డి , బిజెపి వన్ టౌన్ ఓబీసీ పట్టణ అధ్యక్షుడు బొట్టు సోములు ముదిరాజ్, సీనియర్ జర్నలిస్టు నక్క శ్రీను, బీసీ సంఘం మిర్యాలగూడ పట్టణ జేఏసీ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## దొరకుంట వద్ద ఘోర బస్సు ప్రమాదం

**ఆరుగురు మృతి.. నలుగురి పరిస్థితి విషమం**

**మరో 11 మందికి తీవ్ర గాయాలు**

**ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్,ఎస్పీ**

సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 26(ప్రజాజ్యోతి):
కోదాడ మండలం దొరకుంట శివారులో బుధవారం తెల్లవారుజా మున ఘోర బస్సు ప్రమాదం చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో





ఆరుగురు మృతి చెందగా,మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు.మృతుల్లో ఐదుగురు మహిళలు,ఒక పురుషుడు ఉన్నారు.హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ఫ్రెష్ ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు.ప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్,జిల్లా ఎస్పీ కే.నరసింహ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.స్థానికులు,పోలీసు,రెవెన్యూ అధికారు లను అడిగి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్,ఎస్పీ మాట్లాడుతూ బస్సు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు.మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కోదాడ ఆసుపత్రికి తరలించగా,తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలి స్తున్నట్లు తెలిపారు.ప్రయాణికులు,వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ సంఘటనా స్థలంలో స్థానిక పోలీసు అధికారులు, రెవెన్యూ, వైద్య సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

## సాగునీరు ఇవ్వలేక సాకులు చెప్తున్నారు

### ఒంటెద్దు నరసింహారెడ్డి

నేరేడుచర్ల ఆగస్టు 26 (ప్రజా జ్యోతి ):
నేరేడుచర్ల మండల కేంద్రాల్లో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు సాగునీటి అవసరా లను దృష్టిలో పెట్టుకుని సాగర్ ఎడమ కాలువ నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ



ఆధ్వర్యంలో బుధవారం నేరేడుచర్ల పట్టణంలో ధర్నా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ఒంటెద్దు నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఒంటెద్దు నరసిం హారెడ్డి మాట్లాడుతూ.. రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాగునీటి అవసరాలు కూడా పెరుగుతున్న నేపథ్యంలో సాగర్ ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేయడంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. . రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించక పోతే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వారు విమర్శించారు.. గతంలో సాగర్ నీటి గరిష్ట స్థాయిలో ఉన్న రైతుల అవసరం కోసం సాగునీటికై నీటిని విడుదల చేసి చెరువులని నింపిన ఘనత అప్పటి సీఎం కేసీఆర్ కే దక్కిందని అన్నారు.. నేడు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆంధ్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా వ్యవహరిస్తూ కనీసం పోతిరె డ్డిపాడు నుండి భారీగా నీళ్లు తరలిపోతుంటే కనీసం ఆ నీటిని అడ్డుకోవడం కూడా చేతగాని పరిస్థితుల్లో ఉందని అన్నారు.. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అన్ని రకాలుగా అన్ని విధాలుగా అన్ని రంగాల్లో విఫలమైందని అన్నారు.. ఇప్పటికైనా కాంగ్రెస్ తెచ్చిన కరువును ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు.. ఎగువ నుంచి వరద వస్తున్నా కానీ కనీసం రైతుల అవసరం కోసం సాగునీటిని విడుదల చేయకపోవడం వెనక కుట్ర దాగుందని ఆరోపించా రు..ఈ ధర్నాలో హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజాప్ర తినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు..

## అద్వాన్న స్థితిలో ఆర్టీసీ బస్టాండ్..!

**కంపు కొడుతున్న టాయిలెట్లు.. అపరిశుభ్రమైన మంచినీరు**

**అధికారుల నిర్లక్ష్యంపై ఉద్యమిస్తామంటున్న విద్యార్థి సంఘాలు**

మిర్యాలగూడ, ఆగస్టు 26,( ప్రజాజ్యోతి ):
పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ పట్టణా నికి తలమా ణికంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ అద్వాన్న స్థితిలో కొనసాగుతుందని విద్యార్థి సంఘాల నాయకులు కన్నెర్ర చేస్తున్నారు. బుధవారం అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోతుగంటి కాశీ ఆధ్వర్యంలో బస్టాండ్ లోని అద్వాన్న పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందు చూపులేని ఆర్టీసీ అధికారులు



తాగునీటి కోసం ఏర్పాటుచేసిన నీళ్ల ట్యాంకును శుభ్రపరిచేందుకు వీలు లేకుండా ఏర్పాటు చేశారని, కనీసం ట్యాంక్ పై మూత లేకపోవ డంతో అందులో క్రిమి కీటకాలు ఎన్ని పడుంటాయో అని అనుమానం వ్యక్తం చేశారు. వాటిని తాగునీటి నల్లాలకు అనుసంధానం చేయడంతో బస్టాండులో వేలాదిగా తిరిగే ప్రయాణికులు మంచినీటి కోసం వాటిని ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచితంగా నిర్వహించా ల్సిన మరుగుదొడ్ల వద్ద కూడా ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తూ, శుభ్రం చేసే పరిస్థితి లేకపోవడం, ముఖ్యంగా పురుషుల మూత్ర విసర్జనశాలలో చేతులు కడుక్కు నేందుకు కూడా నీటిని ఏర్పాటు చేయకపోవడంతో కంపు కొడుతున్నాయని వాపోయారు. ఆర్టీసీ ప్రాంగణమంతా శుభ్రం చేసే పరిస్థితి లేకపోవడం, మురుగునీరుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో బస్టాండ్ ఆవరణ అంతా కంపు కొడుతుందని అన్నారు. ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యంతో పరిస్థితి రోజురోజుకు దిగజారి పోతుందన్నారు. మరోవైపు ఎప్పుడో 1970 వ దశకంలో ఏర్పాటు చేసిన బిల్డింగు బీటలు వారి పెచ్చులు ఊడి ప్రయాణికులపై పడుతున్నాయని, దీంతో ప్రయాణికులు గాయాల పాలు కావాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి కనీస సౌకర్యాలను మెరుగుపరచకపోతే విద్యార్థులను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## సాగర్ ఎడమ కాలువకు వెంటనే నీరు విడుదల చేయాలి

హుజూర్‌నగర్ ఆగస్ట్ 26 (ప్రజా జ్యోతి)
సాగర్ ఎడమ కాలువకు వెంటనే సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ పట్టణంలోని అడ్డరోడ్డు వద్ద రైతు ధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ హుజూర్ నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సాగర్‌లో నీటి నిల్వలు






ఉన్నప్పటికీ రైతుల అవసరాలకు సాగునీరు విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సాగర్ ఆయకట్టుకు తక్షణమే సాగు, తాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ జెడ్పీటీసీ డా.కొప్పుల సైదిరెడ్డి మాట్లాడుతూ గతంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పటికీ రైతుల పంటలను కాపాడేందుకు సాగర్ నీటిని విడుదల చేసిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర్‌గౌడ్ మాట్లాడుతూ సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి రైతుల ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడ తామని హెచ్చరించారు. ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెంకన్న హత్య కేసును రాజకీయం చేయడం సరికాదు: మోహన్ నాయక్



ఇందల్వాయి. ( ప్రజా జ్యోతి ) ఆగస్టు. 26 ఇందల్వాయి: వర్ని మండలం తగిలేపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అలియాస్ వెంకన్న హత్య కేసును రాజకీయంగా ఉపయోగించుకోవడం సరికాదని బంజారా సేవా సమితి జిల్లా అధ్యక్షులు, జీకే తండా మాజీ సర్పంచ్ మోహన్ నాయక్ అన్నారు. ఇందల్వాయి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వెంకన్న హత్య కేసును మాజీ డీసీసీ చైర్మన్ భాస్కర్ రెడ్డి పనిగట్టుకుని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌పై నిందలు వేయడం సమంజసం కాదన్నారు. కేసుకు సంబంధించిన వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకు దిగడం సరికాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ తరఫున బాన్సువాడ ప్రాంత ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టనున్నారనే భయంతోనే కొందరు రాజకీయ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తండ్రి, కొడుకులు కలిసి రాజకీయ డ్రామాలు ఆడటం మానుకోవాలని, చేసిన ఆరోపణలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇందల్వాయి మండల బీఆర్ఎస్ నాయకులు ఊరుకోబోరని శ్రీనివాస్ హెచ్చరించారు. రాజకీయంగా భయపడి ఇతరులపై నిందలు వేయడం సరికాదని, ఇలాంటి రాజకీయాలు మానుకోవాలని మోహన్ నాయక్ సూచించారు. ఈ కార్యక్రమంలో దాస్, నాగేష్, అనిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లవాగు మత్తడికి ముప్పు.. పట్టించుకోకపోతే భారీ నష్టం!



నిజాంసాగర్ ప్రజా జ్యోతి ఆగస్టు 26 నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి శివారులోని నల్లవాగు మత్తడి భారీ వరద నీటితో ఉధృతంగా పొంగిపొర్లుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వాగులోకి భారీగా వరద నీరు చేరుతుండటంతో మత్తడిపై నీటి ప్రవాహం మరింత పెరిగింది. దీంతో ఇప్పటికే శిథిలావస్థకు చేరుకున్న మత్తడికి ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మత్తడి నిర్మాణం పలు చోట్ల దెబ్బతినడంతో భారీ వరద ప్రవాహానికి పెద్దగండ్లు ఏర్పడుతున్నాయి. కుండీల గోడలు కూలిపోవడంతో పాటు బండరాళ్లు సైతం వరద ఉధృతికి కొట్టుకుపోతున్నాయి. మత్తడికి పలుచోట్ల గండ్లు ఏర్పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. వరద ఉధృతి మరింత పెరిగితే



మత్తడి పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు. నల్లవాగు మత్తడి ద్వారా వచ్చే నీటిపై పరిసర ప్రాంతాల్లోని రైతులు పంటల సాగుకు ఆధారపడుతున్నారు. మత్తడి కొట్టుకుపోతే వాగులో వాగులో వచ్చినట్టు వెళ్తూ సాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పంటలకు అవసరమైన నీటి లభ్యతపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మత్తడి శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ ఇప్పటివరకు శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే నల్లవాగు మత్తడిని పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా మత్తడికి శాశ్వత మరమ్మతులు చేపట్టి పటిష్టం చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మోడీ గ్రాఫ్ పడిపోవడంతో ఆర్ఎస్ఎస్ కుట్రలు

- దేశాల మధ్య యుద్ధాలు, ప్రజల మధ్య మత కలహాలకు ప్లాన్
- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు ప్రభాకర్ ఆరోపన

ప్రజాజ్యోతి,సిరికొండ, ఆగస్టు 26: ప్రధాని నరేంద్ర మోడీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతుండటంతో దాన్ని పెంచుకునేందుకు ఆర్ఎస్ఎస్ కుట్రలు పన్నుతోందని సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి. ప్రభాకర్ ఆరోపించారు. ఇందులో భాగంగానే దేశాల మధ్య యుద్ధాలు, ప్రజల మధ్య మత కలహాలు సృష్టించేందుకు ఎత్తుగడలు వేస్తున్నారని విమర్శించారు. సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) సిరికొండ--ధర్పల్లి మండల సంయుక్త కమిటీ ఆధ్వర్యంలో, సంయుక్త మండల కార్యదర్శి ఆర్. రమేష్ అధ్యక్షతన రెండు మండలాల పార్టీ గ్రామ కార్యదర్శులు, సెల్ కమిటీ బాధ్యులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వి. ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తోంది ప్రధాని మోడీ కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ పేదలు, అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని ప్రభాకర్ విమర్శించారు. అదానీ, అంబానీ వంటి పారిశ్రామికవేత్తలకు లాభాలు చేకూర్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా మారిందని ఆరోపించారు. కార్మికుల హక్కులను పరిరక్షించే చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికుల సమ్మె హక్కును దెబ్బతీస్తున్నారని అన్నారు. ఈ విధానాలు కార్మికులను కార్పొరేట్లకు బానిసలుగా మార్చే ప్రయత్నమని



విమర్శించారు.

**రైతుల సమస్యలను పరిష్కరించాలి**

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ప్రభాకర్ ఆరోపించారు. రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులు ఢిల్లీ వేదికగా ఏడాది పాటు పోరాటం చేసిన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. యువత ఢిల్లీ వేదికగా జెన్–జీ ఉద్యమాన్ని చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పిందని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు నీటిలో చేపల్లా ప్రజల్లో మమేకమై వారి సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు.

**ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి**

ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో సంక్షోభం తీవ్రంగా ఉందని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

**పోరాటాలతోనే నియంతృత్వ విధానాలకు అడ్డుకట్ట**

ఏఐయూకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి. దేవరాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని అన్నారు. ఇందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్య ప్రజలపై కేంద్ర ప్రభుత్వం పెనుభారం మోపుతోందని విమర్శించారు. ప్రజా ఉద్యమాల ద్వారానే హక్కులను సాధించుకోవచ్చని అన్నారు.

**విప్లవ ఉద్యమాలను బలోపేతం చేయాలి**

అమరవీరుల ఆశయ సాధన కోసం బలమైన విప్లవ ఉద్యమాలను నిర్మించాలని వి. ప్రభాకర్ పిలుపునిచ్చారు. సోషలిస్ట్ విప్లవం సాధించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ డివిజన్, మండల నాయకులు ఎం. లింబాద్రి, బి. బాబన్న, ఆర్. దామోదర్, జి. సాయరెడ్డి, పి. రమ, బి. కిషోర్, ఇ. రమేష్, ఆర్. పుష్పలత, ఎస్. కిషోర్, బి. బాల్‌రెడ్డి, కే. ఆశీష్, డి. రాజు, ఎస్. గంగామణి, పి. ఎల్లయ్య, ఇ. జమున, బి. లావణ్య, బి. మానస, బి. సర్పంచ్, టీ. రామగంగు, ఎస్. రాజేశ్వర్, ఎస్.కె. రఫీక్, ఎస్.కె. సాధుల్లా, జి. బబ్లు, ఎల్. గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పై గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 26 (ప్రజా జ్యోతి) ప్రతి ఓటరు ఓటరు జాబితాను పరిశీలించి అభ్యంతరాలు, సూచనలు తెలియజేయాలి జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ కామారెడ్డి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కామారెడ్డి నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని గ్రామాల్లో గురువారం, 27.08.2026న గ్రామ సభలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయడమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ సభల్లో ముసాయిదా ఓటరు జాబితాను బహిరంగంగా చదివి వినిపించడంతో పాటు, జాబితాలోని వివరాలను ప్రజలకు తెలియజేస్తారని తెలిపారు.మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, నివాసం మారిన ఓటర్ల వివరాలు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓటర్ల వివరాలు, గైర్హాజరైన ఓటర్ల జాబితాలను కూడా గ్రామ సభల్లో చదివి వినిపిస్తారని తెలిపారు. ప్రతి ఓటరు, గ్రామ ప్రజలు తప్పనిసరిగా గ్రామ సభలకు హాజరై ఓటరు జాబితాను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. తమ పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్నా, పేరు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామ సభల్లో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది తదితర అధికారులు పాల్గొని నోటీసుల జారీ, విచారణ ప్రక్రియ, అభ్యంతరాల నమోదు, పరిష్కార విధానం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని కలెక్టర్ తెలిపారు.జుక్కల్ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నిర్వహించే గ్రామ సభలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితా సక్రమంగా ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హులు మరియు పునరావృత నమోదులను గుర్తించేలా ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కీలకమని, అందువల్ల 27.08.2026న నిర్వహించే గ్రామ సభలకు ప్రజలు తప్పనిసరిగా హాజరై ఓటరు జాబితాను పరిశీలించి తమ అభ్యంతరాలు, సూచనలు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ విజ్ఞప్తి చేశారు.





## అనారోగ్యంతో బాధపడుతున్న రైతు ఆత్మహత్య



నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 26: అనారోగ్యం, కాలి నొప్పితో బాధపడుతున్న ఓ రైతు మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బోరంచ గ్రామంలో చోటుచేసుకుందని మనూర్ ఎస్సై ఏ. కోటేశ్వర్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బోరంచ గ్రామానికి చెందిన కాపులాపురం వీరారెడ్డి (54) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. పుట్టుకతోనే పోలియో కారణంగా ఆయన కుడికాలు పనిచేయకపోయినా వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే ఏడాది క్రితం జరిగిన ప్రమాదంలో ఆయన ఎడమకాలు విరగడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఇంటివద్దే ఉంటూ చికిత్స పొందుతున్నాడు. ఎడమకాలి నొప్పి తీవ్రంగా ఉండటంతో పాటు అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా, ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్తున్న సమయంలోనే వీరారెడ్డి మృతి చెందాడు. మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తదుపరి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## నేడు సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట టీజీఈజేఏసీ మహాధర్నా




నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 26: ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య నారాయణఖేడ్ మండల శాఖ అధ్యక్షుడు ఏసుదాస్, ప్రధాన కార్యదర్శి శ్రీరాం నాయక్ తెలిపారు. స్థానిక టీఎస్ యూటీఫ్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..ఆగస్టు 27న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న ఈ మహాధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ మండలంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు తరలిరావాలని మండల కమిటీ విజ్ఞప్తి చేసింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై ఐక్యంగా గళం వినిపించేందుకు నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

# 9 ఏళ్లుగా కొండాపూర్‌లోనే ఏపీఓ!

- బదిలీ నిబంధనలు ఈ అధికారికి వర్తించవా?

కొండాపూర్ ప్రజాజ్యోతి ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు నిబంధనలు ఉన్నప్పటికీ.. కొండాపూర్ మండలంలో ఒక ఏపీఓ మాత్రం సుమారు తొమ్మిదేళ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారనే విషయం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. అన్ని శాఖల్లో అధికారులు, ఉద్యోగులకు బదిలీలు జరుగుతున్న వేళ.. ఈ ఒక్క అధికారికి మాత్రం బదిలీ ఎందుకు జరగడం లేదనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**ఒకే చోట తొమ్మిదేళ్లు.. ఇదేంటి ప్రత్యేక మినహాయింపు?**

సాధారణంగా ఒకే స్టేషన్‌లో ఉద్యోగులు ఎక్కువ కాలం కొనసాగకుండా బదిలీల ద్వారా పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. 2026 బదిలీ మార్గదర్శకాలపై వచ్చిన నివేదికల ప్రకారం, ఒకే స్టేషన్‌లో నాలుగేళ్లకు మించి కొనసాగుతున్న ఉద్యోగులను బదిలీ చేయాల్సిన నిబంధన ఉంది.అలాంటి పరిస్థితుల్లో కొండాపూర్ మండల ఏపీఓ మాత్రం తొమ్మిదేళ్లుగా ఒకే చోట ఎలా కొనసాగుతున్నారు? అనే ప్రశ్నకు ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన




అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

**అన్ని శాఖలకు బదిలీలు.. ఏపీఓకు మాత్రం ఎందుకు కాదు?**

బదిలీల విషయంలో ప్రభుత్వ నిబంధనలు అందరికీ ఒకేలా వర్తించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒక అధికారి ఇంత సుదీర్ఘకాలం ఒకే మండలంలో కొనసాగడానికి ప్రత్యేక ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయా? ఏదైనా మినహాయింపు ఇచ్చారా? అనే విషయాలను జిల్లా ఉన్నతాధికారులు స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.తొమ్మిదేళ్ల సుదీర్ఘకాలం ఒకే చోట విధులు నిర్వహించడం వెనుక కారణమేంటి? బదిలీల సమయంలో ఈ అధికారి పేరు ఎందుకు పక్కనపెట్టబడుతోంది? బదిలీ నిబంధనలు అందరికీ ఒకటేనా.. లేక కొందరికి ప్రత్యేకమా?అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

**జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలి**


ఒకే చోట సుదీర్ఘకాలం పనిచేస్తున్న అధికారుల విషయంలో ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు సేవా కాలాన్ని పూర్తిగా పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కొండాపూర్ మండల ఏపీఓ తొమ్మిదేళ్ల సర్వీస్‌పై సమగ్రంగా విచారణ చేసి, ఇప్పటివరకు జరిగిన బదిలీల్లో ఎందుకు కొనసాగించారో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. "అందరికీ బదిలీలు.. ఏపీఓకు మాత్రం మినహాయింపా?" అనే ప్రశ్నకు జిల్లా ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## మీలాద్ ఉన్ నబీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సిద్ధం ఉజ్వల్ రెడ్డి టీజీఐడీసీ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్

జహీరాబాద్, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి న్యూస్) పట్టణంలోని ఈద్గా మైదానంలో మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్క రించుకుని నిర్వహించిన పేద ముస్లిం కుటుంబాల నికాహ్ కార్యక్రమం మరియు రక్తదాన శిబిరంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సిద్ధం0 ఉజ్వల్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన దంపతు లను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్త దాతలను అభినందించారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పేదలకు అండగా నిలవడంతో పాటు, ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం మానవత్వానికి గొప్ప సేవ అని ఆయన పేర్కొన్నారు. ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి




వసల్లం) చూపిన ప్రేమ, కరుణ, సేవా మార్గాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలోని పేదలు, నిరుపేదలకు ప్రతి ఒక్కరూ తమవంతు సహాయం అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మిలాద్ కమిటీ సభ్యులు, మతపెద్దలు, నాయకులు, కార్యకర్తలు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.



## ఆడబిడ్డల వివాహానికి చేయూత

- హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ.విమల శ్రీనివాస్ రెడ్డి



జహీరాబాద్, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి న్యూస్) హుగ్గెల్లీ గ్రామంలో ఆడబిడ్డల వివాహానికి చేయూత నిస్తున్నామని సర్పంచ్ పట్లోళ్ళ. విమల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలోని బూతపిల్లి శంకరమ్మ –బక్కప్ప కుమార్తె వైష్ణవి (గాయత్రీ) వివాహా కార్యక్ర మానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపి 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ.విమల శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వధువు కుటుంబ సభ్యులు తమ కుమార్తె పెళ్లికి సహాయం అందించిన సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజు, వార్డు సభ్యులు బాల్ రాజు, సాల్మన్, సీనియర్ నాయకులు మునిందర్ రెడ్డి నర్సింహులు, అశోక్, వెంకట్ స్వామి, అక్బర్, ప్రవీణ్ పాండు, లక్ష్మారెడ్డి, ప్రకాష్,తో పాటు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## హనుమాన్ దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

**మెదక్ (ప్రజాజ్యోతి )** మెదక్ జిల్లా నిజాంపేట మండలం చౌకస్పల్లి గ్రామపంచాయతీ పరిధిలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించనున్న హనుమాన్ దేవాలయానికి







భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక ఆకాంక్షలకు అనుగుణంగా దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషకరమని ఎమ్మెల్యే తెలిపారు. హనుమంతుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయ క్యూ లైన్లలో పందుల స్వైర విహారం

- భక్తులకు ఇబ్బందులు.. కోతుల బెడదతో ఆందోళన
- పారిశుద్ధ్యంపై ఆలయ అధికారుల నిర్లక్ష్యం

**కొమురవెల్లి, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):-** కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుండగా, ఆలయ క్యూ లైన్లలో పందులు, కోతులు స్వైర విహారం చేయడం భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. భక్తులు క్యూ లైన్లలో వేచి ఉండే ప్రాంతాల్లో పందులు తిరుగుతుండటంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఆలయ పరిసరాల్లో కోతుల బెడద





కూడా పెరిగిందని, భక్తులు తీసుకువచ్చే ప్రసాదాలు, ఆహార పదార్థాలను కోతులు లాక్కెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయని పలువురు తెలిపారు. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే ప్రముఖ పుణ్యక్షేత్రంలో క్యూ లైన్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, జంతువుల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు. పందులు, కోతులు క్యూ లైన్లలోకి రాకుండా తగిన చర్యలు చేపట్టడంతో పాటు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. భక్తుల భద్రత, ఆలయ ప్రతిష్ఠను దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు వెంటనే స్పందించి పందులు, కోతుల బెడదను అరికట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## పింఛన్లను వెంటనే విడుదల చేయాలి

**సిద్ధిపేట, ఆగస్టు 26:** రాష్ట్రంలోని చేయూత పింఛన్దారులు, కొత్తగా అర్హత పొందిన పింఛన్దారులకు పింఛన్లను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వం పింఛన్ల విడుదలపై పలుమార్లు తేదీలు ప్రకటించినప్పటికీ, అమలులో జాప్యం చేయడం పింఛన్దారులను అయోమయానికి గురిచేస్తోందని సంఘం అధ్యక్షుడు కెమ్మసారం అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 2న పింఛన్లు విడుదల చేస్తామని, అనంతరం ఆగస్టు 15, 16 తేదీల్లో కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు స్పష్టత లేకపోవడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉన్న పింఛన్దారుల సమస్యలను తక్షణమే పరిష్కరించి, ఎలాంటి జాప్యం లేకుండా పింఛన్లను విడుదల చేయాలని అశోక్ కోరారు. పదేపదే తేదీలు ప్రకటించి వాటిని అమలు చేయకపోవడం వల్ల పింఛన్దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే



స్పందించి పింఛన్లను విడుదల చేయకపోతే రాష్ట్రంలోని 33 జిల్లాల పింఛన్దారులను సమీకరించి సచివాలయం, గాంధీభవన్ ముట్టడికి సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు గొడుగు స్వరూప, ఉపాధ్యక్షులు కీర్తి సురేష్, ప్రధాన కార్యదర్శి ఆళ్లకుంట రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

- నిరుపేదలందరికీ రేషన్ కార్డులు మంజూరు ● లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ
- బస్తి దావఖాన తనిఖీ చేసిన కౌన్సిలర్ ● 20 వ వార్డు కౌన్సిలర్ ఐయిరెని అఖిల ● సాయి తేజ గౌడ్

**దుబ్బాక ప్రతినిధి, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ ప్రభుత్వం తోనే లబ్ధిదారులకు న్యాయం చేకూరుతుందని 20వ వార్డు కౌన్సిలర్ ఐయిరెని అఖిల – సాయి తేజ గౌడ్ అన్నారు. బుధవారం రోజున 16 వ వార్డు కౌన్సిలర్ దేవుని రాజు ,రేషన్ డీలర్ బిల్లర్ రాజంతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని వారన్నారు. గత పది సంవత్సరాల నుండి ఏ ఒక్క లబ్ధిదారునికి రేషన్ కార్డులు మంజూరు కాలేవన్నారు. కానీ నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నిరుపేద కుటుంబాల అందరికీ



రేషన్ కార్డులు పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. అంతేకాకుండా ఎవరైనా నిరుపేదలు ఉంటే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కూడా



చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం 20వ వార్డులోని బస్తీ దావాఖానను సందర్శించి రికార్డులను పరిశీలించి, వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలించడం పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వార్డు ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, బస్తి దావఖాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయం చేస్తే పెళ్లి కాదా?

- అన్నం పెట్టే రైతుకే పిల్ల దొరకడం కష్టమా? ● వ్యవసాయదారుడంటే ఎందుకింత చిన్నచూపు? ● రైతు కుటుంబాలకు పెళ్లి సంబంధాల కష్టాలు

**కొండపాక ఆగస్టు 26 ప్రజా జ్యోతి:** దేశానికి అన్నం పెట్టే రైతు అంటే గౌరవం ఉండాలి. కానీ నేటి పరిస్థితుల్లో వ్యవసాయం చేసే యువకుడంటే పెళ్లి సంబంధాల విషయంలో మాత్రం కొందరు కుటుంబాలు వెనుకడుగు వేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. చేతికి మట్టి అంటుకుంటే చులకనగా చూసే ధోరణి పెరుగుతుండటంతో రైతు కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

**చదువు ఉన్నా.. రైతు అయితే వద్దంటున్నారా?**

ఎకరాల కొద్దీ భూమి ఉండి, ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ మంచి ఆదాయం పొందుతున్న యువకులు ఉన్నప్పటికీ, కొందరు తల్లిదండ్రులు మాత్రం ఉద్యోగం చేసే వరుడికే ప్రాధాన్యం ఇస్తున్నారని రైతు కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం, ప్రైవేటు ఉద్యోగం, వ్యాపారం ఉన్నవారికి ఇచ్చే ప్రాధాన్యం వ్యవసాయదారులకు ఇవ్వడం లేదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**రైతు లేకపోతే అన్నం ఎక్కడి నుంచి?**

వానను, ఎండను లెక్కచేయకుండా పొలంలో కష్టపడే రైతే సమాజానికి ఆహారం అందిస్తున్నాడు. పంట పండించడమే కాకుండా వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నాడు.



అలాంటి రైతు యువకుడిని కేవలం 'వ్యవసాయం చేస్తున్నాడు' అనే కారణంతో పెళ్లికి అనర్హుడిగా చూడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**వ్యవసాయం శాపమా? వరమా?**

వ్యవసాయంలో ఆదాయం కాలానుగుణంగా మారవచ్చు. ప్రకృతి వైపరీత్యాలు, మార్కెట్ ధరలు, పెట్టుబడి భారాలు రైతును ఇబ్బంది పెట్టవచ్చు. అయినప్పటికీ భూమి, పంట, పశుసంపద, ఇతర వ్యవసాయ ఆధారిత ఆదాయ మార్గాలు ఉన్న రైతు కుటుంబాలు ఆర్థికంగా బలంగా ఉన్న ఉదాహరణలు అనేకం. ఉద్యోగమే స్థిరత్వానికి ఏకైక ప్రమాణం కాదని నిపుణులు, రైతు కుటుంబాలు చెబుతున్నాయి.

**పిల్లనిచ్చే ముందు ఆలోచించాల్సింది ఉద్యోగం కాదు.. వ్యక్తిత్వం**


వివాహం జీవితాంతం కొనసాగే బంధం. వరుడి ఉద్యోగం ఒక్కటే కాకుండా వ్యక్తిత్వం, బాధ్యత, కుటుంబాన్ని చూసుకునే తీరు, ఆదాయ స్థిరత్వం, పరస్పర అవగాహన వంటి అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకున్న యువకుడిని తక్కువగా చూడటం సమాజంలో రైతు వృత్తి పట్ల ఉన్న గౌరవాన్ని దెబ్బతీస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**రైతు చేతిలోనే భవిష్యత్తు**

పొలంలో విత్తనం వేసే చేతులే మన ఇంట్లో అన్నం పెడుతున్నాయి. రైతు కొడుకును అల్లుడిగా చేసుకోవడానికి సంకోచించే సమాజం, అదే రైతు పండించిన ధాన్యాన్ని మాత్రం కొనుగోలు చేస్తోంది. అన్నం పెట్టే చేతికి గౌరవం ఇవ్వాల్సిన సమయం వచ్చింది. "వ్యవసాయం చిన్న వృత్తి కాదు.. దేశానికి వెన్నెముక. రైతు యువకుడు చిన్నవాడు కాదు.. కుటుంబాన్ని నిలబెట్టే బాధ్యతగల వ్యక్తి."

# కొలువుదీరిన సర్పంచుల ఫోరం















**చిన్నకోడూరు, ఆగస్టు26, (ప్రజాజ్యోతి):-** మండల సర్పంచుల ఫోరంను బుధవారంనాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొడిగే సదానందం గౌడ్ (మేడిపల్లి), ఉపాధ్యక్షులుగా ధర్మాజీపేట తిరుపతిరెడ్డి (మెట్టుపల్లి), గాలిపల్లి అనిల్ (చర్లంకిరెడ్డిపల్లి), ప్రధాన కార్యదర్శిగా గుండెల్లి భవానివేణు (గంగాపూర్), సహాయ కార్యదర్శులుగా యాట సత్యలక్ష్మి యాదయ్య (మాచాపూర్), కుసునం నిర్మల రవీందర్ రెడ్డి (రంగాయపల్లి), అధికార ప్రతినిధిగా మాకు మహేష్ (శంకరాయకుంట), కోశాధికారిగా కటుకోజ్వల వాసుదేవాచారి (చౌడారం) సర్పంచ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమపై నమ్మకముంచి బాధ్యతలను అప్పగించిన సర్పంచులకు కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామాల అభివృద్ధి, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు తెలిపారు. సర్పంచులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం

- పచ్చదనం పరిశుభ్రత మనందరి బాధ్యత
- వన మహోత్సవంలో భాగంగా మొక్కల పంపిణీ ● 9 వ వార్డ్ కౌన్సిలర్ వనం రమేష్

**దుబ్బాక , ఆగస్టు 26 (ప్రజా జ్యోతి)** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని 9వ వార్డు కౌన్సిలర్ వనం రమేష్ అన్నారు. బుధవారం రోజున దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేట 9వ వార్డులో మొక్కల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతి ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనం పాటు భవిష్యత్తు తరాలకు ఆరోగ్యమైన వాతావరణన్ని అందించవచ్చని తెలిపారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత ఇంటి యజమానులే తీసుకోవాలని అన్నారు. అంతేకాకుండా ప్రతి ఇంటికి



త్వరలోనే అందరికీ మొక్కల పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ కర్ణంపల్లి రమేష్ గౌడ్, పిఎసిఎస్ డైరెక్టర్ వనం రేణుక – అశోక్, ఎల్లం, స్వామి, నాంపల్లి తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ములుగు, ఆగస్టు26 (ప్రజాజ్యోతి)** గజ్వేల్ మండలం శ్రీగిరి పల్లి గ్రామానికి చెందిన రాయపోలు చంద్రయ్య,భాగ్యమ్మ భార్యాభర్తలు ఇద్దరూ కలిసి 22 శనివారం నాడు మర్కుక్ మండలం కర్కపట్ల గ్రామం సమీపంలో గల కంపెనీకి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ములుగు మండలం కొట్యాల గ్రామ సమీపంలో గల చౌరస్తా వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొనగా ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా వారిని వెంటనే సమీపంలో గల ఆర్విఎం హాస్పిటల్ లో చేర్పించి చికిత్సలు నిర్వహిస్తున్నారు. కాగా చంద్రయ్య చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని వైద్యులు తెలపగా కొడుకు వెంకటేష్ ములుగు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి చంద్రయ్య మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ములుగు ఎస్సై రఘుపతి తెలిపారు.

## మహమ్మద్ సుల్తానకు గౌరవ డాక్టరేట్.. మదర్ థెరిస్సా సేవ రత్న అవార్డు..

**దౌల్తాబాద్, ఆగస్టు 26 ( ప్రజా జ్యోతి )** సమాజంలోని నిరుపేదలు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్న సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సామాజిక ప్రజాసేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ కు అరుదైన గౌరవం దక్కింది. వారు సామాజిక సేవలను గుర్తిస్తూ న్యూ లైఫ్ థియాలాజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'డాక్టర్ ఆఫ్ సోషల్ మినిస్ట్రీ' గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. అలాగే మధర్ థెరిస్సా సేవరత్న అవార్డు తో పాటు బంగారు పతకం అందజేశారు. బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో




మధర్ థెరిస్సా జయంతి సందర్భంగా మహమ్మద్ సుల్తాన ఉమర్ కు డాక్టరేట్, సేవరత్న అవార్డు, బంగారు పతకం అందజేశారు. ఈ సందర్భంగా న్యూ లైఫ్ థియాలాజికల్ యూనివర్సిటీ చైర్మన్ బిషప్ డాక్టర్ జోసెఫ్ పలంగి మాట్లాడుతూ సామాజిక సేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్న మహమ్మద్ సుల్తాన ఉమర్ పేదలు, నిరుపేద కుటుంబాలు, అణగారిన వర్గాలకు తన వంతు సహాయాన్ని అందిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. వారి సేవలను గుర్తించి న్యూ లైఫ్ థియాలాజికల్ యూనివర్సిటీ తరఫున డాక్టర్ ఆఫ్ సోషల్ మినిస్ట్రీ' గౌరవ డాక్టరేట్, మధర్ థెరిస్సా సేవరత్న అవార్డుతో పాటు బంగారు పతకంతోనూ సత్కరించడం జరిగిందన్నారు. మానవ సేవకు జీవితాన్ని అంకితం చేసిన మదర్ థెరిస్సా పేరుతో అందుకున్న ఇంత గొప్ప పురస్కారాలు వారిపై మరింత బాధ్యతను పెంచిందని ఆయన తెలిపారు. అనంతరం మహమ్మద్ సుల్తాన ఉమర్ మాట్లాడుతూ "గౌరవాలు, అవార్డులు వ్యక్తిగతంగా నాకు దక్కినవిగా భావించడం లేదు. సమాజం కోసం సేవ చేస్తున్న ప్రతి ఒక్కరికీ దక్కిన గుర్తింపుగా భావిస్తున్నాను. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం, పేదల జీవితాల్లో చిన్న మార్పు తీసుకురావడమే నా లక్ష్యం. ఈ గౌరవాలు భవిష్యత్తులో మరింత సేవ చేయడానికి ప్రేరణనిస్తాయి" అని పేర్కొన్నారు. ఒకవైపు 'డాక్టర్ ఆఫ్ సోషల్ మినిస్ట్రీ' గౌరవ డాక్టరేట్, మరోవైపు 'మదర్ థెరిస్సా సేవ రత్న అవార్డు', బంగారు పతకం లభించడం వారు సామాజిక సేవా ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచింది. వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా సమాజం కోసం పనిచేస్తున్న మహమ్మద్ సుల్తాన ఉమర్ సేవలను పలువురు అభినందించారు. మానవత్వమే మార్గంగా.. సేవే లక్ష్యంగా సాగుతున్న మహమ్మద్ సుల్తాన ఉమర్ ప్రస్థానానికి లభించిన ఈ గౌరవాలు మరింత మందికి సేవా స్ఫూర్తిని అందించాలనే ఆకాంక్షను కలిగించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కమ్యూనిటీ సభ్యులు డాక్టర్ రోనాల్డ్ జాన్, కన్సల్టెంట్ అండ్ కౌన్సిలర్ (ఎడ్యుకేషన్), హైదరాబాద్, రిటైర్డ్ ప్రిన్సిపల్ ) డాక్టర్ కే. జీవన్ తదితరులు పాల్గొన్నారు.






## పరిశుభ్రత పరిగి" లక్ష్యంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మార్నింగ్ విజిట్

- పారిశుధ్య నిర్వహణపై సిబ్బందికి దిశానిర్దేశం
- వర్షాకాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు




**పరిగి, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):** పరిగి పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచే లక్ష్యంతో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్ బుధవారం తెల్లవారుజామున మార్నింగ్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది, పారిశుధ్య కార్మికుల హాజరు పరిశీలించి అటెండెన్స్ నమోదు చేశారు. అనంతరం పట్టణంలోని పారిశుధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహించి, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సూచనలు జారీ చేశారు. రోడ్లపై చెత్త, నీరు నిల్వ ఉండకుండా వెంటనే తొలగించాలని, డ్రైనేజీలు, కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ దోమల నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ప్రతి వార్డులో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ వాహనాల్లోనే వేసే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే వర్షాల కారణంగా నిత్యావసర వస్తువులు అందరికీ అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పరిగి పట్టణాన్ని ఆదర్శవంతమైన పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని చైర్‌పర్సన్ రజిత వెంకటేష్ సూచించారు.

## 29న మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డులకు ఎంపిక



**హైదరాబాద్, ఆగస్ట్ 26 (ప్రజా జ్యోతి) :** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో తెలంగాణకు చెందిన ప్రొఫెసర్లు, ఫిజికల్ డైరెక్టర్లకు మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డు-2026 ప్రదానం చేయనున్నట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవార్డులకు ప్రొ.ఆర్.సునీల్ కుమార్, డా.కరిగా అనిత, డా.ఆర్.మురళి, డా.బి.ఆర్.నేత, డా.బట్టు వెంకన్న, డా.పి.సుప్రియ, డా.ఏ.సిద్ధార్థ, డా.సి.సందీప్ రెడ్డి, మేజర్ డి.జయసుధ, మేజర్ కె.ఏ.శివప్రసాద్ ఎంపికైనట్లు చెప్పారు. జస్టిస్ చంద్రకుమార్, తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొ.ఇటికల పురుషోత్తం, ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.కె.దీప్ల, విద్యావేత్త సాదుల మధుసూదన్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

## మీసేవ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు..

- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ వెంకటస్వామికి పాలాభిషేకం



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 26(ప్రజా జ్యోతి) :** కనీస వేతన చట్టాన్ని మీ సేవా కార్మికులకు వర్తింప జేసిన కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలాభిషేకం కాంగ్రెస్‌తోనే కార్మిక రాజ్యం ఐఎన్‌టి యుసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్‌షాపూర్ నగర్ రైతు బజార్ లో ఉన్న మీసేవ కార్మికులు కనీస వేతన చట్టాన్ని అమలు చేయించాలని ఐ ఎన్ టి యు సి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ వద్దకు వెళ్లారు తెలంగాణ రాష్ట్రంలో గత 20 సంవత్సరాల నుండి మీసేవ కార్మికులు కనీస సవేతనాని నోచుకోకుండా జీతముతో కొనసాగిస్తున్నారని గత ప్రభుత్వం టిఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందని ఐ ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షులు గుంజ శీను తెలంగాణ కార్మిక శాఖ మంత్రి వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లారు వెంటనే స్పందించి ,,రాష్ట్ర మీ సేవ కమిషనర్ లేబర్ కమిషనర్ పిలిపించి మీసేవ యూనియన్ అధ్యక్షులు గుంజ శీను మరియు మీసేవ కమిటీ తో ఓ సమావేశం ఏర్పాటు చేసి కనీస వేతన చట్టాన్ని అమలు చేయమని ఆదేశాలు ఇచ్చారు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మీసేవ కేంద్రంలో పనిచేస్తున్న దాదాపు 1100 మందికి పైగా కార్మికులకు 6000 నుండి 7000 వరకు జీతం పెరిగిందని అన్నారు ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మీ సేవ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఐ ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షులు గుంజ శీను మాట్లాడుతూ కార్మికులకు రక్షణ కావాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కార్మిక రాజ్యం కాంగ్రెస్తోనే ఏర్పడుతుందని అన్నారు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతూ బావి భారత ప్రధాని రాహుల్ గాంధీ కోసం కార్మికులు పనిచేయాలని కోరారు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడ ఐలయ్య గౌడ్ రాష్ట్ర మీసేవ యూనియన్ ముఖ్య సలహాదారులు ఎండి చాంద్ పాషా హెచ్ఎంటి కృష్ణ మాజీ కౌన్సిలర్ ఐఎన్‌టియు సి జాతీయ ఉపాధ్యక్షులు పుట్ట నరేందర్,సురేందర్ రెడ్డి, నడిమింటి నాగరాజు, జ్యోతి,లత, అచ్చమ్మ మీసేవ కార్మికుల కమిటీ శ్రీమతి జేనీమ శ్రీనివాస్ పాలాభిషేకం అభినందనలు తెలియజేశారు.

## గండి మైసమ్మలో ఘనంగా సచిన్ టైర్స్ నూతన షోరూం ప్రారంభం



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 26(ప్రజా జ్యోతి) :** గండి మైసమ్మ చౌరస్తాలోని పిస్తా హౌస్ పక్కన సచిన్ టైర్స్ నూతన షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు శ్రీ కూన శ్రీశైలం గౌడ్ హాజరై షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, సచిన్ టైర్స్ నూతన షోరూం విజయవంతంగా కొనసాగాలని, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాము గౌడ్, రాఘవేందర్ గౌడ్, ప్రేమ్ పటేల్, ఉదయ్ గౌడ్, సాయికుమార్ తదితరులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# పవర్ లేని పంచాయతీలు!





- అనుమతులు అడగరు.. ఆదాయం రానివ్వరు
- రాజకీయ ప్రోద్బలంతో పంచాయతీ ఆదాయానికి గండి!
- అల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో దర్జాగా పాలిష్ యూనిట్ నిర్మాణం
- తనకెలాంటి దరఖాస్తు రాలేదని పంచాయతీ కార్యదర్శి వివరణ

**తాండూరు ఆగస్టు 26, ప్రజా జ్యోతి :** గ్రామపంచాయతీలకు ప్రభుత్వం పలు అధికారాలు, బాధ్యతలు అప్పగించినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం కొందరు వాటిని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాండూరు మండలం అల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే నూతనంగా పాలిష్ యూనిట్ నిర్మాణం పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. గ్రామపంచాయతీ పరిధిలో నూతన పరిశ్రమలు, వాణిజ్య కార్యకలాపాలకు సంబంధించిన నిర్మాణాలు చేపట్టే సమయంలో నిబంధనల ప్రకారం సంబంధిత అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే అల్లాపూర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న పాలిష్ యూనిట్ విషయంలో మాత్రం ఇప్పటివరకు గ్రామపంచాయతీకి ఎలాంటి దరఖాస్తు సమర్పించలేదని పంచాయతీ కార్యదర్శి నాగ ప్రసాద్ వెల్లడించారు. ఇప్పటికే 50 శాతం మేరకు పనులు పూర్తి కాగా పంచాయతీ అధికారుల అనుమతి తీసుకోలేదు. ఏవిధమైన అనుమతి పొందకుండానే పాలిష్ యూనిట్ నిర్మాణ పనులు ఇప్పటికే సుమారు 50 శాతం మేరకు పూర్తయినట్లు స్థానికులు చెబుతున్నారు. నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ గ్రామపంచాయతీ నుంచి అనుమతి తీసుకున్నారా? లేదా? అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతుంటే సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు కూడ స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

**పంచాయతీ ఆదాయానికి గండి? :** గ్రామపంచాయతీ పరిధిలో నూతన నిర్మాణాలు, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలకు సంబంధించిన అనుమతులతో వచ్చే పన్నులు, ఫీజుల ద్వారా స్థానిక సంస్థలకు ఆదాయం సమకూరుతుంది. నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు జరిగితే పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి గండి పడే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రాజకీయ అండ ఉందా? :** అనుమతులు లేకుండా నిర్మాణ పనులు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీని వెనుక రాజకీయ ప్రోద్బలం ఏమైనా ఉందా? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

పంచాయతీ కార్యదర్శి నాగ ప్రసాద్ ను సంప్రదించగా, పాలిష్ యూనిట్ నిర్మాణానికి సంబంధించి తనకు ఎలాంటి దరఖాస్తు రాలేదని తెలిపారు. దీంతో అనుమతులు లేకుండానే నిర్మాణం కొనసాగుతుందనే ఆరోపణలపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. గ్రామపంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయా? నిబంధనలు ఉల్లంఘించారా? పంచాయతీకి రావాల్సిన ఆదాయం ఎంత? అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని అల్లాపూర్ గ్రామస్థులు కోరుతున్నారు.

## గౌతాపూర్‌లో వైభవంగా శుభం కన్వెన్షన్ ఫంక్షనల్ ప్రారంభం

### నిర్వాహకుల శుభాకాంక్షలు చెప్పిన ఎమ్మెల్యే

**తాండూర్ ఆగస్టు 26 ప్రజా జ్యోతి :** తాండూరు మండలం గౌతాపూర్ గ్రామ శివారులో నూతన అంగులాలతో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి నూతనంగా నిర్మించిన శుభం కన్వెన్షన్ ( ఫంక్షన్)హాల్ ను తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు బాల్ రెడ్డి, నర్సిములు, చెంగోల్ గ్రామ సర్పంచ్ నర్సమ్మ, పలువురు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులను నిర్వాహకులు శాలువాతో సన్మానించి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇట్టి వేడుకలలో పాల్గొన్న ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూరు మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేకమంది ప్రజలు నిర్వహించే పలు శుభకార్యాలకు ఇది వేదిక కాలున్నట్లు చెప్పారు. ఇంత మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఒక్క అందమైన వనమహోత్సవంలో సువిశాలమైన ప్రాంగణంతో ఏర్పాటు చేసిన శుభం కన్వెన్షన్ పంక్షన్ హాల్ నియోజక వర్గంలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందనికొనియాడారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ పల్లె ప్రజల చిరకాల ఆకాంక్షగా ఏర్పాటైన శుభం కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ వివాహాది శుభకార్యాలకు, అవసరమైన సకల సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. పేద ధనిక వర్గాలతో పాటు స్థానిక ప్రజలకు కూడా అనువైన దిగా గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాలకే కాకుండా తాండూరు పట్టణ ప్రజలకు కూడా శుభం కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ ఎంతో ఉ పయోగపడుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో





కాంగ్రెస్ పార్టీ నాయకులు, నిర్వాహకులు, స్థానిక ప్రజలు, అభిమానులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# నిజమైన పేదవారికే ఇందిరమ్మ ఇల్లు

### మండలంలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే బీఎంఆర్





**తాండూరు ఆగస్టు 26 ప్రజా జ్యోతి :** రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్న హామీని నెరవేర్చమని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రోజు తాండూరు మండలం ఓగిపూర్ గ్రామానికి చెందిన జట్టి అంజమ్మ, కరణ్‌కోట్ గ్రామానికి చెందిన డప్పు స్వరమ్మ, పర్తు ప్రమీల, సుల్తాన్ బేగం లు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన గృహప్రవేశం లో పాల్గొన్న తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి రాఖీ పౌర్ణమి పరిష్కరించుకొని రాఖీ కట్టి అభిమానాన్ని చాటుకున్నారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తరబడి ఎదురుచూసిన పేదల సొంతింటి కల సాకారం కావడంతో లబ్ధిదారులు ఆనందంగా ఉండటం సంతోషకరమని చెప్పారు. తాండూర్ నియోజకవర్గం లోని ఎంతోమంది ఇల్లు లేని పేద కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ఐదు లక్షల రూపాయలు మంజూరు చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని రూపొందించింది అని చెప్పారు. పేద కుటుంబాలకు సొంతింటిని నిర్మించుకోవడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టారని చెప్పారు. అనంతరం పలువురు లబ్ధిదారులు మా అన్నయ్యగా మాకు సొంతింటి కలను నిజం చేసినట్లు భావిస్తూ, ఆత్మీయతకు ప్రతీకగా ఎమ్మెల్యే బీఎంఆర్ కు లబ్ధిదారులు రాఖీ కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కరణ్ కోట్ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ తాండూరు మండల అధ్యక్షుడు రాజ్ కుమార్, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, ఓగిపూర్ సర్పంచ్ నారాయణ, కరణ్ కోట్ ఉప సర్పంచ్ తుపాకుల బసప్ప, ఓగిపూర్ ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాండూర్ మండల మాజీ ఎంపీపీ శరణు బసప్ప,హర్షవర్ధన్ రెడ్డి, హరీశ్వర్ రెడ్డి మల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాజు రెడ్డి, ఉదయ్ భాస్కర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు అనిల్,ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహమ్మద్ ప్రవక్త బోధించిన కరుణ, దయ,శాంతి, సోదరభావం సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శనీయం

- ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి - మిలాద్ ఉన్ నబీ పర్వదిన సందర్భంగా జెపి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు
- పాల్గొన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి




**కొత్తూరు ఆగస్టు 26 (ప్రజా జ్యోతి) :** మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని ప్రసిద్ధ జహంగీర్ పీర్ దర్గాలో ముస్లిం మత పెద్దలతో కలిసి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి చదర్ సమర్పించి ప్రత్యేక దువా చేశారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని మరియు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాలు విల్లివిరియాలని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు. మహ్మద్ ప్రవక్త బోధించిన కరుణ,ప్రేమ, శాంతి మార్గాలు సర్వమానవాళికి ఆదర్శనీయమని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి,సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి,మాజీ ఎంపిటిసి బాల్ రాజు,రషీద్,నవాజ్,డీలర్ కుమార్,శివ చారి,అయూబ్ మైనారిటీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## తాండూరు ఎమ్మెల్యేను కలిసిన డాక్యుమెంట్ రైటర్ల బృందం

- మా జీవనోపాధికి భరోసా కల్పించారు
- హర్షం వ్యక్తం చేసిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ రైటర్లు



**తాండూరు ఆగస్టు 26 ప్రజా జ్యోతి :** తాండూరు మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసుకున్న డాక్యుమెంట్ రైటర్లు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జిలా పెంపకం తో పాటు తాండూరు సబ్ రిజిస్టర్ పరిధిలో గతంలో ఉన్న మార్కెట్ విలువ కంటే అధికంగా రిజిస్ట్రేషన్ చార్జీ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. ఇట్టి విషయంపై ఎమ్మెల్యేను సంప్రదించగా సానుకూలంగా స్పందించి ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కు రుణపడి ఉంటామని చెప్పారు. భూముల మార్కెట్ విలువలను తగ్గించాలని ఎమ్మెల్యేకు పలుమార్లు విజ్ఞప్తి కూడ చేశామన్నారు.

మా విజ్ఞప్తిని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ద్వారా సంబదిత మంత్రితో మాట్లాడి పెరిగిన రిజిస్ట్రేషన్ల ధరలను స్థిరంగా (పాత చార్జీలు) ఉండే విధంగా పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం చొరవ చూపిన ఎమ్మెల్యేను తాండూరు డాక్యుమెంట్ రైటర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే తో పాటు, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్రెడ్డి,తాండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

## పేదింటి పెళ్లికి 'సమత' భరోసా


- ఎన్నికల హామీని నిలబెట్టుకున్న చైర్‌పర్సన్.. రూ.25 వేల ఆర్థిక సాయం
- పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా ఉంటామని హామీ



**చేవెళ్ల, ఆగస్టు 26(ప్రజా జ్యోతి) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 16వ వార్డుకు చెందిన చాకలి అనంతయ్య కుమార్తె వివాహానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ సమత వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం తమ బాధ్యత అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా ఉంటామని, అవసరమైన సమయంలో ఆపన్నహస్తం అందిస్తామని చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సోలిపురం బల్వంత్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచులు టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, గంగి యాదయ్య, నాయకులు అత్తిలి రవీందర్‌రెడ్డి, కవాడి రాజావర్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అత్తెల్లి రమణారెడ్డి, గ్రామ పెద్ద గొల్లగడ్డం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మడికట్టు ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

- చలో వరంగల్‌ను సక్సెస్ చేయాలి
- ఎమ్మార్పీఎస్ చేవెళ్ల మండల ఇన్‌చార్జ్ శివశంకర్ మాదిగ



**చేవెళ్ల ఆగస్టు 26(ప్రజా జ్యోతి) :** ఎమ్మార్పీఎస్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నూతన కమిటీల ఏర్పాటు కొనసాగుతోందని చేవెళ్ల మండల ఇంచార్జి బ్యాతల శివశంకర్ మాదిగ తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బుధవారం చేవెళ్ల మండలం తంగడపల్లి అనుబంధ గ్రామం మడికట్టులో నూతన ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ధర్మసాగర్ బాలకృష్ణ, అధికార ప్రతినిధిగా న్యాలట అనిల్, ప్రధాన కార్యదర్శిగా సిద్దు, ఉపాధ్యక్షుడిగా శివకుమార్, కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా గణేష్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివశంకర్ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన నేపథ్యంలో దాని ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో అందేలా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ ఉప వర్గీకరణ నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేసేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీల పరిచయ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, మండలంలో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ నూతన క్యాడర్‌ను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. యువత, విద్యార్థులను ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ వైపు తీసుకురావడంతో ఉద్యమానికి మరింత బలం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షులు ఊరెంట ప్రవీణ్‌కుమార్, చందు, మల్లేష్, రాజు, గణేష్, ఆనంద్, నర్సింలు, రవి, బాలు, చేవెళ్ల మహేందర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయమే లక్ష్యం ,

## ఎమ్మార్పీఎస్ ఎండపల్లి మండల అధ్యక్షుడు కుమారస్వామి,

ఎండపల్లి, ఆగస్ట్ 26 ప్రజా జ్యోతి,

ఎమ్మార్పీఎస్ ఎండపల్లి మండల అధ్యక్షుడిగా కొండాపూర్ గ్రామానికి చెందిన చెన్న కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నాగవల్లి లక్ష్మీనృసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి రేణుకుంట సాగర్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు,



కార్యకర్తలు కుమారస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ధర్మపురి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు చిలుముల లక్ష్మణ్ హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలకు చెన్న కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేయడంతోపాటు సామాజిక న్యాయమే లక్ష్యంగా,అణగారిన వర్గాల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దుమల గంగారాం, పోడేటి సునీల్, వెల్గటూర్ ఇన్‌చార్జి మోకేనపెల్లి సతీష్, సీనియర్ నాయకులు మంతెన లక్ష్మణ్, గ్రామ శాఖ అధ్యక్షుడు చిలుముల మొండయ్య, ఓరుగంటి నాగేష్, చొప్పదండి భూమయ్య, అర్రికిల్ల ప్రశాంత్, గజ్జెల మల్లయ్య, సూరమల్ల ప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.

# మానవతా మూర్తి స్ఫూర్తితో ఆశా వర్కర్లకు ఘన సన్మానం

రాయికల్,ఆగస్టు 26 (ప్రజా జ్యోతి)

మానవతా మూర్తి మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ రాయికల్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లను ఘనంగా సన్మానించారు. సమాజ సేవకు జీవితాన్ని అంకితం




చేసిన మదర్ థెరిస్సా ఆశయాలను స్మరించుకుంటూ,ప్రజారోగ్య పరిరక్షణలో నిరంతరం సేవలందిస్తున్న ఆశా వర్కర్ల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ మాట్లాడుతూ,మదర్ థెరిస్సా అనాథలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు, నిరాశ్రయులు, కుష్టు రోగుల సేవకే తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. కులమత భేదాలకు అతీతంగా ప్రతి మనిషిలో మానవత్వాన్ని చూసి సేవ చేసిన మహనీయురాలని పేర్కొన్నారు.అదే సేవా స్ఫూర్తితో ఆశా వర్కర్లు పట్టణాలు, గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలను చేరువ చేస్తున్నారని తెలిపారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, పేదలకు ఆరోగ్య అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో వారు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు.కార్యక్రమంలో చార్టర్డ్ ప్రెసిడెంట్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు,సెక్రటరీ కనపర్తి శ్రీనివాస్, ట్రెజరర్ సుధవేని మురళీగౌడ్, మ్యాకల రమేష్,మచ్చ శేఖర్, ఆడెపురం ప్రసాద్, దాసరి గంగాధర్, సంకోజు అశోక్, పులి రమేష్, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్, సామల సత్యనారాయణ, బుర్ల మహేష్,ఎద్దండి దివాకర్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# పేదింట సొంతింటి కల సాకారం,

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న సర్పంచ్ ఆవుల మమత తిరుపతి,

ఎండపల్లి, ఆగస్టు 26, ప్రజా జ్యోతి,

మండలంలోని ఉండేడ గ్రామానికి చెందిన కటుకూరి బాలమ్మ, వెంకటి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంట్లో బుధవారం గృహప్రవేశం నిర్వహించారు. ఈ కార్యక్ర



మానికి ముఖ్యఅతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ ఆవుల మమత తిరుపతి దంపతులకు శాలువా కప్పి ఆహ్వానించారు ,ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం అలాగే సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో ,నియోజకవర్గంలో మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోతు రవి, వార్డు సభ్యులు గుండా మనోజ్, బొమ్మగాని శశిధర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు.. ఎమ్మెల్యే సంజయ్ శుభాకాంక్షలు

రాయికల్,ఆగస్టు 26 (ప్రజా జ్యోతి)

రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామానికి చెందిన మోడీ వనిత–శంకర్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ హాజరయ్యారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి చీరను కానుకగా అందజేశారు.

అనంతరం వడ్డెర కాలనీకి చెందిన బోదాసు విజయకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఆమెకు కూడా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చీరను కానుకగా అందజేశారు. కార్యక్రమాల్లో రాయికల్ మండల గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కోడెల సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా చర్యలు

- కోడెల మృతిపై విచారణకు ఆదేశం
- నూతన గోశాల నిర్మాణానికి 40 ఎకరాల స్థలం
- రాష్ట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- గోశాలను సందర్శించిన విప్ పాల్గొన్న ఆలయ ఈఓ, మున్సిపల్ చైర్మన్ అధికారులు

వేములవాడ,ఆగస్ట్,26:ప్రజాజ్యోతి.

వేములవాడ రాజన్న ఆలయానికి భక్తులు సమర్పిస్తున్న కోడెలు, ఆవుల సంరక్షణ కోసం గోశాలను మరింత పటిష్టం చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గోశాలను సందర్శించారు... ఇటీవల ఐదు కోడెలు మృతి చెందిన ఘటనపై, గోశాల నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు, సంబంధిత పశువైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వారు మాట్లాడుతూ చిన్న వయసు కోడెలను దూర ప్రాంతాల నుంచి తీసుకురావడం, వాతావరణ మార్పులు, వ్యాధులు తదితర కారణాల వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. భక్తులు రాజన్నకు మొక్కు చెల్లించే ఉద్దేశంతో పాలు మరవని చిన్న కోడెలను సమర్పించకుండా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కనీసం ఏడాది వయసు వచ్చిన తర్వాత కోడెలను సమర్పిస్తే అవి వాతావరణానికి అలవాటు పడి అనారోగ్యానికి గురికాకుండా ఉండే అవకాశం ఉంటుందని సూచించారు. గోశాలకు కొత్తగా వచ్చే కోడెలను 15 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచి, వయసు ఆధారంగా గ్రేడింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న కోడెలు, పెద్ద కోడెలను వేర్వేరుగా ఉంచేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఒకదానిపై మరొకటి ఎగబడటం, పొడుచుకోవడం వంటి ఘటనలతో గాయాలు కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సేకరించి, క్యాబినెట్ ఆమోదం కూడా పొందినట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణానికి సంబంధించిన చర్యలు చేపట్టి వీలైనంత త్వరగా నూతన గోశాలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు.

ప్రస్తుతం ఉన్న గోశాల సామర్థ్యాన్ని కూడా పెంచుతున్నామని, భక్తులు సమర్పించే



వర్షాకాలం నేపథ్యంలో గోశాలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గోశాలలో పచ్చిగడ్డి, దాతలు అందించే పశుగ్రాసంతో పాటు అవసరమైన దాణాను నాణ్యతలో రాజీ లేకుండా అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన కోడెల మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. మానవ తప్పిదం లేదా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఘటన జరిగిందని తేలితే ప్రభుత్వ పరంగా తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.. వేములవాడలో ఆధునిక పద్ధతుల్లో నూతన గోశాల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 40 ఎకరాల స్థలాన్ని

కోడెలను సక్రమంగా సంరక్షించి, అవసరమైన సమయంలో భక్తులకు అందించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పాలు ఇవ్వలేని పరిస్థితికి చేరుకున్న ఆవులను కూడా కొందరు భక్తులు ఆలయానికి తీసుకొచ్చి వదిలేస్తున్నారని, వాటి సంరక్షణకు కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని రాజన్న ఆలయానికి సమర్పించే కోడెల సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా ప్రభుత్వం, దేవాదాయ శాఖ, పశుసంవర్ధక శాఖ సమన్వయంతో పనిచేస్తామని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# చిన్న కోతతో భుజం, మోకాలి కి ఆర్థ్రోస్కోపీ సేవలు

- త్వరగా కోలుకోవడం, తక్కువ నొప్పి ప్రధాన ప్రయోజనాలు:
- డాక్టర్ సుకేష్ రావు యశోద హాస్పిటల్

కరీంనగర్ టౌన్ ఆగస్టు 26(ప్రజా జ్యోతి)

అధునాతన వైద్య సాంకేతికతతో భుజం, మోకాలి సమస్యలకు చిన్న కోతతో కూడిన ఆర్థ్రోస్కోపీ చికిత్సలను విస్తరించినట్లు యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్‌కు చెందిన ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ సుకేష్ రావు సంకినేని తెలిపారు. భుజం ఆర్థ్రోస్కోపీ, మోకాలుకి ఆర్థ్రోస్కోపీ ద్వారా వివిధ కీళ్ల సమస్యలను ఖచ్చితంగా గుర్తించి, తక్కువ కోతతో చికిత్స అందించవచ్చని పేర్కొన్నారు. ఆర్థ్రోస్కోపీ విధానంలో పెన్సిల్ పరిమాణంలో ఉండే ఆర్థ్రోస్కోప్‌కు అమర్చిన హై-డెఫినిషన్ కెమెరా, ఫైబర్-ఆప్టిక్ లైటింగ్ సహాయంతో కీళ్ల లోపలి భాగాలను స్పష్టంగా పరిశీలిస్తారు. చిన్న రంధ్రాల ద్వారా చికిత్స చేయడం వల్ల చుట్టుపక్కల ఆరోగ్యకరమైన కణజాలానికి నష్టం తక్కువగా ఉంటుందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సుకేష్ రావు సంకినేని మాట్లాడుతూ, సంప్రదాయ శస్త్రచికిత్సలతో పోలిస్తే ఆర్థ్రోస్కోపిక్ విధానంలో కోత చాలా చిన్నగా ఉండటంతో కండరాలు, చుట్టుపక్కల కణజాలాలకు తక్కువ నష్టం జరుగుతుందని చెప్పారు. దీంతో శస్త్రచికిత్స




అనంతరం నొప్పి తగ్గడంతో పాటు, రికవరీ వేగంగా ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. రోగి పరిస్థితి, శస్త్రచికిత్స రకం ఆధారంగా చికిత్స అనంతరం అదే రోజు ఇంటికి వెళ్లే అవకాశం కూడా ఉంటుందని పేర్కొన్నారు.షోల్డర్ ఆర్థ్రోస్కోపీ ద్వారా రోటేటర్ కఫ్ టియర్స్, ల్యాబ్రల్ టియర్స్, షోల్డర్ ఇంపింజ్‌మెంట్, పదేపదే భుజం జారిపోవడం వంటి సమస్యలకు చికిత్స అందించవచ్చు. అలాగే ఎంపిక చేసిన కేసుల్లో ఫ్రోజెన్ షోల్డర్‌కు సంబంధించిన చికిత్సలు కూడా అందుబాటులో ఉంటాయి. మోకాలి ఆర్థ్రోస్కోపీ ద్వారా మెనిస్కస్ టియర్స్, ఏ సి ఎల్ /పి సిఎల్ పునర్నిర్మాణ శస్త్రచికిత్స, కార్టిలేజ్ లేదా చిన్న ఎముక ముక్కలను తొలగించడం, ప్రారంభ దశలోని కొన్ని కీళ్ల సమస్యలకు అవసరమైన డీబ్రైడ్‌మెంట్ వంటి చికిత్సలు నిర్వహించవచ్చు. యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్‌లో ఆధునిక ఆర్థ్రోస్కోపీ పరికరాలు, ఫ్లూయిడ్ ప్రెజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, మైక్రో ఇన్‌స్ట్రుమెంట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు, ఫిజియోథెరపిస్టుల బృందం రోగుల నిర్ధారణ నుంచి శస్త్రచికిత్స అనంతర పునరావాసం వరకు సమగ్ర వైద్య సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సిబ్బంది శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

# ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 26( ప్రజా జ్యోతి)

ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదినాన్ని పురస్కరించుకుని సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం గుండా కొనసాగింది. పెద్ద సంఖ్యలో యువత ర్యాలీలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టి, ప్రధాన ప్రాంతాల్లో పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు శాంతి, సోదరభావం, దయ, మానవత్వం, సేవాభావం వంటి విలువలను చాటుతూ





మీలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పలు కార్యక్రమాలు చేపట్టారు.

జామే మజీద్ నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా మీదుగా పట్టణంలోని ప్రధాన వీధుల బందోబస్తు ఏర్పాటు చేశారు. సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. అనంతరం జామే మజీద్ నుంచి దర్గా వరకు ముస్లిం సోదరులు పాదయాత్ర నిర్వహించారు.ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద నిర్వహించిన ఖీర్ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సమీ, మాజీ అధ్యక్షులు, యూసుఫ్, ముస్తఫా, సత్తార్, సయ్యద్ సమద్, రఫిక్, మునీర్, సయ్యద్ సోహెల్, సయ్యద్ అక్రమ్, రైస్, మహమూద్, షాదాబ్, అంజద్, చాంద్, మత పెద్దలు పాల్గొన్నారు.

# మామిడిపెల్లిలో ఇల్లు కూలి మహిళా మృతి

కొనరావుపేట,ఆగస్టు.26(ప్రజాజ్యోతి)

కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో శిథిలవస్తలో ఉన్న ఇల్లు కూలిపోవడంతో ఇంట్లో నిద్రిస్తున్న గుమ్మడి లక్ష్మి , (40) అక్కడికక్కడే మృతి చెందింది. పాత ఇల్లు కావడంతో గోడలు పైకప్పు కూలినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె నిరుపేద కుటుంబానికి చెందిన వారని ఆమె మృతితో కుటుంబంలో తీవ్ర విషాదంలో మునిగిపోయిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ మృతురాలి కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్థిక సహాయం చేయాలని కోరారు.



# అంగన్‌వాడీ పోస్టులకు 53 మంది దరఖాస్తు

మేడిపల్లి: ఆగస్ట్ 2026 ప్రజా జ్యోతి

ఉమ్మడి మేడిపల్లి మండల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు 53 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. తొంబరావుపేటకు 23, మేడిపల్లి 1, 2 కేంద్రాలకు 9, గోవిందారానికి 11, పసునూరు తండాకు 10 మంది దరఖాస్తు చేసినట్లు అధికారులు తెలిపారు.

27 నుంచి ధ్రువపత్రాల పరిశీలన దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 5 వరకు జగిత్యాల ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సీడీపీఓ జయప్రద తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాల ఒరిజినల్స్‌తో పాటు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. నిర్ణీత తేదీల్లో హాజరై పరిశీలన ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.

# బక్కురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేట్లెట్స్ దానం చేసిన యువకుడు

భీమారం, ఆగస్టు 26:

ప్రజాజ్యోతి భీమారం మండలం మోత్కరావుపేట గ్రామానికి చెందిన ఎగుర్ల రాధ జ్వరంతో బాధపడుతూ జగిత్యాలలోని ఓ ప్రైవేట్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు అత్యవసరంగా ప్లేట్లెట్స్ అవసరమని వైద్యులు సూచించడంతో కుటుంబ సభ్యులు బక్కురి ఫౌండేషన్ చైర్మన్ నరేష్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించిన నరేష్ సూచన మేరకు పసునూర్ గ్రామానికి చెందిన ఈర్నాల తిరుపతి ఆస్పత్రికి వెళ్లి ప్లేట్లెట్స్ దానం చేశారు. ఆపద సమయంలో స్పందించి ప్లేట్లెట్స్ దానం చేసిన తిరుపతిని బక్కురి ఫౌండేషన్ చైర్మన్ నరేష్, ఆస్పత్రి సిబ్బంది, రోగి బంధువులు, గ్రామస్థులు అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం, ప్లేట్లెట్స్ దానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని వారు పేర్కొన్నారు.

# ఆగస్టు 31న మాలల చలో సెక్రటేరియట్ ముట్టడి

గంభీరావుపేట ఆగస్టు 26(ప్రజా జ్యోతి);

ఎస్సీ వర్గీకరణ అనంతరం మాలలు మాల అనుబంధ కులాలకు విద్య ఉద్యోగాలు పదోన్నతుల్లో అన్యాయం జరిగిందని నిరసిస్తూ బుధవారం ఎస్సీ రోస్టర్ విధానాన్ని తక్షణమే సవరించకపోతే, ఆగస్టు



31న మాలల ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సెక్రటేరియట్ను ముట్టడిస్తామని పిలుపునిస్తూ గంభీరావుపేట మండలంలోని అన్ని గ్రామాల మాలలు మరియు మాల ఉప కులాలు విద్యార్థులు యువతి యువకులు అన్ని గ్రామాల నుండి తరలిరావాలని సెక్రటేటివ్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా మాలల ఐక్యవేదిక జిల్లా నాయకులు ఎగదండి స్వామి బండ రమేష్ రెడ్డి మల్ల రాజనర్సు ఎడబోయిన రాజు మల్యాల రాజ్ మీరు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘం మండల కన్వీనర్ గా మురళి



చొప్పదండి, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):

తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం చొప్పదండి మండల కన్వీనర్ గా కోనేరుపల్లికి చెందిన గజ్జల మురళిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గజ్జలకాంతం ఆదేశాల మేరకు ఈ నియామకం చేసినట్లు పేర్కొన్నారు. మురళీ గత కొంతకాలంగా సంఘంలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను, సిద్ధాంతాలను గ్రామ గ్రామాన విస్తరింప చేయడంలో అహర్నిశలు కృషి చేస్తున్నారని అభినందించారు. తన సేవలను గుర్తించి ఈ అవకాశం కల్పించినట్లు చెప్పారు.

# యువత స్వయం ఉపాధితో ముందుకు రావాలి

## -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ,ఆగస్ట్,26:ప్రజాజ్యోతి.

యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు..బుధవారం వేములవాడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రితో పాటు అడ్వాన్ మెన్స్ వేర్ను



రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో ప్రతిభ, నైపుణ్యాలు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సరైన దిశలో వినియోగించుకుని స్వయం ఉపాధి రంగంలో రాణించాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ, ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని యువత ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని అన్నారు. వేములవాడ పట్టణంలో నూతనంగా ఆసుపత్రి,వస్త్ర దుకాణం ఏర్పాటు చేయడం అభినందనీయమని, స్థానికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించేలా వ్యాపారాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు...

# జిలుగుమాడులో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

☆ లబ్ధిదారులకు అందజేసిన కౌన్సిలర్లు యన్నం కోటేశ్వరరావు, దోర్నాల శిరీష-వెంకటరవి



**మధిర ప్రజాజ్యోతి** మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో కౌన్సిలర్లు యన్నం కోటేశ్వరరావు మరియు దోర్నాల శిరీష-వెంకటరవి హాజరై లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గ్రామంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందజేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు అందజేసినందుకు ప్రభుత్వానికి, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిపిఓ వెంకటరమణి రేషన్ డీలర్ పాశం విజయ కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరువీధుల వెంకటేశ్వరరావు డివిజన్ అధ్యక్షులు దోర్నాల నాగ మురళి కోరంపల్లి చంటి , మరియు మహిళలు, డ్వాక్రా గ్రూప్ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఆర్పీలు, గ్రామ పెద్దలు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మదర్ థెరిసా స్ఫూర్తితో ప్రతి ఒక్కరు

# సేవా భావం పెంపొందించుకోవాలి

☆ కిండిల్ రూరల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు అనూష



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని జమలాపురం బాలాజీ భవన్ వృద్ధాశ్రమ నందు కిండిల్ రూరల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మదర్ తెరిసా జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలాజీ భవన్ ఆశ్రమం లోని వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షురాలు వి. అనూష మాట్లాడుతూ మదర్ థెరిసా స్ఫూర్తితో ప్రతి ఒక్కరు సేవా భావంతో సమాజంలోని అభాగ్యులను ఆదరించాలని ఆకాంక్షించారు ప్రతి ఒక్కరూ సేవా భావంతో ఎంతో కొంత సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కనకవల్లి సత్యనారాయణ ,జయమ్మ బాలాజీ భవన్ కన్వీనర్ కర్నాటి శ్రీనివాసరెడ్డి, దుపుకుంట్ల వెంకటేశ్వరరావు, సముద్రాల మోహన్ రావు, గంగాధర్ రెడ్డి, వీరభద్రరావు అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా ప్రజలకు మరింత సులభతరమైన,సమర్థవంతమైన ఆధార్ సేవలను అందించేందుకు స్థానిక మమత హాస్పిటల్ రోడ్,కవిరాజ్ నగర్ లో ఏర్పాటు చేసిన ఖమ్మం ఆధార్ సేవా కేంద్రం ను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు.







ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కొత్తగా ప్రారంభించిన ఖమ్మం ఆధార్ సేవా కేంద్రంలో ప్రజలకు సౌకర్యవంతమైన ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అన్ని వయస్సుల వారికి కొత్త ఆధార్ నమోదు, డెమోగ్రాఫిక్ అప్‌డేట్లు,బయోమెట్రిక్ అప్‌డేట్లు తదితర సేవలను యుఐడిఏ మార్గదర్శకాల ప్రకారం అందించనున్నారు. కొత్త ఆధార్ నమోదు పూర్తిగా ఉచితమని తెలిపారు. ప్రజలకు మరింత సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఈ కేంద్రంలో ఆదివారాల్లో కూడా ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. దీనివల్ల ఉద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు, ఇతర ప్రజలు తమకు అనుకూలమైన సమయంలో ఆధార్ సేవలను పొందేందుకు అవకాశం కలుగుతుందన్నారు.ఖమ్మం ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం జిల్లాలో ఆధార్ సేవల బలోపేతానికి, పౌర కేంద్రిత డిజిటల్ సేవల విస్తరణకు మరో ముఖ్యమైన ముందడుగని మంత్రి అన్నారు. ప్రజలకు అవసరమైన గుర్తింపు సేవలను మరింత అందుబాటులోకి, సమర్థవంతంగా, సౌకర్యవంతంగా అందిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమానికి సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్,యు ఐ డి ఏ ఐ హైదరాబాద్ డైరెక్టర్ కె.ఎం. భారతి, అసిస్టెంట్ మేనేజర్ పి. రత్నాకర్, బీఎల్ఎస్ ఆధార్ సేవా కేంద్రం ప్రతినిధులు రీజినల్ మేనేజర్ కె. శ్రీనివాస్ కుమార్, క్లస్టర్ మేనేజర్ దుగ్గి హరినాథ్, ఆపరేషన్స్ మేనేజర్ పి. సురేష్ కుమార్,ఇడిఎం దుర్గాప్రసాద్,అధికారులు,ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల పరువును బజారుకు ఈడ్చకండి

☆ వ్యక్తిగత విమర్శలు మానుకోండి ☆ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టండి
☆ ఎమ్మెల్యే పాయం, మాజీ ఎమ్మెల్యే రేగాలకు తుడుందెబ్బ హితవు

**మణుగూరు, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి) :** పినపాక నియోజకవర్గంలో తాజా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పరస్పరం చేసుకుంటున్న వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలు, దూషణలను తక్షణమే నిలిపివేయాలని, ఆదివాసీల పరువును బజారుకు ఈడ్చకండని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇద్దరూ ఆదివాసీ సమాజానికి చెందిన నాయకులై ఉండి, ప్రజా సమస్యలను పక్కనపెట్టి ఒకరిపై ఒకరు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకుంటూ కార్యకర్తలను, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన ఈ ఇద్దరు నాయకులను పినపాక ప్రజలు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేలుగా గెలిపించి గౌరవించారని, ఆ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. అదే సమయంలో నియోజకవర్గంలో ఇంకా ఎన్నో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటి పరిష్కారంపై దృష్టి సారించాల్సిన నాయకులు వ్యక్తిగత ఆరోపణలతో కాలం గడపడం సరికాదన్నారు. ప్రజా సమస్యలు, ఆదివాసీల భూ హక్కులు, ఉపాధి, విద్య, వైద్యం, అభివృద్ధి అంశాలపై చర్చ జరగాలని సూచించారు. అంతేకానీ ఆదివాసీల పరువును బజారుకు ఈడ్చకండని అలెం కోటి ఘాటుగా హెచ్చరించారు. ఒకరి తర్వాత ఒకరు ప్రెస్‌మీట్లు పెట్టుకుని పరస్పరం విమర్శలు చేసుకోవడం ద్వారా ఆదివాసీ సమాజాన్ని చులకన చేసే పరిస్థితి తీసుకురావొద్దన్నారు. రాజకీయ విభేదాలు ఉండొచ్చు కానీ వాటిని ప్రజా సమస్యల పరిష్కారానికి అడ్డంకిగా మార్చడం సమంజసం కాదన్నారు. ఎవరిపై ఎలాంటి అభియోగాలున్నా వాటిని పరిశీలించడానికి న్యాయస్థానాలు, విచారణ సంస్థలు ఉన్నాయని అన్నారు. ప్రజా సమస్యలపై ఎవరు నిజాయితీగా పనిచేస్తారో ప్రజలే తుది తీర్పు ఇస్తారని చెప్పారు. పినపాక ప్రజలు ఎంతో చైతన్యవంతులని, ప్రజాప్రతినిధుల ప్రతి కదలికను నిశితంగా గమనిస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా నేతలు వ్యక్తిగత ఆరోపణలకు ఫుల్‌స్టాప్ పెట్టి, నియోజకవర్గ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి విజ్ఞప్తి చేశారు.



## స్వామి నారాయణ్ గురుకుల పాఠశాల

# నిర్మాణ పనులకు భూమిపూజ, శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

☆ భారత దేశ ఔనత్యం విలువలు ప్రపంచానికి చాటేలా స్వామి నారాయణ గురుకుల పాఠశాల
☆ రఘునాథపాలెం మండలం జింకలతాండలో 13 ఎకరాల్లో గురుకుల పాఠశాల ☆ నిరుపేద విద్యార్థులకు 10 శాతం ఉచిత సీట్లు





**రఘునాథపాలెం : ప్రజా జ్యోతి** గిరిజన ప్రాంతంలో విద్యా ప్రమాణాలను మరింత పెంచడంతో పాటు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలతో పాటు చుట్టుపక్కల జిల్లాల విద్యార్థులకు సైతం నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించే దిశగా రఘునాథపాలెం మండలం జింకలతండాలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్వామినారాయణ గురుకుల పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి బుధవారం భూమిపూజ, శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 13.10 ఎకరాల్లో స్వామి నారాయణ గురుకుల్ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన అందించనున్నారన్నారు. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో పాఠశాల భవనాలు, విద్యార్థులకు అవసరమైన ఆధునిక సౌకర్యాలతో క్యాంపస్ రూపుదిద్దుకోనుందని తెలిపారు. విద్యతో పాటు మానవతా విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ వ్యవస్థ, నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా విద్యాబోధన సాగనుందని మంత్రి తెలిపారు. ఆధునిక విద్యతో పాటు భారతీయ విలువలను విద్యార్థుల్లో పెంపొందించేలా గురుకుల్ విద్యా విధానం ఉండనుందన్నారు. తెలంగాణలో స్వామినారాయణ గురుకుల్‌కు ఇది 5వ విద్యాసంస్థ అని మంత్రి అన్నారు. పాఠశాలలో అందుబాటులో ఉండే సీట్లలో 10 శాతం సీట్లను ఎలాంటి ఫీజు లేకుండా నిరుపేద విద్యార్థులకు కేటాయించే అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కు అప్పగించారన్నారు. దీంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందే అవకాశం లభించనుందని తెలిపారు. గిరిజన ప్రాంతాలతో పాటు ఖమ్మం జిల్లా, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు నాణ్యమైన విద్యను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ఈ విద్యాసంస్థ ఏర్పాటు జరుగుతోందని మంత్రి తెలిపారు. ఆధునిక విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, మానవతా విలువలను విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందని, స్వామినారాయణ గురుకుల్ విద్యా విధానం ఈ లక్ష్యానికి అనుగుణంగా ఉంటుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, స్వామీ నారాయణ్ గురుకుల్ ప్రతినిధులు, ఎమ్మార్వో శ్వేత, మండల ఉన్నత అధికారులు, గ్రామ సర్పంచులు,స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యులపై టీజీఎంసి దాడులు ఆపాలి

☆ ఆర్ఎంపీలను ఇబ్బంది పెట్టటం బాధాకరం ☆ ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి
☆ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు

**కారేపల్లి, ఆగస్టు26, ప్రజా జ్యోతి:** మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ప్రథమ చికిత్స అందిస్తూ ప్రజల మన్నలను పొందుతూ జీవనోపాధి సాగిస్తున్న గ్రామీణ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్(టీజీఎంసీ) దాడులు చేయడం తక్షణమే ఆపాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సింగరేణి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ మెడికల్ కౌన్సిల్(టీజీఎంసీ) అనుచిత దాడులతో గ్రామీణ వైద్యులను భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. గ్రామంలో వైద్య నారాయణలు ఆర్ఎంపీలే అలాంటి వారిపై చర్యలు చాలా బాధాకరమని ఆయన వాపోయారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2009లో వైస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు పారామెడికల్ బోర్డు ద్వారా శిక్షణ ఇచ్చి అర్హత సాధించిన ప్రతి ఒక్క గ్రామీణ వైద్యుడికి ధృవీకరణ సర్టిఫికెట్లు అందించాలని దాదాపు 20 వేల మందికి వెయ్యి గంటల శిక్షణ ఇచ్చిందని,మిగతా వారికి మధ్యలోనే శిక్షణ ఆగిపోయిందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 65వేల మంది దరఖాస్తులు చేసుకున్నారని వారిలో 55 వేల మందిని అర్హులుగా తేల్చారన్నారు.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణంతో దానికి నిధులు కేటాయింపు లేక ఆప్రక్రియ నిలిచిపోయింది.నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రక్రియను కొనసాగిస్తుందని ఆశించామన్నారు.గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం గెలుపుకు ఆర్ఎంపీలు గ్రామీణ ప్రాంతాలలో కీలక పాత్ర పోషించారని గుర్తుకు చేశారు.గడిచిన మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ వైద్యుల పట్ల ఎటువంటి చిత్తశుద్ధి చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓవైపు టీజీఎంసీ గ్రామీణ వైద్యులపై దాడి చేస్తున్న ప్రభుత్వం స్పందించక పోవటం విచారకరమన్నారు. గ్రామీణ వైద్యులను గ్రామీణులే రక్షించుకుంటారన్నారని ధీమా వ్యక్తం చేశారు.గ్రామీణ వైద్యులు బతుకుదెరువు కోసం పోరాటాలు చేయాల్సిన పరిస్థితిని టీజీఎంసీ తీసుకువస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామీణ వైద్యుల సేవలకు చట్టబద్ధత తీసుకురావాలని కోరారు. గ్రామీణ వైద్యులపై టిసిఎంసి దాడులు ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం తరఫున నిరసనకు సైతం వెనకాడబోమని హెచ్చరించారు.



**ఆర్ఎంపీలు పరిధి నుంచి వైద్యం చేయద్దు**

ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని పరిధికి మించి వైద్యం చేసి ప్రజల్ని ఇబ్బంది పెట్టి మీరు ఇబ్బందులలో పడద్దని సూచించారు.ఈ సమావేశంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతారపు వెంకటాచారి,ఉపాధ్యక్షుడు నారపోగు సుదర్శన్,జిల్లా కౌన్సిల్ సభ్యులు దాసరి శ్రీనివాసరావు,దుస్సా మనోహర్,సింగరేణి మండల అధ్యక్ష,కార్యదర్శులు మండెపూడి వీరయ్య చౌదరి,కార్యదర్శి ఆకారపు రఘు,ఐ.వెంకటేశ్వర్లు, సున్నం రామారావు,బ్రహ్మం, సైదులు దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

☆ శాంతి ప్రదర్శనలో పాల్గొన్న వందలాది ముస్లిం సోదరులు
☆ ప్రదర్శనలో పాల్గొన్న కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్
☆ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా
☆ మహమ్మద్ ప్రవక్త ఆధ్యాత్మిక నాయకుడే కాదు సమాజ నిర్మాత
☆ ప్రవక్త బోధనలు ముస్లింలకే కాదు సర్వ మానవాళి అందరికీ వర్తిస్తాయి





**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 26,(ప్రజా జ్యోతి)** మొహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా బుధవారం పట్టణ పరిధి లోగల అబ్దుల్ కలాం టవర్ కు సమీపంలో ఉన్న జామే మసీద్ లో మిలాదున్నభి వేడుకలు మార్కజి ఆహేలే సున్నత్ వల్ జమాత్ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి మజీదులో ముస్లిం సోదరులు జాగరణ చేసి, ప్రత్యేక నమాజ్ చేశారు. పట్టణం లో ఉన్న పలు మజీద్ లకు చెందిన ముస్లింలు ప్రధాన మజీదైన జామే మజీద్ కు చేరుకొని, ప్రత్యేక కార్యక్రమం లో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో సుమారు పది కిలోమీటర్ల మేరకు జులుసే మొహమ్మది (శాంతి ప్రదర్శన) నిర్వహించారు. జామే మజీద్ మౌలానా సర్ఫరాజ్ ఆలం ఖాద్రి ఆధ్వర్యంలో, జామే మసీద్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఫయాజ్ ఉల్ హుస్సేన్, ఇబ్రహిం కురేషి ల నేతృత్వంలో భారీ శాంతి ప్రదర్శన నిర్వహించారు. స్థానిక జామే మజీద్ నుండి ప్రారంభమైన శాంతి ప్రదర్శన శాస్త్రీ రోడ్డు, అప్సరా సెంటర్, రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్, బస్టాండ్, బీసీఎం రోడ్, అంబేద్కర్ సెంటర్, కిన్నెరసాని రోడ్, నటరాజ్ సెంటర్ ల మీదుగా ప్రదర్శన తిరిగి జామే మజీద్ కు చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద జామే మజీద్ కమిటీ అధ్యక్షులు ఫయాజ్ మాట్లాడుతూ ఆ నాడు ఉన్న పరిస్థితులకు అనుగుణంగా, మెసులు కుంటూ, వక్రమార్గన వెళుతున్న ఎందరినో సక్రమార్గన నడిపించిన ధీశాలి ప్రవక్త అన్నారు. బానిసను సోదరుడిగా చూడమని, వారిని విముక్తి చేయటం గొప్ప పుణ్య మని ప్రవక్త బోదించారన్నారు. మొహమ్మద్ ప్రవక్త కేవలం ఆధ్యాత్మిక నాయకుడే కాదు, సమాజ నిర్మాత కూడ అన్నారు. అంతే కాకుండా భిన్న మతాలు, వర్గాలు కలిసి కట్టుగా జీవించగలరని ఆయన ఆచరణలో నిరూపించ గలిగారన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ మొహమ్మద్ ప్రవక్త సమాజానికి చేసిన బోధనలు కేవలం ముస్లింలకే పరిమితం కావని, అవి సర్వ మానవళి అందరికి వర్తిస్థాయన్నారు. మానవళి విమోచకుడిగా, న్యాయం, సమానత్వం, దయ, కరుణలకు ప్రతి రూపంగా ప్రవక్త 1500 సంవత్సరాల క్రితం జన్మించారన్నారు. మానవులందరు దేవుని దృష్టిలో సమానులే, ఎవరికీ, ఎవరిపై ఎలాంటి అధిఖ్యత లేదని నిరూపించిన వ్యక్తి ప్రవక్త అన్నారు. అయన యుద్ధాన్ని కాకుండా, శాంతిని ప్రోచాహించేవారన్నారు. అనంతరం కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ మొహమ్మద్ ప్రవక్త ఆశయాలు ప్రతి ఒక్క సోదరుని లక్ష్యం కావాలన్నారు. ఈ సందర్భంగా అయన ముస్లిం సోదరులకు మీలాదున్నబి శుభాకాంక్షలు అందచేశారు. ఈ కార్యక్రమం లో మజీద్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం డి ఇబ్రహీం ఖురేషి, వర్కింగ్ ప్రెసిడెంట్ అహ్మద్ హుస్సేన్, ఉపాధ్యక్షులు ఎం డి. జైనుల్లా బుద్దీన్, కమిటీ భాద్యులు ఎండి అక్బర్, రహీం, మౌలానా, మస్తాన్, ఫక్రు లతో పాటు పలు మసీదులకు చెందిన మౌజన్లు, ఇమాములు, ముస్లిం యూత్ నాయకులు, పాత పాల్వంచ కు ముస్లిం సోదరులు పాల్గొన్నారు. పట్టణంలో శాంతి ప్రదర్శన సాఫీగా సాగేందుకు సహకరించిన పాల్వంచ పోలీస్ అధికారులకు, సిబ్బందికి కమిటీ కృతజ్ఞతలు తెలిపారు అనంతరం జామే మజీద్ అవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలి

**ఇల్లందు, ఆగస్ట్ 26 (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ లో భాగంగా అంబేద్కర్ అభయహస్తాన్ని వెంటనే అమలు చేయాలని మాదిగ హక్కుల పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేవెళ్ల డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ మాటా ఇచ్చిన అంబేద్కర్ అభయహస్తం రూ. 12 లక్షలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్ సమాదానం చెప్పాలని డిమాండి చేశారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాలలో ఈ పథకానికి సంబంధించి నిధులు విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి సుమారుగా 3 ఏళ్ళు కావస్తున్న దళితుల అభివృద్ధికి సహకరించలేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి అంబేద్కర్ అభయ హస్తం నిధులు కేటాయించని పక్షంలో రాష్ట్రంలోనే 33 జిల్లాలలో నిరసన దీక్షలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాదిగ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిగా మునుగులేటి వీరస్వామి మాదిగ, రాష్ట్ర కార్యదర్శిగా మంద కుమార్ లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా కన్వీనర్ కొండ్రు రాంబాబు, నాయకులు చిర్ర ఉపేందర్, రాజలింగం, రవి తదితరులు పాల్గొన్నారు.






## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న గుడిపల్లి శ్రీనివాస్ రెడ్డి

నిడమనూరు,ఆగస్టు 26, (ప్రజాజ్యోతి): తపస్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో బుధవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రధాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. నిడమనూరు పీఎం మోడల్ స్కూల్లో అర్థశాస్త్ర అధ్యాపకులుగా విధులు



నిర్వహిస్తున్న గుడిపల్లి శ్రీనివాస్ రెడ్డి కి ప్రతిష్ఠాత్మకమైన డిస్ట్రిక్ట్ బెస్ట్ టీచర్ అవార్డు ప్రదానం చేశారు.ఈ అవార్డును ఎమ్మెల్సీ ఏబీఎన్ రెడ్డి చేతుల మీదుగా, తపస్ జిల్లా, రాష్ట్ర బాధ్యులు, బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రముఖ కాలమిస్టు , రాజకీయ విశ్లేషకులు భాస్కర్ యోగి సమక్షంలో అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, బోధనా రంగంలో అంకితభావంతో, బాధ్యతాయుతంగా సేవలందించినందుకు గుడిపల్లి శ్రీనివాస్ రెడ్డిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిడమనూరు పీఎం మోడల్ స్కూల్‌కు చెందిన అవార్డు గ్రహీత గుడిపల్లి శ్రీనివాస్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఆయనకు ఈ అవార్డు లభించడం పాఠశాలకు, నిడమనూరు ప్రాంతానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు.అనంతరం ప్రిన్సిపాల్ బురుగు నిర్మల, సహ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు ఇతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని గుడిపల్లి శ్రీనివాస్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

## ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి..

పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించలేదు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకపై సంపూర్ణ విశ్వాసం ఉంది. మా కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. నా బిడ్డ ఎ÷-లాన్-ఎ ప్రకారం వ్యాఖ్యలు చేసింది. ఎ÷-లాన్-బి ఏమిటో నాకు తెలియదు. మంత్రి సురేఖ మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేడు కూడా మరో కార్యక్రమానికి హాజరయ్యారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడను' అని కొండా మురళి వ్యాఖ్యానించారు. సుస్మితకు స్వతంత్రంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని తెలిపారు. ఆమె వ్యాఖ్యలపై ప్రశ్నించే హక్కు తమకు లేదన్నారు. సుస్మిత తనకు నచ్చినట్లు తాను ఉంటుందని, ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయని కొండా మురళి పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని అన్నారు. 'మా బిడ్డ చేసిన వ్యాఖ్యలతో మాకేం సంబంధం?' అని వ్యాఖ్యానించారు. కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నీ ఇప్పటికే వివరించామని తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని కొండా మురళి స్పష్టం చేశారు. ఉత్తమ్ కూడా ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా వెళ్లిపోయారు. తాను సిఎంకు, పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే వరంగల్ జిల్లా పరకాలలో కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. సీఎం రేవంత్‌రెడ్డి హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆమె విమర్శించారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తూ.. తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రకటించారు. సుస్మిత వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమెపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిపింది.

## డిజిటల్ అరెస్ట్‌కు గురైన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి

### ఆధార్ వివరాలతో రూ.2.50 కోట్ల మోసం

### సకాలంలో స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు

హైదరాబాద్,ఆగస్ట్26(ప్రజాజ్యోతి): 'డిజిటల్ అరెస్ట్' పేరుతో 85 ఏళ్ల రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు మోసం చేసిన ఘటన హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఎన్ఐఎ అధికారినంటూ గుర్తుతెలియని వ్యక్తి బాధితుడికి ఫోన్ చేశాడు. ఆయన ఆధార్ వివరాలతో రూ. 2.50 కోట్ల మోసం జరిగిందని రిటైర్డ్ ఉద్యోగిని నిందితుడు భయపెట్టాడు. అనంతరం ఈ కేసు నుంచి బయట పడేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెరిఫికేషన్ పేరుతో నమ్మించి.. తన బ్యాంక్ ఖాతాలో రూ. 85.20 లక్షలు జమ చేయాలని బాధితుడికి సైబర్ కేటుగాడు సూచించాడు. నిందితుడి మాటలు నమ్మిన బాధితుడు ఆ మొత్తాన్ని అతను సూచించిన ఖాతాలో జమ చేశాడు. మరో రూ. 42 లక్షలు చెల్లించాలని నిందితుడు డిమాండ్ చేయడంతో బాధితుడికి అనుమానం వచ్చింది. దీంతో సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన రిటైర్డ్ ఉద్యోగి.. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తెలంగాణ సైబర్ పోలీసులు.. కోయంబత్తూరులోని ఐడిఎఫ్‌సి బ్యాంక్ బ్రాంచ్‌లో నిందితుడి ఖాతాను గుర్తించి, అందులో ఉన్న రూ. 85.20 లక్షలను ఫ్రీజ్ చేశారు. నిందితులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ప్రజలకు తెలంగాణ సిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు.

## నేపాల్ వరదలతో భారత్ అప్రమత్తం

### బీహార్, యూపి సిఎంల అత్యవసర చర్యలు

న్యూఢిల్లీ,ఆగస్ట్26(ప్రజాజ్యోతి): నేపాల్‌లో మెరుపు వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వరదల కారణంగా ఇప్పటి వరకు 16 మంది ప్రాణాలు కోల్పోయారని, 400 మంది గల్లంతయ్యారని స్థానిక అధికారులు అంచనా వేస్తున్నారు. నేపాల్‌లో భారీ వరదల నేపథ్యంలో బిహార్, ఉత్తర్‌ప్రదేశ్



ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. వరద నీరు రెండు రాష్ట్రాలకు వ్యాపించే అవకాశం ఉన్నందున నేపాల్ సరిహద్దు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాయి. ఈ మేరకు బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి అధ్యక్షతన బుధవారం అత్యవసర సమావేశం జరిగింది. జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. డ్యామ్‌లు, కరకట్టలపై 24 గంటల నిఘా పెట్టాలని, రాత్రివేళల్లోనూ పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో లౌడ్‌స్పీకర్లతో హెచ్చరికలు జారీ చేయాలని, అత్యవసర పరిస్థితులకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి స్పష్టం చేశారు. నేపాల్ వరదల నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. . ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ముఖ్యమంత్రి యోగీ బుధవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. గండక్, నారాయణి నదులలో నీటి మట్టాలు పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ ప్రభావంతో మహారాజ్‌గంజ్, కుషీనగర్ జిల్లాలలో వరదలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. స్థానిక యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

# వనపర్తి కాంగ్రెస్‌లో కొత్త సమీకరణాలేనా?

## మేఘారెడ్డికి ఉన్నత పదవి ఇవ్వాలని చర్చ..

## కాంగ్రెస్ వర్గ విభేదాల సయోధ్యపై ఆసక్తి



**వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్‌లో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయా? ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి కీలక పదవి దక్కితే పార్టీ అంతర్గతంగా నెలకొన్న విభేదాలకు తెరపడటంతో పాటు వర్గ విభేదాలతో సతమవుతున్న కార్యకర్తలను ఒకే వేదికపైకి తీసుకురావచ్చా? ప్రస్తుతం నియోజకవర్గ రాజకీయ వర్గాల్లో ఇదే అంశంపై చర్చ జరుగుతోంది. మేఘారెడ్డికి ఉన్నత పదవి ఇవ్వాలన్న డిమాండ్ కూడా ఎమ్మెల్యే అనుచరులు, కార్యకర్తల్లో క్రమంగా వినిపిస్తుండటంతో ఈ చర్చకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.**

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి): వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్‌లో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయా? ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి కీలక పదవి దక్కితే పార్టీ అంతర్గతంగా నెలకొన్న విభేదాలకు తెరపడటంతో పాటు వర్గ విభేదాలతో సతమవుతున్న కార్యకర్తలను ఒకే వేదికపైకి తీసుకురావచ్చా? ప్రస్తుతం నియోజకవర్గ రాజకీయ వర్గాల్లో ఇదే అంశంపై చర్చ జరుగుతోంది. మేఘారెడ్డికి ఉన్నత పదవి ఇవ్వాలన్న డిమాండ్ కూడా ఎమ్మెల్యే అనుచరులు, కార్యకర్తల్లో క్రమంగా వినిపిస్తుండటంతో ఈ చర్చకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

### క్షేత్రస్థాయి నుంచి శాసనసభ వరకు..

తూడి మేఘారెడ్డి రాజకీయ ప్రస్థానంలో క్షేత్రస్థాయి పరిచయాలు, కార్యకర్తలతో అనుబంధం కీలకంగా మారినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. గ్రామాలు, మండలాల్లో పార్టీ శ్రేణులతో సంబంధాలు కొనసాగిస్తూ రాజకీయంగా ఎదిగిన ఆయనకు తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం లభించింది. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కూడా కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండే ప్రయత్నం చేస్తున్నారనే అభిప్రాయం నియోజకవర్గంలో ఉంది. ఎన్నికల్లో గెలిచిన తర్వాత కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా అభివృద్ధి, సంక్షేమ అంశాలపై దృష్టి సారిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించడం ఆయన రాజకీయ శైలిలో భాగంగా మారిందని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ప్రతిపక్షాలు సైతం ప్రధానంగా ఎమ్మెల్యే మేఘా రెడ్డిని టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో ఇతరత్రా వేదికల్లో ఎమ్మెల్యేపై ఘాటుగా విమర్శలు చేస్తూ ఆయన పేరు నిత్యం ప్రజలలో క్షేత్రస్థాయి నుండి ఢిల్లీ అధిష్టానం వరకు చర్చనీయంగా మారింది. ఇది కూడా ఒక రకంగా ఎమ్మెల్యేకు పాజిటివ్ కోణాన్ని ఏర్పరుస్తుందని విశ్లేషకులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత వనపర్తి రాజకీయాల్లో ఉత్కంఠ భరితంగా మారిన కోణంలో ఎమ్మెల్యే రాజకీయ భవిష్యత్తుపై అభిప్రాయాలు, విశ్లేషణలు చేస్తూ ఎమ్మెల్యేకు ఉన్నత పదవి ఇస్తే వనపర్తి జిల్లాకు మరింత మంచి జరుగుతుందని, అభివృద్ధి జరుగుతుందని, జిల్లాపై పట్టు వస్తుందని, కార్యకర్తలకు భరోసా ఉంటుందని, వర్గ విభేదాలు పూర్తిగా తొలగిపోతాయని క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో, ప్రజలలో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### 'అందరినీ కలుపుకొని' ముందుకు?

వనపర్తి కాంగ్రెస్‌లో సీనియర్ నేత డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి ప్రభావం ఒకవైపు కొనసాగుతుండగా, ఎమ్మెల్యేగా మేఘారెడ్డి తనదైన రాజకీయ స్థావరాన్ని బలోపేతం చేసుకుంటున్నారనే చర్చ ఉంది. దీంతో ఈ రెండు వర్గాల మధ్య సమన్వయం పార్టీ భవిష్యత్ రాజకీయాలకు కీలకంగా మారింది. రాష్ట్ర నాయకత్వం ఇద్దరి మధ్య సమన్వయం పెంచే దిశగా చర్యలు తీసుకుంటే నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు మరింత రాజకీయ ప్రయోజనం కలుగుతుందని పార్టీ శ్రేణుల్లో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా సీనియర్లకు గుర్తింపు, ప్రాధాన్యం ఇస్తూ జూనియర్లకు అవకాశాలు ఇస్తూ 'ఆ వర్గం ఈ వర్గం'అనే తేడా లేకుండా క్షేత్రస్థాయిలో ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యం కల్పించే విధంగా నాయకత్వం ఉండాలని క్షేత్రస్థాయి కార్యకర్తలు కోరుతున్నట్లు సమాచారం.

### ఉన్నతమైన అవకాశాలు ఐస్తే సమీకరణాలు మారుతాయా?

మేఘారెడ్డికి ఉన్నత పదవి ఇస్తూ మరింత అవకాశం లభిస్తే వనపర్తి రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఉన్నత హోదా ఇస్తే నియోజకవర్గానికి అదనపు నిధులు, అభివృద్ధి కార్యక్రమాలు తీసుకు రావడంతో పాటు పార్టీ సంస్థాగత వ్యవహారాలపై కూడా బలమైన ప్రభావం పెరిగే అవకాశం ఉంటుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు. అదే సమయంలో ఉన్నత అవకాశం అనేది కేవలం వ్యక్తిగత రాజకీయ ఎదుగుదల కాకుండా కాంగ్రెస్‌లోని వివిధ వర్గాలను ఏకం చేసే బాధ్యతను కూడా పెంచుతుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. సీనియర్ నేతల అనుభవాన్ని, యువ నాయకత్వం చురుకుదనాన్ని కలిపి ముందుకు తీసుకెళ్లగలిగితే వనపర్తిలో పార్టీ మరింత బలోపేతం కావచ్చని అభిప్రాయపడుతున్నారు.

### ప్రతిపక్షాల వ్యూహాలపైనా ప్రభావం

వనపర్తి కాంగ్రెస్‌లో అంతర్గత సమన్వయం పెరిగి పార్టీ శ్రేణులు ఏకతాటిపైకి వస్తే ప్రతిపక్ష పార్టీలపై కూడా రాజకీయంగా ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం గ్రామస్థాయి నుంచి పట్టణం, జిల్లా వరకు కాంగ్రెస్ తన సంస్థాగత బలాన్ని పెంచుకునే ప్రయత్నం ఉంటుంది. వచ్చే స్థానిక సంస్థల రాజకీయాలను దృష్టిలో ఉంచుకుంటే కార్యకర్తల ఐక్యత, నాయకుల మధ్య సమన్వయం అత్యంత కీలకంగా మారనుంది.

ప్రతిపక్షాలకు సైతం జిల్లా అభివృద్ధియే సమాధానంగా చేసి చూపించగల అవకాశం లేకపోలేదు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అభివృధిలో భాగంగా రోడ్ల విస్తరణ, చెరువు కట్టల పునరుద్ధరణ, వనపర్తి అవసరాలకు కావలసిన అభివృద్ధి పనులు, మెడికల్, ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాలలు, రైతు వేదికలు, ఇలా పలు అభివృద్ధి పనులు జరిగాయి. పలు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు జరిగాయి. అదే కోణంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా ఎమ్మెల్యే స్థాయిలో పోటాపోటీగా అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, నిధుల మంజూరు చేస్తున్నారు. ఎమ్మెల్యేకు ప్రభుత్వంలో ఉన్నత పదవి వస్తే వనపర్తి జిల్లాకు మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉందని వనపర్తి జిల్లాకు మేలు జరుగుతుందని, స్థానిక ప్రజల నుంచి కార్యకర్తలను అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. రాజకీయ భవిష్యత్తు, నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యంపెరుగుతుందని ప్రజల్లో మరింత బలమైన ముద్ర వేసే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. సాగునీరు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి, అభివృద్ధి పనులు వంటి స్థానిక సమస్యల పరిష్కారంపై నిరంతర దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఏదేమైనా జిల్లాకు మంచి జరుగుతుందని, అభివృధి చెందుతుందని రాష్ట్రంలో వనపర్తి జిల్లా పురోగతిలో ఐకానిక్ డిస్ట్రిక్ట్ గా మారుతుందనీ వేగంగా అభివృద్ధి పనులు జరగాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### అధిష్ఠానం నిర్ణయంపైనే ఉత్కంఠ

మొత్తంగా వనపర్తి కాంగ్రెస్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు భవిష్యత్ రాజకీయాలకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. మేఘారెడ్డికి కీలక బాధ్యత దక్కుతుందా? నాయకుల వర్గ విభేదాలు సమసిపోయి నేతల మధ్య సమన్వయం ఏర్పడుతుందా? పార్టీని అందరినీ కలుపుకొని నడిపించే కొత్త ఫార్ములా తెరపైకి వస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే ఇవన్నీ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలే. తుది నిర్ణయం మాత్రం కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకోవాల్సి ఉంది. ఏ నిర్ణయం వెలువడినా వనపర్తి కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై దాని ప్రభావం గణనీయంగా ఉండే అవకాశముంది.

## కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

ఉన్న ప్రయాణికుల తలలో గుచ్చుకోవడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద ఘటన తర్వాత బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం 9గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ఆరుగురి మృతదేహాలు ప్రస్తుతం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎస్పీ కోదాడ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించడం పట్ల క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యతగా బస్సుల యాజమాన్యం వ్యవహరించాలని సూచించారు.



## యంగ్ ఇండియా.. స్పోర్టింగ్ ఇండియా

మొదటిపేజీ తరువాయి..

ఎంవోయూ చేసుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. దక్షిణ కొరియా వెళ్లినప్పుడు కేఎన్ఎస్‌యూ బృందాన్ని కలిసి భాగస్వామ్యంపై చర్చించిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీతో ఎంవోయూ తెలంగాణ క్రీడా ప్రతిభకు అథ్లెటిక్ శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, అత్యున్నత స్థాయి విద్య విధానాలకు వారధిగా సీఎం అభివర్ణించారు. పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా 31 పతకాలు సాధించగా అందులో కేఎన్ఎస్‌యూలో శిక్షణ పొందిన అథ్లెట్లు 16 మంది ఉన్నారని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. కేఎన్ఎస్‌యూ విశిష్ట సంస్కృతి రాష్ట్రానికి తీసుకురావాలనుకుంటున్నామని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో యువ అథ్లెట్లకు ప్రపంచ స్థాయి క్రీడా సామర్థ్యాలు నేర్చుకునే కొత్త అవకాశాలు సృష్టించేలా ఎంవోయూ చేసుకోవడంలో క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, అధికారులు కీలక పాత్ర పోషించారంటూ రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. మన దేశం 2036 ఒలింపిక్స్ వైపు చూస్తున్న సందర్భంలో కేవలం ఆతిథ్యం ఇవ్వడమే కాకుండా, భారత్ గర్వకారణంగా నిలిచే క్రీడాకారులను తయారు చేసేందుకు తెలంగాణ సిద్ధమవుతోందన్న సీఎం యంగ్ ఇండియా, స్పోర్టింగ్ ఇండియా అంటూ వ్యాఖ్యానించారు. కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీతో యంగ్ ఇండియా ఫిజికల్



ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం తెలంగాణ క్రీడా రంగానికి చరిత్రాత్మక ముందడుగని క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభివర్ణించారు. ప్రపంచ స్థాయి క్రీడా శిక్షణను రాష్ట్ర క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మన ప్రతిభకు అంతర్జాతీయ వేదికలు మరింత చేరువ కానున్నాయని వివరించారు.

## తెలంగాణ సమ్మిట్ కోసం వార్ రూమ్

మొదటిపేజీ తరువాయి..

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడి దారులను ఆకర్షించాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే పక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.



Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967